


# ఆనందలోకం

జానపద నవల

బాలసాహిత్యరత్న

## నారంశెట్టి ఉమామహేశ్వరరావు

# ఆనందలోకం

(జానపద నవల)

నారంశెట్టి ఉమామహేశ్వరరావు

బొమ్మలు : తుంబలి శివాజీ

మంచి పుస్తకం

# విశ్వజనీనం బాలసాహిత్య ప్రయోజనం

'ఎక్కడైనా ఇలా జరుగుతుందా, చోద్యం కాకపోతే...' అనే పదాలకు బాలసాహిత్యపు ఖజానా అయిన జానపద కథాసాహిత్యంలో స్థానం లేదు. 'ఇలా జరిగితే ఎంత బాగుంటుంది!' అనే వూహ బాలబాలికలకు అంతులేని సంతృప్తిని కలిగిస్తుంది. రాజులూ, కోటలూ, సింహాసనాలూ, అంతఃపురం మహారాణి, యువరాణి. ఉద్యానవనాలు, మంత్రగాళ్ళు, పర్వతాకారులైన రాక్షసులూ, కీకారణ్యాలూ, పంచకళ్యాణీలూ, భూగర్భంలో దాగివున్న బంగారం, రత్నరాసులూ, జంతువులుగా మారిపోయిన మనుషులూ, దుర్మార్గులను, కరువు కాటకాలను అంతంచేసే యువకిశోరాలూ – ఓహ్! మాట్లాడే చిలుకలు సరేసరి – కేవలం జానపద సాహిత్యంలో మాత్రమే చూడగలం.

భౌతిక జీవితం, సామాజిక జీవితం చిత్రించే కథలు బాలబాలికలకు అంతగా ఆసక్తి కలిగించవన్నది కొన్ని పదుల సంవత్సరాలనుండి రుజువవుతున్న సత్యం. ఆమాటకొస్తే చాలామంది పెద్దలకు కూడా జానపద సాహిత్యం మీద పఠనాభిలాష ఇప్పటికీ తగ్గలేదు. బాలల కథల పత్రికలను, అందునా జానపద సాహిత్యానికి పెద్ద పీట వేసే పత్రికలను పెద్దలే ఎక్కువగా ఆదరిస్తున్నారు.

శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచన 'ఆనందలోకం' పాఠకులకు అద్భుతలోకాన్ని ఆవిష్కరిస్తుంది. తొలి వాక్యం మొదలుపెడితే చివరి వాక్యం వరకు ఆపకుండా చదివించే శక్తి 'ఆనందలోకానికి' ఉంది.

ఎక్కడికక్కడ గొలుసులు బిగించుకుంటూ సంఘటనలు వూపిరి సలపనివ్వని విధంగా కల్పించుకుంటూ శ్రీ నారంశెట్టి రచన 'ఆనందలోకం' సాగిపోతుంది. వ్యర్థ పదాలు సాధ్యమైనంతగా పరిహరించిన ఈ రచన

బాలసాహితీకారులకు ఒక మార్గదర్శిగా కూడా కాగలదని నా నమ్మకం.

త్రిశంకు స్వర్గం నమూనాగా ఆనందలోకం సృష్టించాడు ఒక తపోధనుడు. చెయ్యితిరిగిన రచయిత మాత్రమే అటు పౌరాణికానికీ, ఇటు కాల్పనికతకూ సాహితీ వారధి నిర్మించగలడు.

ప్రజా ప్రయోజనాలకోసమే రాచరిక వ్యవస్థ పనిచేయాలన్నది సాహిత్య పరమైన ఉపదేశం అయితే 'ఆనందలోకం'లో విశ్వజనీనమైన ప్రయోజనమే పరమావధిగా ఈ రాచరిక వ్యవస్థ మనుగడ అని రచయిత అభిలషిస్తాడు.

ఇటువంటి అభిలాషలూ, ఆశయసాధనాలూ చెప్పడానికే జానపద సాహిత్యం అవసరపడుతుంది. 'ఎక్కడైనా ఇలా జరుగుతుందా, చోద్యం కాకపోతే...' అనకపోతే 'ఆనందలోకపు' విహారానికి బయలుదేరండి! అవశ్యం!

**ఎమ్.వి.వి. సత్యనారాయణ**

విశాఖపట్నం
**18.07.2015**

క్రీకారణ్యం. అరణ్యం మధ్యలో ఒక ఆశ్రమం. అరణ్యంలో ఆకాశాన్ని తాకినట్లు ఎత్తయిన చెట్లు. వాటి నీడల చాటున ప్రశాంతమైన వాతావరణంలో ఉంది ఆశ్రమం. అందమైన పూలమొక్కలు ఆశ్రమానికి శోభనిస్తున్నాయి. పూల సువాసనలు గుబాళించి ఆశ్రమ వాతావరణానికి మరింత సొగసులు అద్దుతున్నాయి.

అతి దగ్గరగా స్వచ్ఛమైన నీరుతో పారుతున్న సెలయేరు గలగలలు ఉత్సాహం పుట్టిస్తాయి. ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోందక్కడ. ఆ గాలి పీలిస్తేనే దీర్ఘరోగాలు నయమైపోతాయేమో అనిపించేంత గొప్పగా ఉందక్కడ. వాటి మధ్యన ఒక పర్ణశాల ఉంది. అక్కడ అనేక మంది విద్యార్థులు శ్రద్ధగా విద్యనభ్యసిస్తున్నారు. వారంతా ఆరు సంవత్సరాలు మొదలు పదిహేను, పదహారేళ్ళ పిల్లలు.

వారికి గురువు విద్యాచతురుడు. ఆయన సకల శాస్త్రాలు తెలిసినవాడు. గురుకులంలో చేరిన వారికి పదేళ్ళ పాటు విద్యనేర్పి సకలశాస్త్ర పారంగతులు అయ్యారని నిర్ధారించుకున్న తరువాతనే వారిని అక్కడ నుండి పంపిస్తాడు. విద్యాచతురుడికి ఎనభై ఏళ్ళ వయసు దాటింది. ఆయన అలా కనిపించడు. ఎప్పుడూ కాషాయవస్త్రాలు ధరించి నుదుట సింధూరం బొట్టు పెట్టుకొంటాడు. గడ్డం, తల మీద జుత్తు తెల్లగా నెరిసి ఉంటుంది. ప్రశాంతమైన వదనంతో కనిపించే ఆయనను చూస్తే ఎవరైనా సరే ఆయన ఒక మునీశ్వరుడు అనుకుంటారు. వెంటనే చేతులెత్తి నమస్కారం పెట్టాలనిపించేలా దైవత్వం ఉట్టిపడే రూపం.

విద్యాచతురుడి వద్ద విద్య నేర్చుకోడానికి వచ్చేవారంతా సామాన్యులే. ఆయన విద్య నేర్పే విధానం, అక్కడ చదివిన పిల్లల ప్రతిభా పాటవాలు తెలుసుకున్న చుట్టుపక్కల రాజ్యపాలకులు తమ ఆస్థానంలో వారికి తగిన పదవులిచ్చి గౌరవించేవారు. కొన్నాళ్ళకు రాజ్యపాలకులు తమ పిల్లలను కూడా అక్కడ చేర్పించడానికి ముందుకొచ్చారు. అయినప్పటికీ సామాన్యులకు విద్య నేర్పడం మానలేదు విద్యాచతురుడు.

విద్యాచతురుడికి ఒక నియమం ఉంది. తన వద్ద విద్య అభ్యసించాలని వచ్చేవారిని ముందుగా తగిన పరీక్షలు జరిపి వారి విద్యాతృష్ణని, ప్రతిభని అంచనా వేసి చేర్చుకుంటాడు. ఆయన సంతృప్తి చెందిన తర్వాత అక్కడ చేరిన విద్యార్థులకు తిరుగే ఉండదు. అంత శ్రద్ధగా వారికి విద్య బోధిస్తాడు. పిల్లలకు వారి వయసుని బట్టి విద్యాబుద్ధులు నేర్పుతాడు. అక్షరాభ్యాసం జరిపిన తర్వాత వారి వయసుకి తగినట్లు ధర్మసూక్ష్మాలు, లోకజ్ఞానం, శాస్త్రాలు, పురాణాలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం ఇలా అన్నీ బోధిస్తాడు. రాజ వంశీయులకైతే అదనంగా రాజనీతి, పరిపాలనా విధానం, యుద్ధవిద్యలు నేర్పి సకల శాస్త్ర పారంగతుడయ్యాడని ధృవీకరించి వారి వారి రాజ్యాలకు తిరిగి పంపిస్తాడు.

ఆయన భార్య యశోదాదేవి. పరిపూర్ణమైన మాతృమూర్తి. మరో ఇద్దరు సేవకుల సహాయంతో యశోదాదేవి స్వయంగా వండి పిల్లలందరికి వడ్డిస్తుంది. తల్లిదండ్రులకు దూరమైన పిల్లలకు తల్లి ప్రేమను అందిస్తుందామె. వారు తినే ఆహారంలో పదార్థాలతో బాటు గురుపత్ని అందించే ప్రేమాభిమానాలు పిల్లల్ని కట్టిపడేస్తుంటాయి. పిల్లలతో బాటు లేడిపిల్లలు, నెమళ్ళు, కుందేళ్ళు అక్కడ తిరుగుతూ గురుపత్ని చేతి నుండి అందే దుంపలు, పండ్ల రుచి చూస్తుంటాయి. ఆనందంతో గెంతులేస్తుంటాయి.

ప్రతిరోజులాగే ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొని అల్పాహారం ముగించి గురువు గారిని సమీపించారు పిల్లలు. గురువు గారికి నమస్కారం పెట్టి చేతులు కట్టుకొని నిలబడ్డారు. అందరి ముఖాల్లోకి చూస్తున్న విద్యాచతురుడు వారిలో తన ప్రియమైన శిష్యుడు కనబడక పోయేసరికి కొంత అసహనానికి గురయ్యాడు.



'విజయుడు కనిపించడం లేదేం?' అని ప్రశ్నించారు ఆయన. దానికి పిల్లలు 'ఈ రోజుతో ఆయన విద్యాభ్యాసం పూర్తయి ఇంటికి వెళ్ళాల్సి వస్తుంది. ఆ బాధతో అశోకవృక్షం కింద కూర్చుండి దుఃఖిస్తున్నాడు,' అని చెప్పారు.

దానికి విద్యాచతురుడు 'అయ్యయ్యో అలా బాధ పడతాడేం? ఇంటికి వెళ్ళేందుకు సంబరపడాలి కదా ఎవరైనా!' అంటూ 'నేనే వెళ్ళి విజయుడిని సముదాయిస్తాను,' అని అక్కడినించి కదిలాడు.

* * *

హేళాపురి రాజ్యాన్ని విక్రమదేవుడు పరిపాలించేవాడు. ఆయన తన ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకునేవాడు. ధర్మంగా పాలన చేసేవాడు. ఆయనకు అన్నివిధాల సరిజోడి మహారాణి వకుళాదేవి. ఆమె పరమ దైవభక్తురాలు. విక్రమదేవుడు ఆదర్శంగా పాలన సాగించాలని ప్రతిరోజూ దైవాన్ని ప్రార్థించేది. ఇక విక్రమదేవుడు రాజ్యం సుభిక్షంగా ఉండేందుకు ఎప్పుడూ యజ్ఞాలు, యాగాలు నిర్వహించి ప్రజలకు ఈతిబాధలు లేకుండా,

తన రాజ్యానికి యుద్ధభయం తెలియకుండా చూసేవాడు. ఇరుగుపొరుగు రాజ్యాల రాజులతో మైత్రి కొనసాగించేవాడు.

హేళాపురి రాజ్యానికి దక్షిణ దిక్కునున్న వంగరాజ్య రాజపుత్రిక వకుళాదేవి. విక్రమదేవుడి తండ్రి రంతిదేవుడూ, వకుళాదేవి తండ్రి మనోహర వర్మ మంచి మిత్రులు. వారిరువురూ తమ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకో దలచి తమ పిల్లలకు పెళ్ళి చేశారు.

వారిద్దరి మనస్తత్వాలు ఎరిగి ప్రవర్తించే మంచి మనిషి మంత్రి మాధవయ్య. చక్కటి సలహాలిచ్చి రాజ్యపాలన భేషుగ్గా జరిగేలా సహాయ పడేవాడు. విక్రమదేవుడి తండ్రి కాలం నుండీ మాధవయ్య పనిచేస్తూ వారి అభిమానాన్ని పొందాడు.

విక్రమదేవుడికీ, వకుళాదేవికీ వివాహం జరిగి పదేళ్ళయినా వారికి సంతానం కలగలేదు. సంతానం కావాలని ఎందరో దేవుళ్ళకు మొక్కుకున్నారు. ముడుపులు కట్టారు. వైద్యులకు చూపించారు. మునులను దర్శించి సేవలు చేసుకున్నారు. ఫలితం లేకపోయింది.

రాజభోగాలున్నప్పటికీ వేటినీ అనుభవించకుండా సామాన్య స్త్రీ వలె గడిపేది వకుళాదేవి. ఎప్పుడూ పూజలూ, నోములూ, వ్రతాలు చేస్తూ ఉపవాసం ఉంటూ కాలం గడిపేది. తన మనోవ్యధని మరిచేందుకు కాలం తెలియకుండా గడిపేస్తున్న వకుళాదేవి శోకం చూడలేకపోయేవాడు విక్రమదేవుడు. ఆయనా లోలోపల విచారించేవాడు.

ఒకరోజు రాణి వకుళాదేవితో ఉద్యానవనంలో విహరిస్తున్న సమయంలో విక్రమదేవుడు 'దేవీ మీ బాధ చూడలేకపోతున్నాను. మనకు ఈ జన్మకు సంతాన ప్రాప్తి లేదేమో అనిపిస్తోంది. మనం మన రాజవంశీయులెవరి బిడ్డనైనా దత్తత తీసుకుందామా?' అని అడిగాడు.

దానికామె ససేమిరా వద్దని చెప్పింది. 'మన రక్తం పంచుకొని పుట్టేవాడి కోసం నా ఆరాటం మహారాజా!' అంది.

దానికి మహారాజు విక్రమదేవుడు 'దేవీ! మనిద్దరి జాతకాలు పరీక్షించిన ప్రధాన జ్యోతిష్కుడు కూడా మనకు సంతాన యోగం ఉందని చెప్పారు. అయితే ఆలస్యం అవుతుందని చెప్పారు. కాబట్టి మనం దేవుడిని ప్రార్థిస్తూ

ఎదురు చూద్దాం,' అంటూ సముదాయించాడు. ఆమె తల ఊపింది.

ఈ సంఘటన జరిగిన మూడు రోజుల తర్వాత మహారాణి మందిరానికి పరుగుపరుగున ఒక చెలికత్తె వచ్చింది. ఆ చెలికత్తె పేరు చిత్రాంగి. చిత్రాంగి తల్లి అక్కడే పనిచేసేది. అందువల్ల తల్లితో అనేక మార్లు చిన్న వయసులోనే రాణిగారి భవనానికి రావడం ఆమెకు అలవాటు. తల్లి చనిపోవడంతో చిత్రాంగి అక్కడే పనిలో చేరింది. చిత్రాంగికి మేనబావ వేణుడు అంటే ఎక్కువ ఇష్టం. ఆ విషయం మహారాణికి తెలుసు. రాణిగారికి పిల్లలు లేకపోవడం వల్ల చిత్రాంగిని కూతురులా చూసుకుని ఆదరించేది.

'జయము జయము మహారాణీ!' అంది చిత్రాంగి నమస్కరిస్తూ.

వకుళాదేవి పూజమందిరం నుండి బయటకు వచ్చింది. 'ఏమిటే చిత్రాంగీ, హుషారుగా ఉన్నావు. మీ బావ ఊరునుండి వచ్చాడా? సెలవు అడగాలని వస్తున్నావా?' అని అంది వకుళాదేవి.

దానికి చిత్రాంగి సిగ్గుపడి తల అడ్డం తిప్పింది. 'కాదమ్మా. మన రాజ్యంలోకి ఒక మహిమ గల సాధువు వచ్చినట్లు తెలిసింది. ఆయన ఊరు బయటున్న కాళికాదేవి ఆలయంలో ఉన్నాడనీ, తన మహిమలతో జనం కోరిన కోరికలు తీరుస్తున్నాడని చెప్పుకుంటుంటే విని తమ వద్దకు వచ్చాను,' అంది.

వకుళాదేవి 'అలాగా. నన్నేం చేయమంటావో చెప్పు. నీకూ మీ బావకి పెళ్ళి ముహూర్తం పెట్టించ మంటావా?' అని అడిగింది.

'అది కాదమ్మా. మన రాజ్యాన్ని పాలించడానికి వారసుడు రావాలని ప్రజలందరికీ కోరికగా ఉంది. మహారాణిగారికి సంతాన యోగం కోసం సాధువును దర్శించమని మనవి చేయాలని నా ఉద్దేశం,' అంది చిత్రాంగి.

మహారాణి 'అయ్యో చిత్రాంగీ! నీవెంత అమాయకురాలివే? మేమెంత మంది మునులను సేవించామో, ఎందరి ఋషిపత్నులను పూజించామో నీకు తెలియంది కాదు. మళ్ళీ కొత్తగా ఈ సాధువుని దర్శిస్తే మాత్రం ప్రయోజనం ఏముంటుంది? మహారాజుగారి ముఖ్య కార్యాలు ఆపుచేయించి కాలాన్ని వ్యర్ధపరచడం తప్ప!' అంది.

వినయంగా మరో మారు నమస్కరించి 'అమ్మా! ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు. ఈ సాధువుకు మహిమలున్నాయని అంతా గోలగోలగా

చెప్పుకుంటుంటే విన్నాను. ఆ కబురు మీ దగ్గరకు మోసుకు వచ్చాను. ఈ ఒక్కసారికి నా మాట విని వెళ్ళండమ్మా,' అంది చిత్రాంగి.

వకుళాదేవి ఒప్పుకుంది. వెంటనే ఒక భటుడి ద్వారా మహారాజుగారికి కబురు పంపింది.

వకుళాదేవిని చూసేందుకు మహారాజు విక్రమదేవుడు విచ్చేసాడు. ఆమె మాటలు విని 'సరే, మీ ఇష్టం దేవీ,' అని రథం సిద్ధం చేయమని భటులను ఆదేశించాడు.

అక్కడే ఉన్న చెలికత్తె ఒకతె 'అమ్మా! మీరెందుకు అక్కడికి వెళ్ళడం. ఆ సాధువునే ఇక్కడికి రప్పించవచ్చు కదా!' అని విన్నవించుకుంది.

వకుళాదేవి 'మహానుభావులను మన దగ్గరికి రప్పించుకోకూడదు. మనమే వెళ్ళి వారిని దర్శించుకోవాలి. మేము ప్రజలకు మాత్రమే పాలకులం. మీకు మాత్రం మహారాజు, మహారాణి. మమ్మల్ని కన్న తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువు, సృష్టికి మూలాధారమైన దైవం, మహిమాన్వితులైన సాధువుల ముందు మేము సాధారణమైన వ్యక్తులమే,' అంది.

ఆశ్రమం చేరుకుంది రథం. సాధువుని కలిసారు. ఆయన నేల మీద పరిచిన పులి చర్మం మీద కూర్చుండి కనిపించాడు. కళ్ళు మూసుకుని కాళికాదేవిని ధ్యానిస్తున్నాడు. ఆయన చేతిలో కమండలం, పక్కన తోలు సంచి ఉన్నాయి. మహారాజు దంపతులు వచ్చి చాలాసేపు వేచి చూసారే తప్ప, సాధువుకి ధ్యానభంగం చెయ్యలేదు. మూడు గంటల తర్వాత నెమ్మదిగా కళ్ళు విప్పిన సాధువు అక్కడికి వేంచేసి ఉన్న రాజదంపతులను చూసి ఆశ్చర్యపోయాడు.

'రాజ దంపతులారా, సుఖీభవ! ఇప్పుడే కాళికామాత మీ ఆగమనం గురించి నాకు చెప్పింది. మీకు సంతానం ప్రాప్తించే దీవన ఇమ్మంది,' అన్నాడు సాధువు.

రాజదంపతులు ఆశ్చర్యపోయి సంతోషంతో పులకరిస్తూ సాధువు పాదాల మీద పడ్డారు. సాధువు వారిని దీవించి తన పక్కన ఉన్న తోలు సంచీలో చేయి పెట్టి ఒక మామిడి పండు తీసాడు. అమ్మవారి పాదాల ముందు పెట్టి దానికి పసుపు, కుంకుమతో పూజ చేసి తన మంత్రబలంతో దానిని శక్తిమంతం చేసాడు.



ఆ పండును రాజదంపతుల చేతికిచ్చి 'మీరిరువురు రాజభవనం చేరిన తరువాత తొలిరేయిలో శుచిగా స్నానమాచరించి కాళికాదేవిని పూజించి ఈ ఫలాన్ని ఆరగించండి. మీ అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా అసామాన్యుడు, ధీరుడు, యోధుడు, బుద్ధి, యశో గుణ సంపన్నుడు కొడుకుగా జన్మిస్తాడు. ఇది నా మాట కాదు. కాళికాదేవి అనుగ్రహం,' అని దీవించాడు.

రాజదంపతుల ఆనందానికి అంతులేక పోయింది. సాధువుని తమ ఆస్థానానికి మంగళ వాయిద్యాల ధ్వనుల నడుమ పల్లకీలో ఊరేగించి తోడ్కొని వెళ్ళారు. సకల మర్యాదలు చేసారు. తమ రాజ్యంలో కొన్నాళ్ళు ఉండమని కోరారు. తాను సర్వసంగ పరిత్యాగినని, దేశ సంచారం తప్ప ఒకే ప్రదేశంలో ఉండలేనని సాధువు చెప్పడంతో రెండు రోజుల తర్వాత ఆయనకు వీడ్కోలు పలికారు.

సాధువు చెప్పిన విధంగా మామిడిపండుని ఆరగించారు రాజ దంపతులు. మనసులోని బాధను విడిచి పెట్టి చాలా సంతోషంగా గడపడం అలవాటు చేసుకున్నారు వారు. ప్రజలకు ఈ వార్త తెలిసిపోవడంతో వారందరూ సంతోషించారు.

కొన్నాళ్ళ తరువాత మహారాణి గర్భం ధరించినట్టు రాజవైద్యులు నిర్ధారించారు. తొమ్మిది నెలల తర్వాత అందమైన మగశిశువుకు జన్మనిచ్చింది వకుళాదేవి. రాజదంపతుల ఆనందానికి అంతులేదు. సాధువు చెప్పిన మాట నిజమైంది. కాళికాదేవి తమను ఇన్నాళ్ళకు కరుణించినందుకు మనస్ఫూర్తిగా దైవానికి ధన్యవాదాలు చెప్పుకున్నారు. బాలసారె ఘనంగా జరిపించి తమ వారసుడికి విజయుడు అని నామకరణం చేసారు. విజయుడు జన్మించిన సందర్భంలో హేళాపురి రాజ్యం యావత్తూ ఉత్సవ వాతావరణం అలుముకుంది.

విజయుడుకి నాలుగు సంవత్సరాల నాలుగు నెలల నాలుగు రోజులు నిండగానే అక్షరాభ్యాసం చేయించారు. ఆయన అతి తొందరగా విద్యా విషయాలు నేర్చుకునేవాడు. గురువులను రప్పించి విద్యను రాజభవనంలోనే చెప్పించాలని వకుళాదేవి ఆశపడింది. కానీ విక్రమదేవుడు ఆమె కోరికను అంగీకరించలేదు.

'దేవీ! మన కుమారుడు ఈ రాజ్యానికి భావిమహారాజు. విజయుడిని ముద్దు చేసి విద్యలకు దూరం చెయ్యవద్దు. అతడిని అందరి పిల్లల్లాగే గురుకులంలో చేర్పిద్దాం. కష్టసుఖాలు తెలుసుకొని పెరుగుతాడు. ఓర్పు పెంచుకుంటాడు. విద్య అనేది ఒక్కడికే నేర్పితే ప్రతిభ బయటపడదు. పదిమందిలో ఉన్నప్పుడే రాణింపు ఎక్కువవుతుంది,' అని బోధ పరిచాడు మహారాజు.

మహారాణి అయిష్టంగానే అంగీకరించింది.

మంచి గురుకులాన్ని వెదికే బాధ్యత మంత్రి మాధవయ్య మీద వేసాడు విక్రమదేవుడు. అనుచరులను నలుదిక్కులకు పంపి గురుకులాల వివరాలు తెప్పించాడు మాధవయ్య. తమ రాజ్యంలోనే దక్షిణ దిక్కున కీకారణ్యంలో ఉన్న నందనవనంలో విద్యాచతురుడు నడుపుతున్న గురుకులం ఉత్తమమైనదిగా తేల్చాడు మంత్రి మాధవయ్య. విజయుడిని అక్కడే చేర్పించారు.

విజయుడికి పదహారు సంవత్సరాలు నిండేవరకు గురుకులంలో ఉండి అన్ని విద్యలూ నేర్చాడు. అతడొక సామాన్యకుటుంబంలో పుట్టిన పిల్లవాడిలాగానే పెరిగాడు. ఆరునెలలకోసారి రాజదంపతులు గురుకులానికి వచ్చి విజయుడిని చూసి తమ ప్రేమాభిమానాలు ప్రదర్శించి వెళ్ళేవారు.

విజయుడి విద్య పూర్తయినట్టు విద్యాచతురుడు రాజుగారికి వర్తమానం పంపించాడు. విజయుడిని గురుకులం నుండి రాజభవనానికి తీసుకెళ్ళేందుకు స్వయంగా మహారాజు విక్రమదేవుడు, రాణి వకుళాదేవి రాజధానీ నగరం నుండి బయలుదేరారు.

* * *

అశోకవృక్షం కింద కూర్చొని దుఃఖిస్తున్న విజయుడు అల్లంత దూరాన్నుండే గురువుగారు తన వైపు రావడం చూసి లేచి నిలబడ్డాడు. రెండు చేతులెత్తి ప్రణామాలు చేసాడు. విద్యాచతురుడు అతన్ని సమీపించి 'నాయనా! నీ విద్య పూర్తయిందని సంతోషపడాలి కానీ విచారం దేనికి?' అని అడిగాడు.

తన మిత్రుల ద్వారా తన విచారం సంగతి గురువు గారికి చేరినట్లు అర్ధమయింది విజయుడికి. గురువు గారి పాదాలు తాకి కళ్ళకద్దుకొని 'గురుదేవా. నాకు రాజభవనానికి వెళ్ళాలని లేదు. అలాగని విద్య పూర్తయిన తర్వాత ఇక్కడ ఉండిపోతే ప్రయోజనం లేదు. కానీ నేను నేర్చుకున్న విద్యలతో నా ఒక్క రాజ్యానికే కాక ఈ ప్రపంచానికి కూడా మేలు చేయాలని కోరు కుంటున్నాను. నా విద్యలను ప్రదర్శించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను,' అన్నాడు.

విద్యాచతురుడు ఎంతో సంతోషించి 'విజయా! నీ ఆలోచన చక్కగా ఉంది. ప్రయోజకుడు ఎప్పుడూ తన ఊరు, రాజ్యం అని పరిధులు విధించుకొని కూర్చోకూడదు. నువ్వు అన్నట్టే ఈ ప్రపంచం గురించి ఆలోచించాలి. ప్రపంచంలో నిత్యం అనేక సమస్యలతో బాధపడేవారు ఎందరో ఉన్నారు. నువ్వు రెండుమూడేళ్ళ పాటు దేశాటన చెయ్యి. లోకం తీరు తెలుస్తుంది. వివిధ దేశాల ఆచారాలు, పద్ధతులు బోధపడతాయి. నీ విద్య ప్రదర్శించే అవకాశమూ వస్తుంది. నీ వల్ల చాలా మంది ప్రజలకు మేలు జరుగుతుంది,' అన్నాడు.

విజయుడి ముఖంలో వెలుగు రేఖలు ప్రసరించాయి. కాసేపటికే వాటి స్థానంలో విచారం కమ్ముకుంది. 'ఏమైంది నాయనా?' అడిగాడు గురువు.

'మీ సూచన నాకు సమ్మతమే. కానీ మా తల్లిదండ్రుల అంగీకారం

దొరకడం కష్టం గురువర్యా!' అన్నాడు బాధగా విజయుడు.

విజయుడి తల మీద తన కుడిచేయి ఉంచి 'నువ్వు అధైర్యపడవద్దు నాయనా! వారికి నీ అభీష్టం తెలుపుతాను. వారిని ఒప్పించి నీ ప్రయాణానికి అనుమతి ఇప్పించే బాధ్యత నాది. శుభం భూయాత్,' అని ఆశీర్వదించారు విద్యాచాతురుడు. అంతలోనే విక్రమదేవుడి రథం గురుకులాన్ని చేరినట్లు కొందరు శిష్యులు వచ్చి చెప్పారు.

తల్లిదండ్రులను కలవబోతున్న ఆనందం కన్నా దేశాటనకు అనుమతి ఇప్పిస్తామన్న గురువు గారి మాటలే విజయుడికి సంతోషం కలిగించాయి.

* * *

గురుకులాన్ని చేరిన రాజదంపతులు ముందుగా గురువుగారికి వందనాలు సమర్పించారు. విద్యాచతురుడు వారిని ఆశీర్వదించి 'మహారాజా! మీ కుమారుడు విజయుడి విద్య నేటితో పూర్తయింది. అతడికి విద్య నేర్పిన గురువుగా నా మాట చెబుతాను. అతడికి గురువుగా విద్య నేర్పే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. విజయుడు ఏకసంథాగ్రాహి. విద్యార్థులందరికంటే అన్ని రంగాల్లో ముందున్నాడు. ఇతరులు మనసులో అనుకున్నవి కూడా గ్రహించి ఆచరించే సూక్ష్మగ్రాహి. ఈ లోకానికి మేలు చెయ్యాలనే సంకల్పం బలంగా ఉన్నవాడు. ఆయన ఖడ్గ విద్యా పరాక్రమాన్ని మీరు స్వయంగా చూడండి,' అని చెప్పి పర్ణశాలకు దక్షిణ వైపున ఉన్న మైదానం దగ్గరికి తీసుకువెళ్ళాడు.

తమ వారసుడు ఆరడుగుల పొడుగుతో చూపు తిప్పుకోలేనంత అందంగా కనిపించాడు రాజదంపతుల కళ్ళకు. నూనూగు మీసాలు అతని ముఖానికి అందం తెస్తున్నాయి. కండలు తిరిగిన శరీరం అతని దేహదారుఢ్యాన్ని సూచిస్తోంది. ముఖవర్చస్సు చూసి రాజకుమారుడని సులభంగా గుర్తించేలా ఉన్నాడు. తల్లిదండ్రులు విజయుడిని ఆలింగనం చేసుకున్నారు. కుశలవిశేషాలు మాట్లాడుకున్నారు.

గురువాజ్ఞ అయిన మరుక్షణం పదిమంది విద్యార్థులు ఒక వైపుండగా విజయుడు మరో వైపుండి వారితో కత్తి యుద్ధం చేసాడు. ఎంతో చాకచక్యంగా



కత్తి తిప్పుతూ వారిమధ్య చలాకీగా దూకుతూ, గాల్లోకి ఎగిరి ఎదుటివారి నుండి తప్పించుకుంటూ చివరికి ఎవరికీ కత్తిగాటు పడకుండా ఒక్కొక్కరి చేతిలోని కత్తులూ నేల మీద పడేలా లాఘవం ప్రదర్శించాడు.

గురువుగారితోబాటు తల్లిదండ్రుల అభినందనలు అందుకున్నాడు విజయుడు.

మధ్యాహ్న సమయంలో రాజదంపతులకు గురుకుల విద్యార్థులతోబాటు భోజనం వడ్డించింది గురుపత్ని. రాజదంపతులకు ఆమె వండిన వంటల రుచి నచ్చింది. గురుపత్నిని వారు అనేక కానుకలతో సత్కరించారు.

రాజదంపతులు సంతోషంగా ఉన్న సమయం చూసి విజయుడి దేశాటన కోరికను చెప్పాడు విద్యాచతురుడు. మహారాజు ముందు ఆశ్చర్యపోయినా తర్వాత అంగీకరించాడు. వకుళాదేవి ససేమిరా అంగీకరించేది లేదని చెప్పింది. మహారాజు విక్రమదేవుడు రాణి వకుళాదేవికి అనేక విధాల బోధపరిచాడు.

'దేవీ! నా యుక్త వయసులో దేశాటన చేయాలన్న కోరికను ఆనాడు

మా తండ్రి గారు తీర్చలేదు. ఇప్పటికీ ఆ లోటు నన్ను బాధిస్తోంది. ఆ తప్పు మనం చేయకుండా విజయుడి కోరిక తీరుద్దాం,' అన్నాడు మహారాజు.

వకుళాదేవి అయిష్టంగానే అంగీకారం తెలిపింది. 'విజయుడు చాలా ఏళ్ళ నుండీ గురుకులంలో ఉన్నాడు. తల్లిప్రేమ అందించాలని తల్లడిల్లి పోతున్నాను. అందుకే ముందుగా మనతో కొన్నాళ్ళు రాజభవనంలో ఉంచుకుందాం. నాకు తృప్తి కలిగిన తర్వాత విజయుడి దేశాటనకు అనుమతిస్తాను,' అని చెప్పింది నవ్వుతూ. ఈ షరతు విజయుడితో సహా మిగతా వారికి నచ్చింది.

విద్యాచతురుడి దీవనలందుకొని అక్కడినుండి బయలుదేరారు రాజ దంపతులు. విజయుడు కూడా బయలుదేరేముందు అందరి నుండి సెలవు తీసుకున్నాడు. మిత్రులను వదిలి వెళుతున్న బాధ విజయుడి మొహంలో గుర్తించాడు విద్యాచతురుడు.

* * *

పదేళ్ళ క్రితం కోట వదలి వెళ్ళిన యువరాజు విజయుడు తిరిగి రావడం ఆ రాజ్య ప్రజలకు ఎంతో ఆనందం కలిగించింది. జనులంతా దారికి రెండు వైపులా బారులుగా నిల్చొని అతడిని చూశారు. బాలుడిగా వెళ్ళి యువకుడిగా తిరిగొస్తున్న విజయుడిని చూసి మనసారా దీవించారు పెద్దలు.

మహారాణి వకుళాదేవి స్వయంగా విజయుడికి అవసరమైన సేవలు చేస్తూ తన మాతృత్వపు మధురిమలు కురిపించేది. రాజభవనంలో ఉన్నప్పుడు కూడా ఖాళీ సమయాన్ని వృధా చేయలేదు విజయుడు. యుద్ధవిద్యలలో మరింత రాటుదేలేందుకు అవసరమైన శిక్షణను మేటి యోధుల పర్యవేక్షణలో పొందాడు. తనకు తెలియని విషయాలు అడిగి తెలుసుకునేవాడు. తనకు తెలిసిన విద్యల విషయంలో కొత్త మెలకువలు నేర్చుకొనేవాడు. కత్తి యుద్ధం, కర్ర సాము, కుస్తీలు, గురి చూసి బల్లెం విసరడం, గుర్రపు స్వారీ... ఇలా అన్నింట్లో మరింతగా రాటుదేలాడు విజయుడు. ఇంకా సమయం మిగిలినప్పుడు పండితులు, గురువుల నుండి విద్యా విషయాలు, మంత్రిగారి నుండి పరిపాలనా రహస్యాలు, తండ్రి నుండి రాజకీయ రహస్యాలు తెలుసుకునేవాడు విజయుడు.

కళ్ళుమూసి తెరిచినంత సులభంగా ఏడాది గడిచిపోయింది.

* * *

ఒక రోజు రాజసభ జరుగుతుండగా ఉత్తరదిక్కుకి చెందిన వార్తాహరుడు వచ్చాడు. మహారాజు గారికి జయం పలికి తాను ఒక ముఖ్య వార్త తెచ్చినట్టు చెప్పాడు. లవంగపురం పట్టణానికి సమీపంలో ఉన్న అడవుల నుండి మదమెక్కిన ఏనుగుల గుంపు ఒకటి వచ్చి చుట్టుపక్కల గ్రామాల మీద దాడి చేస్తోంది. గుంపు బారిన పడి చాల మంది మనుషులు చనిపోయారు. అక్కడితో ఆగకుండా ఏనుగులు పంట పొలాల్లో దిగి నాశనం చేస్తున్నాయి. ఆ ఏనుగుల గుంపువల్ల ఇప్పటికే చాలా ఆస్తినష్టం, జననష్టం జరిగిందని అతడు చెప్పాడు. అక్కడి ప్రజలు దిక్కుతోచక భయపడుతున్నారనీ, బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారనీ తక్షణ సాయం అవసరమని అతడు విన్నవించుకున్నాడు.

మహారాజు ఆ వార్త విన్నంతనే తక్షణం ఏనుగుల బెడద అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాడు. కొందరు భటులను వెంటనే వెళ్ళి ఏనుగులను అదుపు చేయమని చెప్పాడు. రాజుగారు పంపిన భటులు మరి వెనక్కి రాలేదు. ఏనుగులు వారిని కూడా చంపేసాయి.

ఈసారి మరికొందరు వీరులను ఎంపిక చేసి పంపాడు మహారాజు. ఈసారి కూడ ఏనుగులు తెలివిగా వ్యవహరించి వీరులను కూడా గాయపరచి పరుగులు పెట్టించి తరిమాయి. వాళ్ళు చావుతప్పి కన్ను లొట్టపోయి తిరిగి వచ్చారు. ఏనుగులను సురక్షిత మార్గాల్లో అదుపు చేయాలనుకున్న మహారాజుకి వాటి ప్రతాపం తెలిసి వచ్చింది. దాంతో మనసు మార్చుకున్నాడు మహారాజు విక్రమ దేవుడు. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల ప్రాణాలు తీసైనా సరే ప్రజలను రక్షించాలన్న అభిప్రాయానికి వచ్చాడు. అక్కడి ప్రజలను ఆపద నుండి గట్టెక్కించేందుకు స్వయంగా కత్తి పట్టి బయలుదేరబోయాడు మహారాజు. దాడికి అవసరమైన ఆయుధాలను శకటాల్లో సిద్ధపరచారు.

సభలోవున్న విజయుడు వెంటనే లేచి నిలబడి 'నేను వెళ్ళి ఈ రాజ్యానికి ఆ ఏనుగుల బెడద వదిలిస్తాను. నన్ను పంపండి మహారాజా!' అని అడిగాడు. సభలో ఉన్న మంత్రులూ, రాజోద్యోగులూ అందుకు అభ్యంతరం చెప్పి

'విజయుడు విద్యలలో ఆరితేరినవాడే కావచ్చు కానీ అనుభవం లేని వాడు. ఏనుగులు చేస్తున్న వీరంగం చూస్తుంటే అనుభవమున్న వారు తప్ప మరొకరికి సాధ్యం కాదని అనిపిస్తోంది. అందువల్ల విజయుడిని పంపడం సరికాదని మా అభిప్రాయం,' అని చెప్పారు.

మహారాణి కళ్ళల్లో కూడా భయం స్పష్టంగా గోచరించింది. మహారాజు వైపు ఆందోళనగా చూసింది. 'మన విజయుడు ఇంకా చిన్నవాడు. ఇలాంటి ప్రమాదకరమైన వ్యవహారానికి వేరెవరినైనా పంపించండి మహారాజా!' అని సూచించింది.

అప్పుడు విజయుడు లేచి సభకు నమస్కరించి, 'మీ అందరి దృష్టిలో నేను చిన్నవాడినేమో కానీ సకల విద్యలు నేర్చిన వీరుడిని. ధైర్యసాహసాలలో మా తండ్రిగారి రక్తం పంచుకుని పుట్టినవాడిని. మా గురువుగారు విద్యాచతురుడి శిక్షణలో నేర్చిన విద్యలు ఎలాగూ ఉన్నాయి. వాటికి తోడు మీ అందరి దీవనెలు సదా నన్ను రక్షిస్తాయి. నా గురించి దిగులు వలదు. రాజ్యప్రజల రక్షణ కోసం నా ప్రాణాలు పోయినా సంతోషమే. మీ అభిమానంతో నన్ను ఆపవద్దు. నా ప్రతిభను ప్రదర్శించే అవకాశం నా నుండి దూరం చేయ వద్దు,' అని మనవి చేసాడు.

విజయుడి వినయ విధేయతలు, రాజ్య ప్రజల పట్ల గల ప్రేమాభిమానాలకు ముచ్చటపడ్డారు రాజదంపతులు. విజయుడు వెళ్ళేందుకు తమ అనుమతి తెలిపారు. సభికులు జయజయ నాదాలు పలికి అతడిని ఆశీర్వదించారు.

విజయుడికి తోడుగా కొందరు సైనికులు అనుసరించారు. మరునాటికి వాళ్ళు లవంగపట్నం చేరుకొన్నారు. అక్కడి ప్రజలను కలసి ఏనుగుల దాడి గురించి సమాచారం సేకరించాడు విజయుడు.

అక్కడున్న వారిలో స్వయంగా ఏనుగుల గుంపును చూసిన వారిని ముందుకు రమ్మన్నాడు. అలా ముందుకి వచ్చిన వారిలో రంగయ్య అనే రైతు ఉన్నాడు. 'నేను చెరకు తోటలో పని చేసుకుంటున్నప్పుడు ఐదు ఏనుగులు ఒక్కసారిగా పక్కనున్న తోటలో జొరబడి చెట్లు విరిచి కింద పడెయ్యడం చూశాను, భయంతో మరో దిక్కు నుండి బయటపడ్డాను. వాటిలో ఒక ఏనుగు చాలా పెద్దది. రెండు మాత్రం ఏనుగు పిల్లలు,' అని చెప్పాడు.



మరొక మధ్య వయస్కుడు ముందుకు వచ్చి 'కొందరు వేటగాళ్ళు ఒక ఏనుగు పిల్లని దొంగిలించి గారడీ వాళ్ళకి అమ్మేసారట. ఆ కోపంతో అవి ఊరు మీద పడి దాడి చేస్తున్నాయి,' అని చెప్పాడు.

ఇంకొక యువకుడు ముందుకొచ్చి 'వాటిలో ఒక ఏనుగుకి పిచ్చెక్కింది. అది ఏం చేస్తుందో ఎవ్వరమూ ఊహించలేకపోతున్నాం. మనుషులను దూరం నుండి చూసి పెద్దపెద్ద చెట్లను పెళ్ళగించి మీదకు విసిరేస్తోంది. బండలను కూడ మీదకు విసిరి గాయపరుస్తోంది. వాటి దగ్గరకు వెళ్ళడమంటే ప్రాణం మీద ఆశ వదులుకోవడమే,' అన్నాడు. అతడి కళ్ళల్లో ఇంకా భయం కదలాడుతోంది.

మరో వ్యక్తి ముందుకొచ్చి 'వాటిలో ఒక ఏనుగు మాత్రం మాటున ఉండి నాలుగు వైపులా చూసి మిగిలిన ఏనుగులకి షంకేతాలిస్తుంది. మిగతా ఏనుగులు చెట్ల కొమ్మలు విరిచి తింటుంటే అది కాపలా కాస్తుంది. అది సూచించిన వెంటనే మిగతావి జాగ్రత్త పడుతూ మనుషుల మీద దాడికి దిగుతున్నాయి,' అన్నాడు.

'అవి రోజూ ఒకే ఊరి మీదకు వెళ్ళడం లేదు. ఎప్పుడు పొలాల మీదకు వెళతాయో, ఎప్పుడు ఊర్లో చొరబడి మనుషుల ప్రాణాలు తీస్తాయో చెప్పలేక పోతున్నాం. వాటిని కట్టడి చేయడానికి రాజుగారు పంపిన వీరులు వచ్చి మాటు వేసారు. దాంతో ఆ చోటు వదిలేసి వేరే ఊరు మీద పడి అక్కడి పొలాల్లోని పంటలను నాశనం చేసాయి. అంటే అవి మనుషుల రాకను పసిగట్టి వ్యూహం మార్చి దాడి చేస్తున్నాయని అనుమానంగా ఉంది,' అని మరొక వృద్ధుడు చెప్పాడు.

అవి ఒక్కొక్కసారి అడవిలోకి వెళ్ళి రెండు మూడు రోజులు ఉండి మళ్ళీ ఊర్లోకి వచ్చి దాడి చేస్తున్నాయని మరొకరు చెప్పారు. అందరి అభిప్రాయాలు విన్నాడు విజయుడు. అక్కడి ప్రజలను ధైర్యంగా ఉండమని చెప్పాడు. తాను స్వయంగా వాటిని అదుపుచేయడానికి ప్రయత్నిస్తానని చెప్పి ధైర్యాన్ని కలిగించాడు.

గ్రామస్తుల సహకారంతో ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలు, తోటలు, ఇతర గ్రామపరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించాడు. ఏనుగుల దాడిని ఆపడానికి పనికి వస్తుందనుకున్న ప్రతి విషయం గుర్తు పెట్టుకున్నాడు. ఆ ఏనుగులు అలవాటుగా చేస్తున్న పనులు, అలాగే అవి చేస్తున్న పొరపాట్లు కూడ గ్రహించాడు. గ్రామస్తులు చెప్పిన ఇంకొక విషయమేమిటంటే ప్రతిరోజూ ఏనుగులు ఆహారం తిన్న తర్వాత దగ్గర్లో ఉన్న వాగుకి వెళ్ళి నీరు తాగుతూ ఉన్నాయి. వారు చెప్పిన విషయాలన్నీ ఓపికగా, శ్రద్ధగా విన్నాడు విజయుడు. తర్వాత చెయ్యవలసిన పని నిర్ణయించుకున్నాడు.

ఏనుగులు ఎక్కువ సమయం సంచరించే ప్రదేశాలలో పెద్ద పెద్ద గంగాళాలు ఉంచి అందులో మత్తు మందు కలిపిన నీరు పోయించాడు. అంతే కాకుండా వెలగపండ్లు ఆ నీటిలో వేయించాడు. వెలగపండ్లకు ఆశ పడిన ఏనుగులు అక్కడికి వచ్చి నీరు తాగితే తప్పకుండా మైకంలోకి వెళ్ళిపోతాయి. ఎందుకంటే కొన్ని వెలగపండ్లకు లోపల గుజ్జు ఖాళీ చేసి అందులో మత్తుమందు నింపారు. ఆ నీరు తాగి ఏనుగులు మైకంలో ఉన్న సమయంలో వాటిని బంధించాలనుకున్నాడు విజయుడు.

అక్కడితో ఆగకుండా రెండో ప్రయత్నంగా ఐదుగురు విలుకాళ్ళను

రప్పించాడు. ఏనుగులు అధికంగా తిరుగాడుతున్న ప్రాంతానికి దగ్గరగా ఉన్న చెట్లమీద కాపుకాయమని చెప్పి మత్తుమందు పూయించిన బాణాలిచ్చాడు. ఏనుగులు దరిదాపులకు రాగానే సరిగ్గా తలకు దగ్గరలో తగిలేలా బాణాలు వెయ్యమని చెప్పాడు. మొదటి ఎత్తుగడ విఫలమయితే ఇది పనికొస్తుందని అనుకున్నాడు.

మూడవ ప్రయత్నంగా యాభై మంది మనుషులను నియమించి ఏనుగులు వాగుదగ్గర నీరుతాగే ప్రదేశాల్లో పెద్దపెద్ద కందకాలు తవ్వించాడు. వాటి మీద పలచగా వెదురుకర్రలు పరిచి గడ్డితో, కొమ్మలతో నింపించాడు. ఏనుగులు ఇవన్నీ తప్పించుకొని నీరు తాగడానికి వాగుకి వెళ్ళిన పక్షంలో ఆ కందకాల్లో పడతాయనీ, అప్పుడు వాటిని బంధించాలని ఆయన ఉద్దేశం.

ఏనుగుల వల్ల ఇతర ప్రజలకి ఇబ్బంది తొలగించడానికి అన్ని ఏర్పాట్లు చేశాడు విజయుడు. ఆయన కూడా కొన్ని విషం పూసిన బాణాలనూ, విషం పూసిన ఖడ్గాన్ని తనతో ఉంచుకున్నాడు. ఎంతో కష్టమైతే తప్ప ఏనుగుల ప్రాణం తియ్యకూడదని నిర్ణయించాడు విజయుడు.

అయితే విజయుడు చేసిన ఏర్పాట్లు వాటికి తెలిసి పోయాయన్నట్లుగా మూడురోజులు గడిచినా ఏనుగులు అటు వైపు రాలేదు. ఏనుగులు రానందుకూ, జన నష్టం కలిగించనందుకు సంబరపడాలో, లేక ఏర్పాట్లు వృధా అయ్యాయని బాధపడాలో అని అర్థం కాలేదు విజయుడికి.

అంతలో అతడికి ఒక వార్త వచ్చింది. ఏనుగులు అడవికి మరోవైపునున్న విశ్వంభరపురం మీద పడి పదిమందిని చంపి వినాశనం సృష్టించాయన్నది వార్త సారాంశం. ఒకేసారి ఆశ్చర్యం, కోపం కలిగాయి విజయుడుకి. వాటిని అదుపు చేయడానికి ఎలాంటి పథకం వేస్తే మంచిదో నిర్ణయించుకున్నాడు.

అంతవరకూ లవంగపురంలో చేసిన ఏర్పాట్లను అలాగే ఉంచి కొందరికి అక్కడి బాధ్యత అప్పగించాడు. తాము విశ్వంభరపురం వెళ్ళినప్పుడు ఏనుగుల గుంపు లవంగపురం వచ్చిన పక్షంలో అవసరాన్ని బట్టి అమలుపరచమని కొందరు అనుయాయులకు బాధ్యత అప్పగించాడు. మరికొందరు మెరికల్లాంటి వీరులను వెంటబెట్టుకొని విశ్వంభరపురం వైపు వెళ్ళాడు విజయుడు.

వారికి విశ్వంభరపురం చేరడానికి ఒక పూట పట్టింది. వారు

విశ్వంభరపురం చేరేసరికి ప్రజలు గుమిగూడి తమ భయాందోళనలు తెలిపారు. అక్కడున్న వారందరూ ఆ గుంపులోని ఏనుగులను చంపెయ్యమని ముక్త కంఠంతో సలహా ఇచ్చారు.

మొదట చేసిన ఏర్పాట్లు మాదిరిగానే ఇక్కడా చేసాడు విజయుడు. మరికొందరు విలుకాళ్ళను సాయం తీసుకొని అడవి వైపు హుటాహుటిన వెళ్ళారు. వారు అడవిని సమీపిస్తున్న దారిలో ఒక ఎత్తయిన గుట్ట కనిపించింది. ఆ గుట్ట ఎక్కి దాని మీద నుండి చూస్తే ఏనుగులు ఎక్కడ ఉన్నాయో సులభంగా తెలుస్తుందని తోచింది విజయుడికి.

వాళ్ళంతా తాము ప్రయాణించి వచ్చిన గుర్రాలను గుట్ట కిందనే వదిలేసి గుట్ట మీదకు చేరుకున్నారు. అక్కడి నుండి గుట్టకి రెండో వైపు చూశారు. దిగువునున్న పచ్చిక బయలులో విశ్రాంతి తీసుకుంటూ ఐదు ఏనుగులూ కనిపించాయి విజయుడికి.

వెంటనే వాటిని చేరుకోడానికి గుట్ట మీదనుండి ఆ దిశగా కిందకు దిగారు వాళ్ళు. కొంతసేపటికి వాళ్ళు గుట్ట కిందకి చేరుకున్నారు. విజయుడి మనుషులకూ ఏనుగులకీ మధ్య దూరం తగ్గిపోయింది. ఒక్కొక్కరిని తగిన స్థానాలు చూసుకొని దాడికి దిగమని విజయుడు వారికి చెప్పాడు. వాళ్ళంతా విజయుడు చెప్పినట్లు ఆచరణలోకి దిగారు.

అంతలో వీరి రాకను పసిగట్టేసాయి ఏనుగులు. గుంపులోని రెండు ఏనుగులు భయంకరంగా ఘీంకరిస్తూ దగ్గరలోని పెద్దపెద్ద చెట్లు పెకిలించి వీరి వైపు విసిరాయి. వాటికి దగ్గర్లో ఒక రాళ్ళగుట్ట ఉంటే అందులోని రాళ్ళని తొండంతో వీరి మీదకు విసిరాయి. మిగిలిన మూడు ఏనుగులు కూడా ఆ సమయంలో విజయుడున్న వైపు వేగంగా దాడికి వచ్చాయి.

విజయుడు తన వారిని గట్టిగా హెచ్చరించి జాగ్రత్తలు చెప్పాడు. అమ్ములపొది లోని విషపు బాణాలు తీసి తన మీదకు వస్తున్న ఒక ఏనుగుకి గురిచూసి వదిలాడు. ఆ బాణం సూటిగా వెళ్ళి ఒక ఏనుగుకి తగిలింది. అది చూసి రెచ్చిపోయాయి మరి రెండు ఏనుగులు. అవి పెద్దచెట్లను వేళ్ళతో సహా పెకిలించి విజయుడి మీదకు విసరబోయాయి. విజయుడి అనుచరులకు ఏం జరిగిందో అర్థం కాలేదు. ఒకవేళ బాణం లోని విషం పని చేయలేదేమో

అన్న అనుమానం వచ్చింది.

అది గమనించిన విజయుడు 'ధైర్యంగా బాణాలు వెయ్యండి. తలకు దగ్గరలో అయితే విషం తొందరగా పాకుతుంది,' అని వారిని ఉత్సాహపరిచాడు. అలా అంటూనే మరో బాణం గురిచూసి మొదట తాను బాణం వేసిన ఏనుగు తలకి గురిచూసి వదిలాడు. అది ఈసారి సూటిగా వెళ్ళి కంటికి తగిలింది. దాంతో ఆ ఏనుగు అక్కడికక్కడే పడిపోయింది. అదే సమయంలో మిగతావారు వరసగా మరో రెండింటి మీద బాణాలు వేసి వాటిని కూడ నేల కూల్చారు. మూడు ఏనుగులు కింద పడి చనిపోవడంతో మరో రెండు ఏనుగులు చెట్లు పీకి విసరడం మానేసి పడిపోయిన వాటి దగ్గరకు వెళ్ళి తొండంతో వాటిని తాకి సంతాపం తెలపసాగాయి. వాటి నేత్రాల్లో నీళ్ళు!

అది చూసిన విజయుడు 'ఆ రెండు ఏనుగులను చంపవద్దు. అవి తమ సహచర ఏనుగులు చనిపోయాయన్న బాధలో ఉన్నాయి. వాటిమీదకి మత్తు మందు పూసిన బాణాలు వెయ్యండి. అవిప్పుడు మనపై దాడికి రావడం లేదు,' అని చెప్పాడు.

వాళ్ళంతా ఆ పనిలో ఉండగా వాటిల్లో ఒక ఏనుగు ఊహించని విధంగా ముందుకి వచ్చేసింది. విజయుడి సహాయకుల్లో ఒకడిని తొండంతో చుట్టేసి



విసిరెయ్య బోయింది. ఈ హఠాత్పరిణామానికి క్షణకాలం విస్తుపోయాడు విజయుడు. అంతలోనే తేరుకొని ఉద్రేకంగా సివంగిలా దూకి ఏనుగు కుంభస్థలం మీద కూర్చున్నాడు. మావటి ఏనుగుపై కూర్చుని అంకుశంతో ఎలా అదుపు చేస్తాడో అలాగే బాణం ముల్లుతో గుచ్చాడు. ఆ బాధకి అనుచరుడిని వదిలేసింది ఏనుగు. దాని దృష్టి విజయుడి మీద పెట్టింది. అతడిని కింద వేసి తొక్కెయ్యాలని ప్రయత్నం చేసింది. విజయుడు తన పట్టు వదలకుండా జాగ్రత్త పడ్డాడు. అనుచరులు తమ బాణాలను విజయుడికి తగలకుండా ఆ ఏనుగు మీద వదిలారు. మరికొంత సేపటికి ఏనుగు మత్తులోకి జారి నేల కూలింది. మిగిలిన ఏనుగు కూడ స్పృహ కోల్పోయి నేల మీద పడిపోయింది.

ఆ కబురు గ్రామాలకు క్షణాల్లో చేరిపోయింది. అక్కడి నుండి బలంగా ఉన్న ఇనుప గొలుసులు పట్టుకుని వచ్చారు కొందరు సిబ్బంది. ఆ గొలుసులుతో మైకం కమ్మి ఉన్న ఏనుగులను బంధించారు. రాకాసిమూకని మించి పోయిన ఏనుగుల గుంపు మీద విజయం సాధించిన విజయుడి బృందాన్ని అక్కడి ప్రజలు అభినందించారు.

రాజధానిలో కూడ విజయుడికి ఘనస్వాగతం లభించింది. తమ కుమారుడి ఘనతకి రాజదంపతులు పొందిన సంతోషం ఇంతా అంతా కాదు. ఆ ఉత్సాహంలో రాజదంపతులు ఉన్నప్పుడు విజయుడు వచ్చాడు.

గతంలో తనకు మాట ఇచ్చినట్టు దేశాటన చెయ్యడానికి ఇప్పుడు తనకి ఉత్సాహంగా ఉందని చెప్పి తల్లిదండ్రులను అనుమతి అడిగాడు. బాగా పొంగుతున్న పాలమీద నీళ్ళు చల్లినట్లు అయింది రాజదంపతులకు. మహారాజు ధీరుడు కాబట్టి తొందరగానే తేరుకొన్నాడు. అంతే కాకుండా అతడే మహారాణి వకుళాదేవిని ఒప్పించాడు. ఆమె మనసులో ఉన్న అనేక సందేహాలు, భయాలు భర్తా, కుమారులను అడిగింది. వాటికి ఓపికగా జవాబులిచ్చి ఆమె అనుమానాలన్నిటినీ పటాపంచలు చేసాడు విజయుడు.

దేశసంచారానికి బయలు దేరవలసిన ఉదయమే విజయుడు కాళికాదేవి ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందాడు. తల్లిదండ్రులు, పురప్రజలు వీడ్కోలు పలకగా విజయుడి ప్రయాణం

ప్రారంభమైంది. నగరం దాటి చాలా దూరం వరకు రాజదంపతులు రథం మీద తోడుగా వచ్చి ఆశీర్వదించారు.

వకుళాదేవి కన్నీరు జారుతుండగా కొడుకుని గుండెలకు హత్తుకొంది. విక్రమదేవుడు తన కుమారుడికి కొన్ని హితవులు చెప్పి లోకకళ్యాణం కోసం జరిపే విజయుడి యాత్ర ఆటంకాలు లేకుండా సాగాలని దీవించాడు. విజయుడు హేళాపురికి ఉత్తర దిక్కుగా తన పంచకళ్యాణి గుర్రాన్ని పరుగెత్తించాడు.

* * *

విజయుడు మధ్యాహ్న సమయానికి ఒక చిన్న ఊరు చేరాడు. అక్కడున్న వారితో మాట్లాడితే అది తమ రాజ్యంలోని ఊరే అని తెలిసింది. రాజ్యపాలన ఎలా ఉందని వారిని అడిగితే వారు పాలన బాగుందని పొగడ్తలు కురిపించారు. తన గురించి వారికి చెప్పాడు విజయుడు. వచ్చినవాడు మామూలు బాటసారి అనుకున్నారు గ్రామస్తులు. ఆయన తమ యువరాజని తెలియడంతో వారంతా ఎంతో సంబరపడ్డారు. గ్రామస్తులలో ఒకడు పక్కనే ఉన్న కొబ్బరి చెట్టెక్కి బాగా నీరున్న కొబ్బరిబొండాలు దించి ఇచ్చాడు. గ్రామస్తులలో ఒక బాలుడు పరుగు పరుగున వెళ్ళి యువరాజుగారు తమ ఊరు వచ్చారని అందరికీ చెప్పేసాడు.

'ఏనుగులను చంపి ప్రజల ప్రాణాలు కాపాడిన దేవుడివి నువ్వు,' అని గ్రామస్తులంతా ప్రశంసించారు. ప్రజల మధ్యనుండి ఒక వ్యక్తి ముందుకొచ్చి 'యువరాజా! నేను ఈ ప్రాంత రైతుల నుండి పన్నులు వసూలుకు నియమింప బడిన ఉద్యోగిని. తమకిదే మా స్వాగతం,' అని చెప్పి యువరాజుకి భోజన ఏర్పాట్లు చేస్తానన్నాడు. తమ తల్లి ఇచ్చిన ఆహారపు మూట ఉందని సున్నితంగా అతడితో చెప్పి తిరస్కరించాడు విజయుడు.

తల్లి అందించిన భోజన మూటను తెరిచాడు. భోజన పదార్థాలని వారికి కూడ రుచి చూపించి, పిల్లలకు కొంత పెట్టి తనూ తిన్నాడు. పక్కనే ఉన్న చెరువులో గుర్రానికి నీరు తాగించి కొంత సేపు విశ్రాంతినిచ్చాడు.

ఆ సమయంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నాడు. సాయంత్రం

వరకూ వారితోనే ఉండి వారి నుండి సెలవు పుచ్చుకొని బయలుదేరాడు విజయుడు.

ఆయన గుర్రంపై వెళుతుండగా దారి పొడుగునా ఎన్నో ఊర్లు, కొండలు, వాగులు, గుట్టలు కనిపించాయి. బాగా రాత్రి అయ్యేవరకూ మరో ఊరు కనిపించకపోవడంతో గుర్రాన్ని ఏకధాటిగా పరిగెత్తించాడు విజయుడు. అలా ప్రయాణం చేసిన విజయుడు ఒక ఊరు కనిపిస్తే ఆగి అక్కడ గల సత్రంలో ఆ రాత్రికి బసచేసాడు.

వేళ దాటి వచ్చిన విజయుడికి భోజనం ఏర్పాటు చేసి న్యాయమైన సొమ్మునే రుసుముగా స్వీకరించాడు సత్రం యజమాని. సత్రం యజమాని మీద మంచి అభిప్రాయం కలిగింది విజయుడికి. బాగా పొద్దు పోవడం వల్ల మౌనంగా భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నాడు విజయుడు.

తెల్లవారిన తర్వాత సత్రం యజమానితో మాట్లాడాడు విజయుడు. ఆ ఊరు కూడ తమ రాజ్యంలోనిదేననీ దాని పేరు ఆత్రేయపురమని తెలుసు కున్నాడు. అక్కడి ప్రజలంతా తమ తండ్రిగారి పాలన పట్ల సంతోషంగా ఉన్నారని గ్రహించాడు. తన గురించి వారికి చెప్పకుండానే రాజోద్యోగుల వల్ల ఇబ్బందులేమయినా ఉన్నాయేమో చెప్పమన్నాడు. అప్పుడు సత్రం యజమానికి సందేహం వచ్చింది. 'ఇంతకీ మీరెవరో తెలపగలరా?' అని అడిగాడు.

దానికి విజయుడు 'మా తండ్రిగారు రాజాస్థానంలో కీలక పదవిలో ఉన్నారని చెప్పి ఆయన సమాధానం తెలుసుకున్నాడు. సత్రం యజమాని కూడా రాజపాలనలో ఎటువంటి లోపాలు లేవని చెప్పడంతో విజయుడు తృప్తి చెంది ప్రయాణం కొనసాగించాడు.

విజయుడి ప్రయాణం ప్రారంభమైన మూడవరోజున ఒక పల్లెను దాటుతుండగా ఒక గృహం నుండి కొందరి ఏడుపులు వినిపించాయి. గుర్రాన్ని నిలబెట్టి ఆ ఇంటివైపు విజయుడు నడిచాడు. ఆ ఇంటి ముందర కొందరు నిలబడి మాట్లాడుతున్నారు. వారిని కలిసి ఎందుకు ఆ గృహస్తులు ఏడుస్తున్నారో చెప్పమని అడిగాడు.

దానికి అక్కడ నిలబడ్డవారు 'మా ఊరికి రాజుగారు నియమించిన ఉద్యోగి

కీచకాంశతో పుట్టినవాడు. పన్నుల పేరుతో ప్రజలను పీడిస్తాడు. తప్పుడు లెక్కలు చెబుతాడు. మా దగ్గర హెచ్చు ధనం వసూలు చేస్తాడు. అతడికి ఎవరైనా ఎదురు తిరిగినా, పన్ను చెల్లించడం ఆలస్యమయినా, లేదంటే పన్నులో బాకీపడినా వారింట్లో నుండి కన్నెపిల్లలను తనతో తీసుకుపోతాడు. ఈ రోజున ఈ ఇంటి యజమాని రైతు రాజయ్యకి కష్టం వచ్చింది. ఆయన పన్ను కట్టలేకపోయాడు. ఆయన ఒక్కగానొక్క కూతురిని ఈడ్చుకెళ్ళాడు దుర్మార్గుడు. అందుకే ఆ కుటుంబీకులు ఏడుస్తున్నారు,' అని వివరంగా చెప్పారు.

వారి మాటలు విన్న విజయుడికి విపరీతమైన కోపం వచ్చింది. 'ఆయన పెడుతున్న బాధలు పడుతూ భరించే బదులు మహారాజుగారికి ఫిర్యాదు చెయ్యలేకపోయారా?' అని ప్రశ్నించాడు.

దానికి గ్రామస్తులు 'మా రాజ్యపు మహారాజు విక్రమదేవుడు నిజంగా దేవుడి లాంటివారు. కాకపోతే మాది మారుమూల ఊరు. సమస్యలు ఉన్నప్పుడు రాజుగారు అయినా, మంత్రులయినా ఇటు విచ్చేస్తారు. ఈ మధ్య కాలంలో ప్రముఖులెవరూ ఇటువైపు రాలేదు. అందుకే ఇలాంటివి భరించక తప్పడం లేదు. మా ఊరిలోని రాజోద్యోగి చేస్తున్న దుర్మార్గాలపై ఫిర్యాదు పంపాలని ఉన్నప్పటికీ ధైర్యం చాలడం లేదు. రాజుగారికి ఫిర్యాదు చేస్తే మా మీద పగ తీర్చుకుంటానన్నాడు. మామీద లేనిపోని నేరాలు మోపి మమ్మల్ని ఖైదులో తోయిస్తానని బెదిరించాడు,' అని చెప్పారు. ఆ గ్రామం తమ రాజ్యంలోనిదే అని తెలిసి విజయుడికి సంతోషం కలిగినా, అలాంటి వాడిని తండ్రిగారు అధికారిగా పంపినందుకు కాసేపు విచారించాడు.

గ్రామస్తులలో ఒకరిని తనకు తోడుగా వచ్చి గ్రామపాలకుడి ఇల్లు చూపించమని విజయుడు అడిగితే రాజోద్యోగికి భయపడి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. గ్రామస్తులకు అనేక విధాలుగా విజయుడు నచ్చజెప్పడంతో వాళ్ళు కూడబలుక్కొని ఒక పదేళ్ళ వయసున్న పిల్లవాడిని తోడిచ్చి పంపారు. ఆ పిల్లవాడు రాజోద్యోగి ఇంటికి విజయుడిని తీసుకొని వెళ్ళాడు.

విజయుడు వెళ్ళేసరికి రాజోద్యోగి ఒక ఆసనం మీద కూర్చొని కొన్ని దస్త్రాలు పరిశీలిస్తున్నాడు. భారీ శరీరంతో నల్లగా తుమ్మమొద్దులా ఉన్నాడు వాడు. విజయుడిని కోపంగా చూసి వచ్చిన పని చెప్పమని అడిగాడు.

'పన్ను చెల్లించలేదన్న నెపంతో యువతిని బెదిరించి తెచ్చావని నీ మీద ఫిర్యాదు విన్నాను. అదే విషయం నిన్ను అడగాలని వచ్చాను,' అని చెప్పాడు విజయుడు.

ఆ మాటలు విన్న రాజోద్యోగి ముఖం కోపంగా మారిపోయింది. 'ఈ ఊరిలో ఎప్పుడూ నిన్ను చూడలేదు. బాటసారివా? లేక పరదేశివా? నా సంగతి తెలియక నన్ను ప్రశ్నించే సాహసం చేస్తున్నావు,' అని సమాధానం చెబుతూనే గదిలో ఒక మూల ఉన్న దుడ్డుకర్ర బయటికి తీసి విజయుడిని కొట్టబోయాడు. అయితే విజయుడు ఒడుపుగా ఆ దెబ్బ నుండి తప్పించుకొని తిరిగి రాజోద్యోగి మెడ వెనక బలమైన దెబ్బ ఒకటి కొట్టాడు. ఆ దెబ్బకు రాజోద్యోగి కింద పడిపోయి స్పృహ తప్పాడు.

కిందపడి అచేతనుడై ఉన్న రాజోద్యోగిని దాటుకొని ఇంటి లోపలికి వెళ్ళి ప్రతి గదిలోనూ వెదికాడు విజయుడు. ఒక గదిలో తాళ్ళతో కట్టి ఉంచిన యువతి కనబడింది అతడికి. ఆ యువతి బిక్కుబిక్కు మని విజయుడి వైపు చూసి ఏడుపు ప్రారంభించింది. ఆమెను అడిగితే గ్రామస్తులు చెప్పిన యువతి ఆమేనని తేలిపోయింది. ఆమెకు కట్టిన తాళ్ళు తొలగించాడు విజయుడు.

'నిన్ను విడిపించి మీ తల్లిదండ్రుల దగ్గరకు తీసుకెళతాను. భయపడకు,' అని ధైర్యం చెప్పి ఆమెను బయటకు తీసుకువచ్చాడు విజయుడు.

ఇంటి బయటకు వచ్చేసరికి చాలా జనం ఉన్నారు అక్కడ. విజయుడికి తోడుగా వచ్చి ఇల్లు చూపించిన పిల్లవాడే రాజోద్యోగికి జరిగిన పరాభవం సంగతి వాళ్ళకు చెప్పడంతో అంతా సంబరపడుతూ గుమిగూడారు. వారంతా విజయుడిని చుట్టుముట్టి 'నువ్వు పరదేశిలా ఉన్నావు. వీడి గురించి తెలియక వాడిని కొట్టావు. వీడసలు మంచివాడు కాదు. రాజుగారికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు కుట్ర చేస్తున్నావని తప్పుడు ఆరోపణలు సృష్టించి ఖైదు చేయించగలడు. గతంలో ఎందరికో అలా చేసాడు. ఆయన తేరుకొని నిలబడే లోపు పారిపో,' అని భయపడుతూ సలహా ఇచ్చారు.

దానికి విజయుడు 'నేను యువరాజు విజయుడిని. మీరిక ఆ ఉద్యోగికి భయపడవలసిన పని లేదు. మీ కష్టాలు ఈ రోజుతో తీరిపోయాయి. ఒక కొత్త ఉద్యోగి మీ ఊరికి వచ్చేలా మా తండ్రిగారికి లేఖ పంపిస్తాను,' అని



చెప్పాడు. ఆ ఊరి ప్రజల ఆశ్చర్య, ఆనందాలకు అంతులేకపోయింది.

రాజోద్యోగిని ఊరిమధ్య ఉన్న చెట్టుకి బంధించి ఆ ప్రాంతపు కొత్వాలుని రప్పించి అప్పగించాడు విజయుడు. అతడిని శిక్షించమని తండ్రికి జాబు రాసి పంపించాడు. గ్రామస్తులందరూ ఎంతగానో విజయుడిని అభినందించారు. వారికున్న మిగతా సమస్యలను కూడా పరిష్కరించాడు విజయుడు.

రాజోద్యోగికి కుక్క చావే గతి అయ్యింది. అతడి ఆస్తి గ్రామాభివృద్ధికి వినియోగించాడు విజయుడు.

గ్రామంలో ఉన్న కాళికామాత ఆలయానికి గ్రామస్తులతో వెళ్ళి అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించాడు. తన దేశాటన సక్రమంగా జరిగి ప్రజాప్రయోజనాలు సిద్ధించేలా చేయమని వేడుకున్నాడు.

* * *

మరునాడు పొద్దున్నే ఆ ఊరి నుండి బయలుదేరిన విజయుడు చాలా ఊళ్ళు దాటుకుంటూ ప్రయాణించాడు. మిట్ట మధ్యాహ్నం కావస్తోంది. దరిదాపుల్లో మనుషుల అలికిడి గానీ, ఊరున్న దాఖలాలు గానీ కనిపించలేదు. అతడికి దాహం వేసింది. చుట్టూ ఎండుదిబ్బలు, ఇసుక మేటలు, రాళ్ళూరప్పలూ తప్ప పచ్చదనం కనిపించలేదు. అయినా శరీరంలోకి శక్తి తెచ్చుకొని గుర్రాన్ని పరిగెత్తిస్తూనే ఉన్నాడు. మరికొంత దూరం ముందుకు వెళ్ళేసరికి దూరంగా తూర్పు దిక్కున ఎవరో మనుషులు కనిపించారు. వారివైపు గుర్రాన్ని పరిగెత్తించాడు విజయుడు.

వాళ్ళందరూ ఆడవాళ్ళే. తలపై మట్టికుండల్లో నీరు మోస్తున్నారు వాళ్ళు. వాళ్ళ దగ్గరకి వెళ్ళి గుర్రాన్ని ఆపి 'దాహం తీర్చుకునేందుకు దగ్గర్లో ఏదైనా వాగు ఉందా?' అని అడిగితే 'దరిదాపుల్లో నీరు దొరకదు పరదేశీ. మేము నీరు పోస్తాం. దాహం తీర్చుకో,' అని ఒక స్త్రీ తన కుండలో తెచ్చుకున్న నీటిని విజయుడి దోసిళ్ళలో పోసింది. ఆమె మంచితనానికి కృతజ్ఞతలు చెప్పిన విజయుడు వారికి నీరెలా దొరికిందని అడిగాడు.

అక్కడికి రెండు మైళ్ళ దూరంలో గల ఖర్జూరపల్లె అనే ఊళ్ళో ఉంటున్నామనీ, గ్రామంలో నీటిబావులన్నీ ఇంకిపోవడంతో తాగునీటి కోసం ఐదుమైళ్ళు దూరం వెళ్ళి నీరు తెచ్చుకుంటున్నామని చెప్పింది. వారు ఉంటున్న ఊరు తమ రాజ్యంలోనిదేనని విజయుడు తెలుసుకున్నాడు.

మహారాజు పంపించిన నిధులు స్వాహా చేస్తూ అక్కడి రాజోద్యోగి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని బోధపడింది విజయుడికి. వాళ్ళతో కలిసి వారి ఊరిలోకి వెళ్ళాడు.

ఊరి మధ్యలో ఉన్న మర్రి చెట్టుకి కింద కట్టిన రాతికట్టు మీద కూర్చుని ముచ్చట్లాడుతూ కనిపించారు కొందరు పల్లెవాసులు. వారి మధ్యన కూర్చున్న రాజోద్యోగిని విజయుడికి చూపించారు ఆ స్త్రీలు.

విజయుడు అక్కడికి వెళ్ళి తన పరిచయం చెప్పాడు. అదివిన్న రాజోద్యోగి కళ్ళల్లో భయం కనిపించింది. అదేమీ పట్టించుకోకుండా నీటిబావులు తవ్వించని విషయమై ప్రశ్నించాడు విజయుడు. ఆ ఉద్యోగి తడబడుతూ జవాబిచ్చాడు. రాజుగారు పంపిన నిధులను ఆ ఉద్యోగి స్వాహా చేస్తున్నాడని విజయుడు

విచారణలో తెలుసుకున్నాడు. అతడిని రాజుగారికి అప్పగించి శిక్షించాలని అనుకున్నాడు విజయుడు. కొందరి భటులను పిలిపించి ఆ ప్రాంతపు అమీన్‌కి ఆ రాజోద్యోగిని అప్పగించాడు. ఈ రాజోద్యోగి పరిస్థితి కూడా కుక్క చావే అయ్యింది.

దగ్గర్లోని ఫోతేదార్‌ని కూడా అక్కడకు రప్పించి ఖర్జూరపల్లెలోని ప్రజలకు నీటి కొరత తీర్చమని చెప్పాడు. గ్రామస్తుల సంతోషానికి అంతులేకపోయింది. తమ స్త్రీలకు ఇకముందు కష్టముండదని తృప్తి చెందారు ఊళ్ళోని వాళ్ళందరూ. అక్కడ నుండి తృప్తిగా ప్రయాణమయ్యాడు విజయుడు.

* * *

మరుసటి రోజు ఉదయమే విజయుడు ఒక దట్టమైన అడవిగుండా ప్రయాణిస్తున్నాడు. ఎక్కడి నుండో రక్షించమని చేస్తున్న ఆర్తనాదాలు ఆయన చెవిలో పడ్డాయి. తన గుర్రాన్ని అటువైపుకి పరిగెత్తించాడు విజయుడు. అలా కొంతదూరం వెళ్ళగానే అతడికి ఒక సరస్సు, అక్కడొక భయంకర దృశ్యం కనిపించాయి. ఆ దృశ్యం చూడగానే ఒళ్ళు జలదరించింది విజయుడికి.

అక్కడ భయంతో ఆర్తనాదాలు చేస్తున్న ఒక ముని కనిపించాడు విజయుడికి. ఆయన కాలును పట్టుకొని లోపలకు లాగుతోంది ఒక భయంకర మొసలి. దానినుండి తప్పించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు ఆ ముని. కానీ ఆయన మోకాలి లోతు నీటిలో ఉండడం వల్ల ఆయనకు వీలు కుదరడం లేదు. మొసలిని ఎదిరించే శక్తి లేకపోవడంతో రక్షించమని గట్టిగా కేకలు పెడుతున్నాడు.

విజయుడు తన గుర్రం మీద నుండి ఒక్క ఉదుటున కిందకు దూకి మొసలి ఉన్న స్థలానికి వెళ్ళాడు. ఆ మొసలి నోటిలో చిక్కిన ముని కాలుని ఎలా బయటకు తీయాలో ఆలోచించాడు. మొసలి దవడల్ని రెండు చేతుల్తో గట్టిగా విడదీయాలని చూసాడు. విజయుడి ప్రయత్నం గ్రహించినట్లు మొసలి మరింత పట్టు బిగించడంతో ఆ ప్రయత్నంలో వీలు కుదరలేదు. ముని కాలు తెగి పడుతుందేమోనన్న సంశయం కలిగింది విజయుడికి. ఆ పని ఆపేసి తన పదునైన ఖడ్గాన్ని బయటకు తీసి మొసలిని నీటి కింద నుండి పొట్ట

భాగం మీద, ఇతర శరీర భాగాల్లో వరసగా ఆరేడు సార్లు బలంగా పోట్లు పొడిచాడు.

అది తట్టుకోలేక పోయిన మొసలి విజయుడిని తన తోకతో బలంగా కొట్టింది. విజయుడు స్వతహాగా శరీర దారుఢ్యం గలవాడు కాబట్టి మొసలి కొట్టిన దెబ్బల్ని తట్టుకొన్నాడు. మరింత బలం తెచ్చుకొని దానితో పోరాడటంతో మొసలికి కోపం ఎక్కువయింది. నోటిముందు ఆహారాన్ని దూరం చేస్తున్నాడన్న బాధతో మునిని వదిలి విజయుడిని పట్టుకోవాలనుకుంది.

మొసలి పట్టువదిలిన సమయంలో ముని కాలు బయటపడడంతో ఆయన నీట్లో పడ్డాడు.అదే అదనుగా ఆ మునిని ఒడ్డుకి వెళ్లిపొమ్మన్నాడు విజయుడు. కాలు నుండి రక్తం కారుతుండగా ఒంటి కాలితో కుంటుతూ ఒడ్డుకి చేరాడు ముని. మొసలి తన మీద చేసిన దాడి నుండి తేరుకోడానికి అతడికి సమయం కావల్సి వచ్చింది.

ఇంతకుముందు మునికి తన ఖడ్గం తగలకూడదని జాగ్రత్తగా పోరాడాడు విజయుడు. ఇప్పుడు ఆ భయం లేకుండా ఇష్టం వచ్చినట్లు దానిని పొడిచిన విజయుడి కత్తిపోట్లకు దాని శరీరం అడుగుభాగం జల్లెడలా మారిపోయింది. దాని శరీరం నుండి రక్తం ధారగా విరజిమ్మింది. ఈ సారి దాని గుండె ప్రాంతంలో కత్తిని బలంగా దించాడు విజయుడు. సరస్సులోని నీరంతా ఎర్రగా మారిపోయింది. మొసలికి గెలిచే అవకాశం ఏమాత్రం ఇవ్వకుండా బలమంతా ఉపయోగించాడు విజయుడు. కాసేపటికే అది ప్రాణం వదిలింది.

మొసలి చనిపోయిందని విజయుడు సంతోషించే లోపునే ఆకాశంలో ఒక వెలుగు వెలిగింది. అక్కడ ఒక దివ్యపురుషుడు కనిపించాడు. విజయుడు ఆశ్చర్యపోయి చూస్తున్నంతలో దివ్యపురుషుడు మాట్లాడాడు.

'ఓ వీరుడా! నాకు శాపవిమోచన కలిగించిన నీకు కృతజ్ఞతలు. నేనొక యక్షుడిని. పూర్వం ఒకరోజు నా ప్రేయసితో కలిసి భూలోకానికి విహారానికి వచ్చి ఈ సరస్సులో దిగి జలకాలాడుతున్నప్పుడు ఒక తపఃశక్తి సంపన్నుడు ఇక్కడికి వచ్చాడు. అతడిని చూడగానే మేం అదృశ్యరూపం దాల్చాం. ఆయన నిష్క్రమించిన తరువాత జలకాలాటలు సాగించాలని ఎదురు చూశాం. కానీ ఆయన సరస్సులో దిగి స్నానం చేయడానికి ఏర్పాట్లు చేసుకోవడం



గమనించాం. అతడిని భయపెట్టి పంపమని చెప్పింది నా ప్రేయసి.

'ఆమె మాటలతో నేను మొసలి రూపం ధరించి మునిని బెదిరించాను. ఆ ముని సామాన్యుడు కాదు. తన తప:శక్తితో నిజం గ్రహించాడు. నా వైపు కోపంగా చూసి నన్ను మొసలిగా మారిపోయి ఇదే సరస్సులో ఉండిపొమ్మని శాపమిచ్చాడు. నేను చేసిన తప్పిదాన్ని ఒప్పుకొని శాపవిమోచన కలిగించమని ప్రాధేయపడ్డాను. అప్పుడా తప:శక్తి సంపన్నుడు కరుణించి ఎపుడైనా మరో మునిని హింసించి చంపబోతుంటే ఎవరైనా మహావీరుడు, సత్యవ్రతుడు, బ్రహ్మచారి అయిన యువకుడు నన్ను వధించినట్లయితే నా అసలు రూపం పొందగలనని శాపవిమోచన మార్గం చెప్పాడు. ఇప్పుడు నీవల్ల శాపవిమోచన పొందాను. అందుకు ప్రతిఫలంగా నీకు సృష్టిలోని అన్ని జీవుల భాష తెలిసే విధంగా వరమిస్తున్నాను. ఫలితంగా నీకు గొప్ప ప్రయోజనం కలుగుతుంది. నీకు ఎప్పుడైనా అవసరం కలిగి నన్ను తలచుకుంటే ఒకసారి మాత్రం ప్రత్యక్షమవుతాను. విజయీభవ,' అని దీవించి అదృశ్యమయ్యాడు. యక్షుడికి నమస్కరించి కృతజ్ఞతలు తెలిపాడు విజయుడు.

అంతవరకూ జరిగింది విజయుడికి కలలా అనిపించింది. యక్షుడు తనకు ప్రసాదించిన వరానికి సంతోషపడ్డాడు.

అంతలోనే అతడికి తాను రక్షించిన ముని విషయం గుర్తు వచ్చింది. అప్పటికి ముని స్పృహ కోల్పోయి ఉన్నాడు. అది కూడా యక్షుడి మహిమ వల్లనే జరిగి ఉంటుందని మనసులో అనుకున్నాడు విజయుడు.

మునికి పరిచర్యలు చేసి స్పృహలోకి రప్పించాడు విజయుడు. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు ముని. విజయుడి వైపు చూసి 'నన్ను కాపాడినందుకు ధన్యవాదాలు. అటువైపుగా నా ఆశ్రమం ఉంది. అక్కడికి చేర్చు నాయనా,' అని చెయ్యి చూపాడు.

తన భుజంపై మునిని ఎత్తుకుని ఆశ్రమం చేరుకున్నాడు. అక్కడికి వెళ్ళగానే ఇద్దరు శిష్యులు విజయుడి వైపు పరిగెత్తి వచ్చారు. 'నువ్వెవరు? మా గురువుగారికి ఏమయింది?' అని ఆసక్తిగా ప్రశ్నించారు.

'గురువు గారిని ఆశ్రమంలోకి చేర్చిన తర్వాత మనం మాట్లాడుకుందాం,' అని చెప్పి లోపలకు తీసుకు వెళ్ళాడు విజయుడు. మునిని ఆశ్రమంలో నేలపై పరిచి ఉంచిన పులి చర్మం మీద పరుండబెట్టాడు.

కాసేపటికి ముని పూర్తిగా తేరుకున్నాడు. తన శిష్యులలో ఒకరిని రమ్మని సైగ చేసాడు. 'వైకుంఠా! మన పెరడులో ఉన్న స్వస్తత తీగ ఆకులతో లేపనం తయారుచేసి ఈ గాయాల మీద పూయి!' అని చెప్పాడు. రెండో శిష్యుడిని కూడ పిలిచి 'ముకుందా! నువ్వు మన అతిథికి ఫలాలిచ్చి ఆకలి తీర్చు,' అని చెప్పాడు.

వారిద్దరూ గురువుగారి ఆదేశాలు పాటించడానికి వెళ్ళారు.

విజయుడిని తనతో తీసుకువెళ్ళి కొన్ని ఫలాలు, కందమూలాలిచ్చి ఆకలి తీర్చాడు ముకుందుడు. ఆయనకు సరస్సు దగ్గర జరిగిన విషయం చెప్పాడు.

దానికా శిష్యుడు 'మా గురువు గారి పేరు తేజస్వి. ఆయన హిమాలయాల్లో తపస్సు చేసి గొప్ప శక్తులు పొందినవారు. అడవుల్లో, పుణ్యక్షేత్రాల్లో గడపడమే గురువుగారికి ఇష్టం. ఎక్కువ సమయం తపస్సు చేస్తూ గడుపుతారు ఆయన. ఆయన అవసరాలు తీరుస్తూ సేవలు చేసుకుంటూ మెప్పు పొందాలని శిష్యులుగా చేరాం మేము,' అని చెప్పాడు ముకుందుడు.

రెండో శిష్యుడు వైకుంఠుడు గురువుగారు చెప్పినట్టు లేపనం తయారు చేసి ముని కాలి గాయాల మీద పూశాడు. లేపనం తగలగానే రక్తస్రావం ఆగిపోయింది. ఇంకా ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే గాయం కూడా మాయమయింది. కాలి మీది చర్మం మునుపటి మాదిరి కనిపించింది. కొద్దిసేపట్లోనే ముని లేచి నిలబడ గలిగాడు. అదంతా చూసిన విజయుడి ఆశ్చర్యానికి హద్దు లేకపోయింది.

ఆశ్చర్యంలో ఉన్న విజయుడిని తన దగ్గరగా వచ్చి కూర్చోమని తేజస్వి చెప్పడంతో అలాగే వెళ్ళి కూర్చున్నాడు విజయుడు. 'ఎవరు నాయనా నువ్వు? ఈ సరస్సు దగ్గరకు ఎలా రాగలిగావు?' అని ప్రశ్నించాడు ముని తేజస్వి.

విజయుడు తన గురించి పూర్తిగా చెప్పాడు. అది విన్న ముని తేజస్వి సంతోషించాడు. అతడికి విద్య నేర్పిన గురువు విద్యాచతురుడు అని వినడంతో 'విద్యాచతురుడి దగ్గర శిష్యరికం చేసిన వారి ఖ్యాతి ఇంతకు ముందు విన్నాను. గొప్ప గురువుకి శిష్యుడివి నువ్వు.' అని ఆనందం వ్యక్తపరిచాడు.

తేజస్వితో మాటల్లో ఉండగానే తనకు రెండు సందేహాలు ఉన్నాయనీ వాటిని తీర్చమని కోరాడు విజయుడు. అందుకు తేజస్వి చెప్పమన్నట్టుగా తల ఊపడంతో విజయుడు ఇలా చెప్పాడు.

'మీరు గొప్ప తపఃశక్తి సంపన్నులు అని విన్నాను. మీ కాలిని మొసలి పట్టినప్పుడు మీ తపోశక్తితో సంహరించకుండా రక్షించమని సామాన్య మానవుడి వలె ఆర్తనాదాలు చేసారెందుకు? మీ శిష్యుడు లేపనం పూయగానే మీ గాయాలు ఎలా మాయం అయ్యాయి?' అని అడిగాడు విజయుడు.

దానికి ముని తేజస్వి 'రాకుమారా! నీ సందేహాలకు జవాబు చెబుతాను. మొసలి నోటిలో కాలు చిక్కినప్పుడు నా స్వశక్తితో బయటపడాలని చూశాను. నా బలం సరిపోని పరిస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే తప్పనిసరియై ఆర్తనాదం చేసాను. చిన్న విషయాలకు తపోశక్తిని వృథా చేయకూడదన్నది నేను అనుకుంటాను. అందుకే అద్భుతమైన శక్తిని దుర్వినియోగం చేయలేదు. అలాంటి గొప్ప శక్తులను స్వార్థానికి కాకుండా లోకకళ్యాణానికే వినియోగించాలన్న నియమంతో అలా ప్రవర్తించాను.

'ఇక రెండవ సందేహానికి జవాబు చెబుతాను. ఆ లేపనం తయారుచేసింది

స్వస్తత తీగ ఆకులతో. అది హిమాలయాల్లో దొరికే అరుదైన మూలిక. దేవతలు, రుషుల పాద ధూళితో తరించిన నేల నుండి ఉద్భవించడం వల్ల దానికి అమోఘమైన శక్తి వచ్చింది. దాని ఆకులకు అద్భుత వైద్య లక్షణం ఉంది. ఆ మొక్క ఏడాదికొకసారి పుష్పించే పుష్పానికి మరింత శక్తి ఉంది. దాని ఆకుల పసరు ప్రభావం నువ్వు స్వయంగా చూసావు కదా!' అంటూ మరిన్ని విశేషాలు వివరించాడు ముని తేజస్వి.

ఆ మాటలు విన్నంతసేపూ విజయుడికి మునిపై చెప్పలేనంత భక్తి ప్రపత్తులు కలిగాయి. 'మహానుభావులు తమ ప్రాణాన్ని కూడ గడ్డిపోచలా త్యజిస్తారే తప్ప స్వార్థానికి అద్భుతశక్తులను వినియోగించరు,' అని మనసులోనే అనుకున్నాడు. ఆయన పాదాల మీద పడి 'మిమ్మల్ని రక్షించడం నా భాగ్యం. మీలాంటి మహానుభావులు జీవించి ఉన్నప్పుడే ఈ లోకానికి ప్రయోజనం సిద్ధించేది,' అని చెప్పాడు విజయుడు.

'నీ ప్రయాణం లోకకళ్యాణ దిశగా సాగి బహుళ ప్రయోజనం సిద్ధించాలని దీవిస్తున్నాను,' అని విజయుడిని ఆశీర్వదించాడు ముని తేజస్వి.

విజయుడికి స్వస్థత తీగ మీద ఉన్న ఆసక్తిని గమనించిన ముని తేజస్వి తీగ దగ్గరకు అతడిని తీసుకుని వెళ్ళి చూపించాడు. స్వస్తత తీగ ఆకులు తమలపాకులు మాదిరిగానే ఉన్నాయి. దాని పక్కనే ఉన్న మరో పూల మొక్కను అల్లుకొని ఎత్తుగా పాకింది తీగ. దాని ఆకులు దట్టంగా అల్లుకొని కనిపించాయి. అంత పెద్దగా అల్లుకున్న తీగలకు మధ్యలో కేవలం ఒక పుష్పం పూసింది. బంగారు రంగులో ఆకర్షణీయంగా ఉండి సువాసనలు వెదజల్లుతోంది. కొన్ని ఆకులను, పుష్పాన్ని తన వెంట తీసుకు వెళ్ళడానికి ఒప్పుకున్నాడు ముని తేజస్వి.

వాటిని తుంచి తన సంచిలో వేసుకున్నాడు విజయుడు. అప్పుడు ముని తేజస్వి 'రాకుమారా! స్వస్థత తీగ ఆకులూ, పుష్పమూ మహాశక్తివంతమైనవి. అవి తీగ నుండి తుంచిన ఆరుమాసాల వరకూ తాజాగా ఉంటాయి. వాటి ప్రభావం చూపిస్తాయి,' అని చెప్పారు.

అంతే కాకుండా ఒక భరిణి నిండా ఒక ప్రత్యేక లేపనాన్ని సృష్టించాడు ముని తేజస్వి. దానిని విజయుడి చేతిలో పెట్టి 'రాకుమారా! ఈ భరిణెను

భద్రంగా ఉంచు. దీనివల్ల ప్రయోజనం ఉంటుంది,' అని చెప్పాడు.

విజయుడు అత్యంత వినయంగా దానిని అందుకొన్నాడు. 'మునివర్యా! మీరిచ్చిన భరిణెలోని లేపనం ప్రయోజనం తెలుసుకోవచ్చునా?' అని అడిగాడు.

అప్పుడు తేజస్వి 'నాయనా! ఆ లేపనానికి చాలా మహిమ ఉంది. కంటిచూపునకు అందకుండా అదృశ్యంగా ఉన్న దేనినైనా చూసే శక్తిని ఇస్తుంది. కనురెప్పల మీద లేపనం పూసి కళ్ళు మూసుకోవాలి. దేనిని చూడాలని అనుకుంటున్నామో దానిని మనసులో తలచుకోగానే అది స్పష్టంగా కనిపిస్తుంది. నీ సుదీర్ఘ పర్యటనలో దాని అవసరం ఉంటుందని నాకు నమ్మకం కలిగింది. అందుకే ఇచ్చాను,' అని చెప్పాడు. ముని తేజస్వికి ధన్యవాదాలు చెప్పి సెలవు తీసుకున్నాడు విజయుడు.

* * *

యక్షుడిచ్చిన వరం ప్రభావం చూపించడం వల్ల ఇతర జీవుల భాషలన్నీ విజయుడి చెవిని చేరి గోలగా అనిపించింది. విజయుడికి వరం ప్రభావం చూపిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అయితే అవన్నీ వినడం కష్టంగా ఉంది.

అంతలోనే అతడికి ఏదో ఆలోచన రావడంతో యక్షుడిని తలచుకొని 'మీరిచ్చిన వరం ప్రభావం చూపిస్తోంది. అందుకు ధన్యవాదాలు. అయితే ప్రాణుల మాటలన్నీ వినేబదులు మేలు కలిగేవి మాత్రమే వినబడేలా వరాన్ని మార్చండి,' అని కోరుకున్నాడు. ఆయన కోరిక ఫలించినట్లు ధ్వనులు తగ్గిపోయాయి. విజయుడికి ప్రశాంతత చేకూరింది.

'ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి ప్రాణీ అవసరానికి మించి మాట్లాడుతూ ఉన్నాయి. విపరీతమైన శబ్దకాలుష్యం సృష్టిస్తున్నాయి. మౌనమే భూషణమనీ, బుద్ధినీ, శక్తినీ అధికం చేస్తుందని అందరూ గ్రహించగలిగితే ఎంతో ప్రయోజనం కలుగుతుంది,' అని అనుకున్నాడు విజయుడు.

అతడలా ఆలోచనల్లో ఉండగా గుర్రం ఒక్కసారి వేగం తగ్గించింది. ఆలోచన ఆపి గుర్రం ఎందుకు వేగం తగ్గించిందో చూశాడు విజయుడు. ఎదురుగా ఉన్న దారి చాలా ఇరుకుగా ఉంది. అటువైపు నుండి ఆవుల మందలు నడిచి వస్తున్నాయి. అవి వేలల్లో ఉంటాయనిపించింది విజయుడికి.



అందుకే గుర్రం ముందుకి వెళ్ళలేక ఆగిపోయింది.

ఆవుల మందల వెనకే పశువుల కాపరులు నడుస్తున్నారు. గుర్రాన్ని దారికి పక్కన నిలబెట్టి పశువుల కాపరిని ఆపి 'అయ్యా! ఒకేసారి ఇన్ని గోవులను ఎక్కడకు తోలుకొని వెళుతున్నారు?' అని అడిగాడు విజయుడు.

ఆ పశువుల కాపరి ఆగడానికి ఇష్టం లేనట్టు ప్రవర్తించాడు. విజయుడి ప్రశ్న విన్నాడు కానీ జవాబు చెప్పకుండా మళ్ళీ నడవసాగాడు. అతడిని మరొకసారి ఆపి 'జవాబు చెప్పకుండా వెళ్ళిపోతున్నావేం?' అని అడిగాడు.

అప్పుడు ఆ పశువుల కాపరి 'నేను పశువుల కాపరిని మాత్రమే. నాకేమీ తెలియదు అన్నా. మా వెనక ఈ మందకి చివర్లో ఒక రాజభటుడు వస్తున్నాడు. అతడిని అడిగితే మీకు జవాబు తెలుస్తుంది,' అని చెప్పాడు.

ఆవుల మందలన్నీ విజయుడు నిలబడ్డ ప్రదేశం దాటడానికి చాలా సమయం పట్టింది. ఓపికగా ఎదురు చూశాడు విజయుడు. గోవుల మందలన్నీ వెళ్ళిన తర్వాత చివర్లో ఒక రాజభటుడు గుర్రంపై కూర్చొని అనుసరిస్తూ వస్తున్నాడు. అతడిని ఆపి ముందు అడిగిన ప్రశ్ననే మళ్ళీ అడిగాడు విజయుడు. దానికా భటుడు జవాబు చెప్పడం ఇష్టం లేనట్టు ముఖం పెట్టి 'చూడబోతే పరదేశిలా ఉన్నావు. మాదేశంలో నీకేం పని?' అని అడిగాడు.

విజయుడు తన గురించి వివరంగా చెప్పాడు. అప్పుడా భటుడు 'నువ్వు పరదేశివి కాబట్టి మా రాజ్యంలో జరుగుతున్న సంగతులు నీకు తెలియవు. ఇప్పుడే వివరంగా చెబుతాను!' అని చెప్పడం ప్రారంభించాడు.

'మాది ద్రవిడ రాజ్యం. మా రాజుగారి పేరు నిశాకరుడు. మంత్రి అయిన కరాళదంతుడి సలహాలని గౌరవించి పరిపాలన చేస్తున్నాడు మహారాజు. అయితే మంత్రి కరాళదంతుడికి ధనదాహం, బంధుప్రీతి ఎక్కువ.

ఒక పక్షం క్రితం జరిగిన సంఘటనని కరాళదంతుడు తన స్వార్థానికి వాడుకున్నాడు. స్నేహితులతో ఆరుబయట ఆడుకుంటున్న యువరాజు సాగరుడిని కట్టు తెంపుకొని అటువైపు వచ్చిన ఒక పొగరుబోతు ఆవు కుమ్మింది. యువరాజు సాగరుడు అంటే రాజదంపతులకు ఎంతో ఇష్టం. ఆయన రాజ దంపతులకు ఎన్నో నోములు, వ్రతాల ఫలితంగా పుట్టినవాడు. చాలా కాలం వేచి చూసిన తర్వాత కలిగిన సంతానం యువరాజు సాగరుడు.

'అలాంటి యువరాజు సాగరుడిని ఆ గోవు తన కొమ్ములతో పొడిచి కాళ్ళతో తొక్కింది. దాంతో యువరాజుకి పెద్ద ప్రమాదం వచ్చింది. బలమైన గాయాలు తగిలి రక్తం పోయి మంచం మీద ఉన్నాడు సాగరుడు. గోవు మీద, గోవుల కాపరి మీద మహారాజుకి వచ్చిన కోపం ఇంతాఅంతా కాదు. ఆ పరిస్థితిని మంత్రి కరాళదంతుడు వినియోగించుకున్నాడు.

'గోవధ యాగం చేస్తే యువరాజు బతుకుతాడని రాజు నిశాకరుడిని మంత్రి ఒప్పించాడు. అసలు విషయం ఏమిటంటే మంత్రి బావ మరిది తంత్రీపాలుడికి చర్మ వ్యాపారం ఉంది. అతడికి లాభం చేకూర్చలన్నది మంత్రి దురాలోచన. ఇప్పుడు ఆ యాగంలో బలి ఇచ్చేందుకు గోవులను తోలుకు వెళుతున్నాం. రెండు రోజుల్లో యాగం మొదలవుతుంది. దానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. మరో మూడు క్రోసుల దూరం ప్రయాణం చేస్తే యాగస్థలాన్ని చేరుకుంటాం,' అని వివరించాడు రాజభటుడు.

విజయుడు భటుడికి ధన్యవాదాలు చెప్పి పరిచయం అడిగాడు. దానికతడు 'నేను రాజు గారి భటులలో ముఖ్యుడిని. మరికొందరితో కలిసి గోసేకరణ చెయ్యమని మహారాజు గారు చెప్పారు. అందుకే గోవుల మందలని తోలుకొని వెళుతున్నాం,' అని చెప్పాడు. అతడికి ఈ యాగం జరిపించడం ఇష్టం లేదని

విజయుడికి తెలిసింది.

'మంత్రిగారి మాయమాటలు వినడం మొదలుపెట్టిన మహారాజు గారికి మేము చెప్పేది బుర్రకి ఎక్కడం లేదు. చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్టే అవుతోంది,' అంటూ జోడించాడు భటుడు.

భటుడితో మాటల్లో విజయుడికి చాల విషయాలు తెలిసాయి. మహారాజుకి భార్య ప్రభావతి అంటే మహా ఇష్టం. ఆమె మాటకి ఎక్కువ విలువ యిస్తాడు. మహారాణి ప్రభావతి గారికి మునులు, యోగులు, తపోధనులు, సాధువులు, సిద్ధులు అంటే భక్తి శ్రద్ధలు ఎక్కువ. వారి అనుగ్రహం కోసం పరితపించిపోతుంది ఆమె.

గోవధయాగం ఆపి ఆవుల ప్రాణం నిలబెట్టాలనుకున్నాడు విజయుడు. మహారాణి మాత్రమే ఈ మారణ కాండను ఆపగలదు. మహారాణి ప్రభావతిని కలవడానికి సులువైన మార్గం ఆలోచించాడు.

* * *

తన పంచకళ్యాణి గుర్రాన్ని కోట బయట ఉన్న పెద్దతోటలోని చెట్టుకి బంధించి మునీశ్వరుడి మాదిరి మారు రూపం ధరించాడు విజయుడు. మహారాణి ప్రభావతి గారికి ప్రతిరోజూ సంతోషిమాత ఆలయానికి వెళ్ళి దర్శనం చేసుకోవడం, పూజలు జరిపించడం అలవాటని తెలియడం వల్ల అక్కడికి వెళ్ళాడు.

సంతోషిమాత ఆలయంలోకి ప్రవేశించి మనస్ఫూర్తిగా విజయుడు పూజలు చేశాడు. మంచి పని కోసం చేస్తున్న తన ప్రయత్నం నెరవేరేలా చేయమని సంతోషిమాతను వేడుకున్నాడు. గోగణానికి తల్లి, స్వర్గనివాసిని అయిన కామధేనువును స్మరించుకున్నాడు. 'సకల లోకానికి పూజ్యనీయమైన గోసంపదను కాపాడే ప్రయత్నం ప్రారంభించాను. నా ప్రయత్నం సఫలీకృతమై ఆవుల ప్రాణాలు నిలపగలిగే శక్తిని ప్రసాదించు,' అని ప్రార్థించాడు విజయుడు.

విజయుడు ఎదురుచూస్తున్న కొంతసేపటికి రాణీ ప్రభావతి వచ్చింది. మునీశ్వరుడి రూపంలో ఉన్న విజయుడిని చూసి భక్తితో నమస్కారం పెట్టి రాజమందిరానికి రావలసిందిగా సాదరంగా ఆహ్వానించింది. వెతకబోయిన

తీగ కాలికి తగిలినట్టు విజయుడు సంతోషించాడు. రాణి ఆజ్ఞ అయిన వెంటనే కొందరు బోయీలు పల్లకీ తెచ్చి విజయుడిని వూరేగించుకుంటూ రాజ ప్రాసాదానికి చేర్చారు.

మొక్కులు సమర్పించుకున్న తర్వాత రాణి ప్రభావతి తిరిగి రాజ ప్రాసాదానికి చేరుకుంది. తపస్సు చేస్తున్న భంగిమలో విజయుడు ఆమెకు దర్శనమిచ్చాడు. ముని రూపంలోని విజయుడికి భక్తితో సేవలు చేసింది ప్రభావతి. భగవంతుడు, పురాణాలు, ఆచారాలు, వ్యవహారాలు మొదలైన వాటి మీద తనకున్న సందేహాలను తీర్చుకుంది. ఆమెతో మాట్లాడుతూ ఉన్నంతసేపూ గోవధయాగాన్ని ఆపడానికి తగిన అవకాశం కోసం చూడ సాగాడు విజయుడు.

సరిగ్గా విజయుడు ఆలోచిస్తున్న విషయాన్నే రాణి ప్రభావతి కదిపింది. చివరగా 'స్వామీ! మహారాజుగారు జరిపించబోతున్న గోవధయాగం దిగ్విజయంగా పూర్తవ్వాలని, మా రాజ్యానికి శుభం జరగాలని దీవించండి. మహా రాజుగారు చేస్తున్న యాగం పూర్తయ్యేవరకూ మీరిక్కడే ఉండి సహకారం అందించాలి. అంతవరకూ మా ఆతిథ్యం స్వీకరించండి,' అని కోరింది ఆమె.

రోగి కోరిందీ, వైద్యుడు ఇచ్చిందీ ఒకటే అన్నట్టు తాను మనసులో అనుకున్న విషయాన్నే రాణి ప్రభావతి అడిగినందుకు సంతోషించాడు విజయుడు. ఆమెతో ఏం చెప్పాలో వెంటనే తోచింది విజయుడికి. ప్రభావతి వైపు చూసి 'అమ్మా! మీరు తలపెట్టిన ఈ గోవధయాగం దుష్ఫలితాలిస్తుంది. మీ రాజ్యానికి అరిష్టం పట్టబోతోంది. మీకు పెద్దనష్టం జరగబోతోంది. తక్షణం దానిని ఆపించాలి,' అని సూటిగా చెప్పాడు. ప్రభావతి భయంగా చూసింది.

'మీ మాటలు నాకేమీ అర్థం కాలేదు స్వామీ. ఈ యాగం జరిపితే వచ్చే నష్టం ఏమిటో సెలవివ్వండి స్వామీ!' భయంగా ప్రశ్నించింది రాణి ప్రభావతి.

గంభీర స్వరంతో 'మహారాజుగారు తలపెట్టిన గోవధ యాగం ఆ స్వర్గలోకంలో ఉన్న గోవులతల్లి కామధేనువుకి కోపం తెప్పించింది. పరమ పవిత్రమైన సాధుజంతువులు, పరోపకారం తప్ప మరేమీ తెలియని మూగ జీవులను వధిస్తున్నారని కోపించింది. ఈ యాగం జరిపినట్లయితే మహారాజుగారి ప్రాణానికి ప్రమాదం కలగాలని శపించింది,' చెప్పాడు విజయుడు.

ప్రభావతి తన చెవులను తానే నమ్మలేకపోయింది. ఆమె చాలా కంగారు పడింది. 'స్వామీ! మహారాజు గారికి ప్రాణ ప్రమాదమంటే నాకు భయంగా ఉంది. మీరు మీ శక్తులు ప్రయోగించి ఆ ప్రమాదం నుండి మహారాజుగారిని కాపాడలేరా?'

'కామధేనువు మహా శక్తివంతమైన దేవత. ఎదురు నిలవలేం. అయినా ఇలాంటి ప్రమాదాన్ని ఎవరైనా కొని తెచ్చుకుంటారా? గోవధయాగం ఆపించండి. ప్రమాదం కూడా తప్పిపోతుంది,' బదులిచ్చాడు విజయుడు.

'స్వామీ. మహారాజుగారి క్షేమం కోరి మీరు ఆదేశించిన విధంగా చేస్తాము. మీమాట శిరోధార్యంగా భావించి మహారాజుగారిని ఒప్పిస్తాను,' అంది ప్రభావతి.

రాణి ప్రభావతి పంపిన భటుడు వెంట అక్కడికి చేరుకున్నాడు మహారాజు. విజయుడి మస్తిష్కం తీరిక లేకుండా ఆలోచిస్తోంది.

సరిగ్గా అప్పుడే ఆ గదిలోని దక్షిణ మూలలో ఉన్న కలుగు నుండి రెండు ఎలుకలు మాట్లాడు కోవడం అతడికి వినిపించింది. శ్రద్ధగా ఆలకించసాగాడు విజయుడు.

'నువ్వు రాణి గారి వజ్రాల హారాన్ని ఎందుకు తీసుకువచ్చావు?' అని అడిగింది ఒక ఎలుక.

'అది తినే పదార్థమనుకున్నాను. దానిని కొరికినప్పుడు కాదని తెలిసింది!' అని చెప్పింది రెండో ఎలుక.

అప్పుడు మొదటి ఎలుక 'మహారాజుగారికి వజ్రాలహారం పోయిన విషయం తెలిసి కలుగు తవ్విస్తే మన గతేం కాను? మనం ఎక్కడికి వెళ్ళగలం?' అని బాధ పడింది. అంతఃపురంలో లభించినంత రుచికరమైన ఆహారం దొరకదని వాటికి తెలుసు.

'అది మెరుస్తుంటే ఆశపడి తెచ్చాను. అప్పుడు ఏదో చప్పుడు రావడంతో భయంతో నోట కరుచుకొని వచ్చాను. పరీక్షించి తెచ్చే అవకాశం రాలేదు,' చెప్పింది రెండో ఎలుక.

విజయుడికి వాటి వ్యవహారం పూర్తిగా అర్థమయ్యింది.

మహారాజు నిశాకరుడు అక్కడికి చేరుకునేలోగానే ఇదంతా జరిగి పోయింది. అంతవరకూ విజయుడితో చర్చించిన విషయం ప్రభావతి ఆయనకు

వివరించింది. చాలా ఆందోళన చెందాడు మహారాజు నిశాకరుడు.

విజయుడికి నమస్కరించి 'స్వామీ! ఈ యాగం ఆపకపోతే నాకు ప్రాణహాని తప్పదంటున్నారా! యాగం జరపించకపోతే మా రాజ్యానికి వినాశనం తప్పదని మంత్రిగారు చెప్పారు. యాగం నిలిపేస్తే మరొక రూపంలో అయినా మా రాజ్యానికి ఆపద వస్తుందని మాకు భయం కలుగుతోంది,' అన్నాడు మహారాజు.

వర్తమానం చేరడంతో మరి కొంతసేపటికి మంత్రి కరాళదంతుడు కూడా అక్కడికి చేరుకున్నాడు. అయనతో కూడా ఇదే విషయం చర్చించాడు మహారాజు.

తన పథకం బెడిసి కొడుతోందన్న ఆందోళన కనిపించింది మంత్రిగారి ముఖంలో. అయినా తనకు తానే ధైర్యం తెచ్చుకున్నాడు మంత్రి. 'మహారాజా! కాషాయ వస్త్రాలు ధరించే వారంతా మహిమ గల మునీశ్వరులు అయిపోతారా? ఇతడేదో స్వార్థం ఆశించి అలా చెబుతున్నాడని నాకు అనిపిస్తోంది. మనం తలపెట్టిన యాగం ఆపేస్తే మన రాజ్యానికి వినాశం కలుగుతుందని శత్రురాజులు పంపిన దొంగ మునీశ్వరుడేమో ఇతడు. అతడిని నిశితంగా పరీక్షించకుండా మీరు ఏ నిర్ణయమూ తీసుకోవద్దు,' అని చెప్పాడు.

కరాళదంతుడి మనస్సు విజయుడికి స్పష్టంగా అర్థమయ్యింది. కరాళదంతుడు సామాన్యుడు కాడు. ఆయనతో చాలా జాగ్రత్తగా వ్యవహరించ వలసి వుంది.

మంత్రి చెప్పిన వాదన మహారాజుకి సబబే అనిపించింది. మహారాజుగారి హావభావాలు గమనించిన ప్రభావతిలో భయం పెరిగింది. 'నాథా! మునులు దైవ స్వరూపులు. దైవ సేవకులు. వారిని మనం పరీక్షించడమా? మంత్రిగారి మాటల మీద విశ్వాసం ఉంచి మునీశ్వరుడి మాటలను అలక్ష్యం చేయవద్దు. ఈ మునీశ్వరుడు నేను కోరి రమ్మంటేనే మన కోటలో అడుగు పెట్టారు తప్ప ఆయన స్వార్థంతో ఇక్కడకు రాలేదు. నా మాట వినండి. మునీశ్వరుడిని నమ్మండి,' అంది ఆమె.

మహారాణి అంత స్పష్టంగా విడమరిచి చెప్పినా మహారాజు ఆలోచనల్లో మార్పు కనిపించలేదు. విజయుడి వైపు అనుమానంగా చూసి 'మీరు మహిమగల

ముని అని ఎలా నమ్మమంటారు?' అన్నాడు.

విజయుడు ప్రశాంతవదనంతో మహారాజు వైపు చూసి 'తక్షణం నమ్మిస్తాను మహారాజా,' అని చెప్పి గాలిలో చేతులు కదిపాడు. కళ్ళు మూసి ధ్యానం చేసి దేన్నో చూసినట్లు ముఖంలో భావాలు పలికించాడు. తరువాత మహారాజు వైపు తిరిగి 'మహారాణి ప్రభావతి గారి వజ్రాలహారం మాయమైన విషయం మీకు తెలుసా?' అని అడిగాడు.

మహారాజు నమ్మలేనట్టు చూశాడు. రాణి ప్రభావతి అదుర్దాగా లేచి నిలబడింది. మహారాజు వైపు తిరిగి 'క్షమించండి మహారాజా. మీదగ్గర ఆ విషయం గోప్యంగా ఉంచాను. నా వజ్రాల హారం రెండు రోజుల క్రితం మాయమయింది. మీకెలా తెలియపరచాలో అర్థం కాక మనసులో మథన పడుతున్నాను. ఇతరులెవ్వరికీ తెలియని వజ్రాలహారం అపహరణ సంగతి మునీశ్వరుడికి తెలిసిందంటే ఈయన తప్పకుండా గొప్ప మహిమాన్వితుడే,' అని చెప్పింది.

మంత్రి జోక్యం చేసుకొని 'అమ్మా! మీ వజ్రాలహారం పోయిన విషయం చెప్పగానే అతడిని అతిగా నమ్ముతున్నారు. తొందరపడవద్దు. దానిని ఎవరు దొంగిలించారో చెప్పిన పక్షంలో ఈయన మాటలు నమ్ముదాం,' అన్నాడు కరాళదంతుడు. మహారాజు ముఖంలో కూడా చిరునవ్వు కనిపించింది. మంత్రిగారు చెప్పినట్టు చేస్తే వజ్రాలహారం కూడా తిరిగి లభిస్తుంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు!

విజయుడి మోహంలో ప్రశాంతత చెదరలేదు. 'మీ వజ్రాలహారాన్ని మనుషులు దొంగతనం చేయలేదు,' అన్నాడు.

'మనుషుల పని కాదా? మరి దేవతలో, రాక్షసులో వచ్చి దొంగతనం చేసారా?' అని వ్యంగ్యంగా అడిగాడు మంత్రి. విజయుడు ఒక హాస్యగాడిగా కనిపించాడు ఆయనకు.

దానికి విజయుడు చిరుకోపం నటిస్తూ 'మూర్ఖుడా! ఎగతాళి కట్టిపెట్టి నేను చెప్పింది చెయ్యి. లేదంటే నా శాపానికి గురి కాగలవు,' అని హెచ్చరించాడు. మంత్రి ఈసారి బెదిరిపోయాడు.

అప్పుడు విజయుడు దక్షిణ దిశగా ఉన్న ఎలుక కలుగును చూపించి,



'దానిని తవ్వించి వెతికితే వజ్రాలహారం దొరుకుతుంది,' అన్నాడు.

ఇద్దరు భటులు కలుగును తవ్వారు. శబ్దాలకు కలుగులో ఉన్నఎలుకలు బయటకు పరుగు తీసాయి. మట్టిపెళ్ళల మధ్యలో కళ్ళు మిరిమిట్లు గొలిపే కాంతితో వజ్రాల హారం కనిపించింది.

రాజదంపతుల కళ్ళలో మెరుపు మెరిసింది. విజయుడికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కరాళదంతుడికి గొంతులో పచ్చివెలక్కాయ పడింది. 'దీనికే సంబరమెందుకు మహారాజా! వారిని ఇంకొక మహిమ చూపించమని అడగండి,' అన్నాడు.

విజయుడు చిరునవ్వు నవ్వి 'మహారాజా! మంత్రిగారికి నా మీద ఇంకా నమ్మకం కలగలేదు. ఈ రాజ్యానికి శుభం చెయ్యాలన్న సదుద్దేశంతో వారి కోరికను కూడా తీరుస్తాను,' అన్నాడు.

అంతలో అక్కడకి ఒక చెలికత్తె పరుగు పెడుతూ వచ్చింది. 'యువరాజు గారికి ప్రాణగండం పెరిగిందని రాజ వైద్యులు సెలవిచ్చారు. ఊపిరి తీసుకోవడం భారమవుతోందని తెలిపారు. గాయాలకు పూసిన లేపనాలు కూడ వికటించాయని తెలిపారు. మిమ్మల్ని తక్షణం వెంటబెట్టుకుని రమ్మన్నారు,'

విన్నవించుకుంది ఆమె.

మహారాజు మోహంలో రంగులు మారాయి. అసహనం, కోపం పెరిగిపోయింది. 'ఎన్నో పూజలు జరిపితే పుట్టిన సంతానం యువరాజు సాగరుడు. వాడిని పొట్టన పెట్టుకుంటే గోవులను బతకనివ్వను. యాగం జరిగి తీరుతుంది,' ఆవేశంతో లేచి నిలబడ్డాడు మహారాజు.

అంతవరకూ విజయుడి మాటల మీద ఆయనకు కలిగిన నమ్మకమంతా పోయినట్లయింది. మంత్రి మోహంలో వికృతమైన నవ్వొకటి మెరిసింది. తన పథకం ఎట్టి పరిస్థితులలోనూ బెడిసికొట్టదని అనుకున్నాడు మంత్రి.

ఇదంతా మంత్రిగారి పన్నాగమని భావించాడు విజయుడు. యువరాజు చనిపోతే ఆ కోపంలో మహారాజు ఈ యాగాన్ని జరిపించి తీరతాడు కాబట్టి అతడికి చేస్తున్న వైద్యం వికటించేలా చేస్తున్నాడని అనుమానించాడు విజయుడు. పైగా రాజు నిరాశలో మునిగిపోతే రాజ్యాన్ని మంత్రే కబళించగలడు. ఇది మరో ప్రమాదం.

రాణి ప్రభావతి మాత్రం విజయుడి పాదాల మీద పడి 'స్వామీ! నాకు పుత్రబిక్ష పెట్టండి. నా పుత్రుడి ప్రాణాలు కాపాడండి,' అని కన్నీరుమున్నీరుగా విలపించింది.

మంత్రి కరాళదంతుడు, 'మునీశ్వరా! వజ్రాలహారం రప్పించడం గొప్ప విషయం కాదు. యువరాజు ప్రాణాలు నిలబెట్టండి. మీ శక్తిని పూర్తిగా నమ్ముతాం. మా రాజుగారికి పుత్రబిక్ష పెట్టండి,' అన్నాడు. స్వామి భక్తి ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది. ఆయన నటన అది.

అంతలో మరో చెలికత్తె వచ్చింది. 'యువరాజు సాగరుడు స్పృహ కోల్పోయారు. రాజవైద్యులు ఆందోళన చెందుతున్నారు,' అని విన్నవించింది. అక్కడ నుండి యువరాజు సాగరుడున్న మందిరానికి అందరూ వెళ్ళారు. అక్కడ వాతావరణం గంభీరంగా ఉంది.

యువరాజుని రాణి ప్రభావతి తన ఒడిలో పెట్టుకొని ఏడుస్తోంది. కొడుకులో చలనం లేదు. అతడి గుండె కొట్టుకోవడం లేదు. తన కొడుకు చనిపోయాడని నిశ్చయానికి వచ్చేసింది. కన్నతల్లి శోకాలు మొదలుపెట్టింది. మహారాజు నిశాకరుడు మొదలు నరికిన చెట్టులా కూలబడి పోయాడు.

బాధలో ఉన్న రాజదంపతులకు విజయుడు ధైర్యం చెప్పి, రాజ వైద్యుల వైపు తిరిగాడు. 'నా శక్తినంతా ప్రయోగిస్తాను. యువరాజు ప్రాణాన్ని కాపాడతాను. శోకాలు ఆపి వైద్య ప్రక్రియకు సహకరించండి,' అన్నాడు.

విజయుడు తన సంచిలో ఉన్న స్వస్థత తీగ పుష్పాన్ని బయటకు తీసాడు. దానిని కళ్ళకద్దుకొని ముని తేజస్విని తలచుకున్నాడు. 'మీరిచ్చిన ఈ పుష్పంతో యువరాజు ప్రాణం నిలబెట్టండి,' అని ప్రార్థిస్తూ, ఆ పుష్పాన్ని యువరాజు సాగరుడి నాసికారంధ్రాల దగ్గర ఉంచాడు. కాళికామాతను కూడ మనసులోనే ప్రార్థించి యువరాజుకు ప్రాణాన్ని తిరిగి ప్రసాదించమని వేడుకున్నాడు.

ఆశ్చర్యం! సాగరుడు కళ్ళు తెరిచాడు. చుట్టూ ఉన్న వారికి మతులు పోయాయి. మహారాజు నిశాకరుడు, రాణి ప్రభావతి విజయుడి కాళ్ళ మీద పడి 'అమోఘం స్వామీ! యువరాజు ప్రాణాలు కాపాడారు. మీకు మీరే సాటి. ధన్యవాదాలు,' అన్నారు. వాళ్ళ గొంతులు ఆశ్చర్యం, ఆనందాలతో బొంగురు పోయాయి.

రాజవైద్యుల ప్రాణాలు కుదుటపడ్డాయి. యువరాజే మరణించి ఉంటే! మహారాజు వాళ్ళను శిక్షించేవాడేమో!

విజయుడు 'యువరాజు గారి గాయాలను పూర్తిగా మాన్పించి మునుపటి స్థితికి తీసుకువచ్చే మందు కూడ నా సంచిలో ఉంది. దాన్ని ఇప్పుడు వాడతాను,' అని చెప్పాడు.

ఆ మాటలకు మహారాజు మరింత ఆశ్చర్యపోయి 'మునీశ్వరా! మీరు కోరినట్టు గోవధ యాగం ఆపు చేయిస్తాను,' అని వాగ్దానం చేసాడు. గోవుల మూలంగానే ఈ ముని అనుగ్రహం లభించింది!

తన సంచిలో నుండి స్వస్థత తీగ ఆకులతో లేపనం తయారుచేసి దాన్ని యువరాజు సాగరుడి శరీరం మీద ఉన్న గాయాలకు పూశాడు విజయుడు. అక్కడ ఉన్న వారందరూ ఆశ్చర్యపోతుండగా గాయాలన్నీ తక్షణం మటు మాయమయ్యాయి. సాగరుడి శరీరం పూర్వపు బంగారు ఛాయకు చేరుకుంది. మంచం మీద నుండి సాగరుడు లేచి నిలబడ్డాడు. తల్లిని కౌగిలించుకొన్నాడు. తండ్రికి నమస్కరించాడు. 'మీరంతా నా గదిలో ఎందుకు ఉన్నారు? ఎందుకు విచారంగా ఉన్నారు?' అని ప్రశ్నించాడు సాగరుడు నిద్ర లోంచి లేచి మాట్లాడినట్టుగా.

రాజదంపతుల ఆనందానికి అంతులేక పోయింది. మంత్రి మొహం అప్పటికే మాడిపోయింది. రాజ వైద్యుల ఆశ్చర్యానికి ఇక అంతే లేదు. 'మీరు దైవాంశ సంభూతులు. సాగరుడిని మామూలు మనిషిని చేసారు,' అని విజయుడిని ప్రశంసించారు.

మహారాజు నిశాకరుడు 'స్వామీ! మీరు మహిమగల వారు. అందుకు సందేహం లేదు. మిమ్మల్ని పరీక్షించాలనుకున్న నన్ను మన్నించండి. ఈ గోవధయాగం తక్షణం ఆపేసినట్టు ప్రకటన పంపిస్తాను. గోహత్యా పాతకం నుండి నన్ను రక్షించారు. అలాంటి ఆలోచన చేసినందుకు నన్ను మన్నించండి,' అని కోరాడు నిశాకరుడు.

విజయుడు ఆయన చేతులు అందుకుని 'మహారాజా! గోవు మహా పవిత్రమైన జంతువు. అది జన్మనిచ్చిన అమ్మ కంటే ఎందులోనూ తీసిపోదు. అందుకే గోమాత అని పిలుస్తారు,' అన్నాడు విజయుడు.

రాణి ప్రభావతి 'ఘోరపాతకం నుండి మహారాజుని రక్షించారు మునివర్యా. ఆ దేవుడే మిమ్మల్ని మా రాజ్యానికి పంపించి ఈ పాతకాన్ని ఆపు చేయించాడు,' అంది.

మహారాజు 'నిజమే మునివర్యా! మహారాణి ప్రభావతి చెప్పినట్లు మీరు మాకెంతో మేలు చేసారు. తక్షణమే గోవధ యాగాన్ని నిలుపు చేస్తూ, గోమహత్యాన్ని చాటుతూ రాజ్యమంతటా ప్రకటన పంపిస్తాం,' అని పత్రం సిద్ధం చేయించి రాజ్యం నలుమూలలకు పంపించాడు.

విజయుడు, 'మహారాజా! నేను చెప్పబోయే మరొక్క విషయం మీరు శ్రద్ధగా వినాలి. ఇది మీ మంత్రిగారికి వ్యతిరేకంగా చెప్పబోతున్నాను. మీరు వద్దని చెబితే ఆపేస్తాను,' అని సంశయంతో ఆగాడు.

విజయుడిపై పూర్తి నమ్మకం కలిగినందున నిశాకరుడు వద్దని చెప్పలేదు. 'మునీంద్రా! మా రాజ్య శ్రేయస్సు కోరి ఇక్కడకు వచ్చారు. నా ప్రాణం, నా కుమారుడి ప్రాణం కూడ మీ వల్లే నిలిచాయి. మీరు నిస్సందేహంగా చెప్పండి,' అన్నాడు నిశాకరుడు.

'మీ మంత్రి బావమరిదికి చర్మాల వ్యాపారం ఉంది. అతడికి మేలు చేద్దామని మీ మంత్రి ఇటువంటి దారుణానికి ఒడిగట్టాడు. నేను చెప్పింది

అబద్ధమని నిరూపించమని మీ మంత్రిని అడగండి,' అన్నాడు విజయుడు.

పట్టరాని కోపంతో మంత్రి కత్తి దూసి విజయుడి తల నరకబోయాడు. విజయుడు ఆ సంగతి గ్రహించి ఆయన ఎత్తు పారకుండా చేసాడు. ఆయన చేతులు వెనక్కు విరిచి పట్టుకొని చేతిలోని కత్తిని పడగొట్టాడు. రాజాజ్ఞ కావడంతో కొందరు భటులు మంత్రిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

విజయుడు చెప్పినదంతా అబద్ధమని బుకాయించాడు మంత్రి కరాళదంతుడు. అయితే విజయుడి తపోశక్తితో తననేమైనా చేస్తాడని భయపడి కాసేపాగి నిజం ఒప్పుకున్నాడు. ఆయనను పదవీచ్యుతుడిని చేసి మహారాజు ఖైదులో వేయించాడు. కొందరు భటులను పంపి మంత్రికి బావమరిది తంత్రీపాలుడిని బంధించి తెచ్చారు. అతడు కూడా నేరాలను సులువుగానే అంగీకరించాడు.

మహారాజు సంతోషానికి అంతులేదు. 'మీరు మా పాలిట దైవంలా వచ్చారు. మా మంత్రిగారి విషయం మీరెలా కనుగొన్నారు?' అని అడిగాడు.

'నాకు కొన్ని అద్భుత శక్తులు అబ్బాయి మహారాజా!. ఇదంతా దైవ కృప. నా కృషి ఫలితం. మనుషుల మాటలనే కాకుండా ఇతర ప్రాణుల భాషను కూడా తెలుసుకోగలను. కాసేపటి క్రితం ఆ గోడ మీద ఉన్న రెండు బల్లులు మాట్లాడుకున్నది విన్నాను. నేను విన్నదానినే మీకు చెప్పాను,' చెప్పాడు విజయుడు.

ఆ రాత్రికి అక్కడి అతిథి గృహం లోనే విశ్రాంతి తీసుకున్నాడు విజయుడు. ఆయన మనసులో తెలియని బాధ పట్టుకుంది. కామధేనువు తనకి కనబడినట్టు అసత్యవాక్కులు చెప్పానని బాధపడ్డాడు. కామధేనువుకు మనసులోనే క్షమాపణ చెప్పిన తరువాత ఆలస్యంగా నిద్రపోయాడు. ఆ రోజు రాత్రి కామధేనువు ఆయన కలలో కనిపించింది. 'వత్సా! నువ్వు అసత్యం పలకడానికి ఒక గొప్పకార్యం కారణమని తెలుసుకున్నాను. అందువల్ల నువ్వు అసత్యం చెప్పిన దోషం నీకు కలగదు. నా మహిమతో ఆ దోషాన్ని కడిగేస్తున్నాను. గోజాతికి నువ్వు చేసిన పెద్ద సాయానికి సంతోషపడ్డాను. అందుకు కానుకగా నువ్వు అవసరంలో ఉండి తలచుకొన్నప్పుడు ప్రత్యక్షమై నీకు సాయపడతానని వరమిస్తున్నాను,' అని పలికి అదృశ్యమయింది.



మెలకువ వచ్చిన తర్వాత విజయుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. గోవధయాగం ఆపడం వల్ల మహోపకారం చేసి మహాపుణ్యం పొందినట్టు గ్రహించాడు. సాక్షాత్తూ కామధేనువు తన కలలో కనిపించి దీవనెలు అందించడం మరింత శుభసూచనగా భావించాడు.

మరునాడు ఉదయమే రాజదంపతులు వీడ్కోలు చెప్పగా అక్కడ నుండి బయలుదేరాడు విజయుడు.

* * *

తన పంచకళ్యాణి గుర్రాన్ని బంధించిన వృక్షాన్ని చేరుకున్నాడు విజయుడు. గుర్రాన్ని ప్రేమగా నిమిరి దానికి గడ్డి తినిపించాడు. చెట్టు మీదకి చూసి 'మిత్రమా! రాకుమారుడికి నామీద ప్రేమ లేదని, తిరిగి రాడని ఎగతాళి చేసావు. నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాడని అన్నావు. ఇప్పుడు చూడు. నా యజమాని వచ్చాడు,' అంది గుర్రం.

విజయుడు ఆశ్చర్యపోయి గుర్రం ఎవరితో మాట్లాడుతోందా అని చెట్టు మీదికి చూశాడు. చెట్టు కొమ్మమీద ఒక పెద్ద గద్ద కనిపించింది.

ఆ గద్ద మామూలుగా లేదు. చూడగానే ఒళ్ళు జలదరించేంత పెద్దదిగా ఉంది. ఒక మనిషిని కూడా తేలికగా మోసుకెళ్ళగలిగేంత ఆకారంతో ఉంది. గుర్రంవైపు మెడ తిప్పి 'చూశాను మిత్రమా. మీ యజమాని మంచివాడే. నువ్వు అదృష్టవంతుడివి,' అని చెప్పింది గద్ద.

'నీకు అందించిన మేత, నీరు సరిపోయాయా!' గుర్రాన్ని ప్రశ్నించాడు విజయుడు.

'వాటికి ఇబ్బందేమీ కలగలేదు రాకుమారా! చెట్టు మీద వాలిన గద్దతో కాలక్షేపం చేసాను. కొత్తకొత్త విషయాలు, విశేషాలు విన్నాను. నువ్వు తిరిగి వచ్చేవరకూ సమయం తెలియకుండా గడిపాను,' అని జవాబిచ్చింది గుర్రం.

'నువ్వు జంతువువు. అది పక్షి. మీ మధ్యలో పంచుకోవడానికి విశేషాలు ఏముంటాయి?' ప్రశ్నించాడు విజయుడు.

గుర్రం వింతగా నవ్వి 'పొరబడుతున్నావు రాకుమారా! మీ మనుషుల కంటే మా మధ్యనే విశేషాలు ఎక్కువ ఉంటాయి. గద్ద మిత్రుడు గాలిలో ఎగురుతూ ఎన్నో వింతలు, విశేషాలు చూడగలడు కదా,' అని ఆ విశేషాలు చెప్పడం ప్రారంభించింది.

గుర్రం చెప్పింది సరిగా బోధపడలేదు విజయుడికి. అది గ్రహించింది చెట్టుమీదున్న గద్ద. వెంటనే చెట్టు మీద నుండి కిందకు దిగింది. విజయుడికి ఎదురుగా నేల మీద నిలబడింది.

దానివైపు చూశాడు విజయుడు. అది విజయుడికి సమానమైన ఎత్తులో ఉంది. ఒంటరిగా మనుషులు దాన్ని చూస్తే భయంతో జడుసుకొని ప్రాణం వదలడం ఖాయం అనుకున్నాడు. ఆయన సహజంగా ధైర్యవంతుడు, పరాక్రమశాలి కాబట్టి దానివైపు చూసి 'చాల పెద్దగా ఉంది నీ ఆకారం. నీలాంటి గద్దలను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. మా గుర్రంతో చెప్పిన విశేషాలు నాక్కూడా చెబుతావా?' ప్రశ్నించాడు విజయుడు.

'నేను మొదటిసారి నీలాంటి మానవుడితో మాట్లాడుతున్నాను. నరమాంసం భక్షించడమే తప్ప మనుషులతో ఎప్పుడూ మాట్లాడలేదు,' అని చెప్పింది గద్ద.

'నేను మనుషులకు ప్రమాదం తలపెట్టే గద్దలను ఎన్నింటినో చంపాను

కానీ వాటితో మాట్లాడలేదు. నీతో మాట్లాడడం నాకు కూడ మొదటిసారే,' బదులిచ్చాడు విజయుడు.

గద్ద భయపడుతూ, 'రాకుమారా! నువ్వు గొప్ప వీరుడివని నీ గుర్రం ద్వారా తెలిసింది. నీవంటి యోధుడితో మాట్లాడడం నాకు ఆనందంగా ఉంది. నీకు నా కథ చెబుతాను,' అని ప్రారంభించింది.

* * *

భువనదేశాన్ని పులస్త్యుడు అనే రాజు పరిపాలించే వాడు. ఆయన రాజ్యం పాడిపంటలతో, భోగభాగ్యాలతో తులతూగుతుండేది. ప్రజారంజకంగా పరిపాలన చేసేవాడు. ప్రజలను కన్నబిడ్డలలాగా చూసేవాడు. ప్రజలలో మంచిపేరు తెచ్చుకున్నాడు. మహారాణి ఊర్మిళ తన భర్త మనసెరిగి ప్రవర్తించే పతివ్రత. వారికి ఇద్దరు సంతానం. యువరాజు పేరు ధర్మతేజుడు. యువరాణి పేరు విజయలక్ష్మి. తండ్రి తేజస్సు, శౌర్యం ధర్మతేజుడుకి సొంతమయ్యాయి. తల్లి అందచందాలు, సౌశీల్యత యువరాణికి సొంతమయ్యాయి. వారిద్దరూ గుణగణాలలో తల్లిదండ్రులని తీసిపోని వారు. విద్యలను చురుకుగా అభ్యసిస్తూ గురుదీవనెలు పొందారు.

కాలం ఎప్పుడూ ఒకే రకంగా గడవదు.

మహారాణి ఊర్మిళకు అంతు చిక్కని వ్యాధి సోకింది. ఆమెకు వైద్యం చేసేందుకు రాజ్యం నలుమూలల నుండి వైద్యులను పిలిపించారు. వైద్యులు చెయ్యని చికిత్స అంటూ లేదు. అయినప్పటికీ మహారాణికి వ్యాధి నయం కాలేదు. రోజురోజుకీ ఆమె ఆరోగ్యం క్షీణించి మహాసుందరి అయిన రాణి ఊర్మిళ కురూపిగా మారిపోయింది. ఆమె జుత్తుమొత్తం రాలిపోయింది. చర్మం నల్లగా కమిలిపోయింది. తనను చూసేవారికి భయం కలిగేటట్టుగా ఆమె మారిపోయింది. తమ పిల్లలు పెరిగి పెద్దయ్యి, వారి వివాహం చూసే వరకు బతికించమని వెయ్యి దేవుళ్ళకు మొర పెట్టుకొంది రాణి. దేవుడామె మొర ఆలకించలేదు. మహారాణి ఊర్మిళ ఆ వ్యాధితోనే మరణించింది. అప్పటికి యువరాజు వయసు పన్నెండేళ్ళు, యువరాణికి పదేళ్ళు మాత్రమే.

మహారాణి మరణంతో పులస్త్యుడు తీవ్రమైన మనోవ్యాధికు గురయ్యాడు.

రాజ్యపాలన మీద ఆయనకు ఆసక్తి తగ్గిపోయింది. ఆంతరంగిక మందిరానికే ఆయన పరిమితమయ్యాడు. మరో రెండేళ్ళు భారంగా గడిచాయి.

మంత్రి మధుకరుడు మహారాజ కుటుంబం పట్ల ఎంతో భక్తి విశ్వాసాలు ఉన్నవాడు. మహారాజు పరిపాలించని లోటుని ప్రజలకు తెలియకుండా చూసాడు మంత్రి. ఆంతరంగిక మందిరంలో ఉన్న రాజుగారి అనుమతి తీసుకుంటూ రాజుగారి ఆదేశాలు ఆయన అమలు చేస్తూ పాలన సాగిస్తున్నాడు.

కాలచక్రం మరోసారి మలుపు తిరిగింది.

ఆ దేశపు సైన్యాధికారి భుజంగుడు. ఆయనకి ఎప్పటినుండో సింహాసనం మీద ఆశ ఉంది. మహారాజుగారి పరాక్రమ శౌర్యాలు తెలిసిన వాడు కాబట్టి ఎదురు తిరగాలనే సాహసం గతంలో ఎప్పుడూ భుజంగుడు చేయలేదు. ఇప్పటివరకూ సమయం అనుకూలంగా లేక తగ్గి ఉన్నాడు. తగిన సమయం, సందర్భం చూసి సింహాసనం సొంతం చేసుకోవాలని భుజంగుడు చూస్తున్నాడు. మహారాణి మరణం వల్ల రాజుగారిలో వచ్చిన వైరాగ్యం భుజంగుడిలో కొత్త ఆశలు చిగురించాయి.

రాజ్యపాలన మీద మహారాజుకు ఆసక్తి సన్నగిల్లింది.

సైన్యాధికారి భుజంగుడికి ఒక అందమైన సోదరి ఉంది. ఆమె పేరు చిత్రాంగి. చిత్రాంగిని ఎలాగైనా పట్టపురాణిగా కూర్చుండబెడితే ఆమె సోదరుడిగా తనకు సింహాసనం ఎక్కే అవకాశం వస్తుందని అనుకున్నాడు. అందుకు ఏమి చేయాలో బాగా ఆలోచించాడు.

ఒక రోజు మంత్రి మధుకరుడి దగ్గరికి చిత్రాంగిని తీసుకొని వెళ్ళాడు భుజంగుడు. ఆమెను చూపించి 'ఈమె నాకు తెలిసిన మహిళ. పేరు చిత్రాంగి. ఈమె మంచి కళాకారిణి. నాట్యం బాగా చేస్తుంది. వైద్యంలో కూడ ప్రవేశం ఉంది. రాజ్యపాలన అలక్ష్యం చేస్తూ ఆంతరంగిక మందిరానికి పరిమితమై ఒంటరితనంతో గడుపుతున్న మన మహారాజుకి సేవలు చేస్తుంది. మన రాజుగారికి వినోదం పంచి, విచారాన్ని దూరం చేసే బాధ్యతలు అప్పగిస్తే వాటిని నిర్వర్తిస్తుంది. మహారాజుగారిని ప్రత్యేకంగా కనిపెడుతూ అవసరాలు తీరుస్తుంది. తమరు అనుమతిస్తే ఆమెను రాజుగారి సేవలకై నియమిద్దాం!' అని చెప్పాడు.

మహారాజు త్వరగా కోలుకోవాలని ఎక్కువగా ఆశపడే వారిలో మధుకరుడు మొదటివాడు. రాజుగారి క్షేమం కోరి చిత్రాంగిని వెంటనే నియమించాడు.

చిత్రాంగికి ఏయే పనులు చెయ్యాలో ముందుగానే చెప్పాడు భుజంగుడు. ఆమె వాటిని వరసగా ఆచరణలో పెట్టింది. మహారాజుని తన నాట్యంతో మురిపిస్తూ మధుపానానికి అలవాటు చేసింది. నెమ్మదిగా మహారాజుని లొంగదీసుకుంది. అప్పటినుండి పులస్త్యుడు పూర్తిగా మధుపాన సేవనానికి బానిసయ్యాడు. రాజ్యపాలనను పూర్తిగా విస్మరించాడు. విందులు వినోదాలు, రాసకేళీ విలాసాల్లో మునిగి తేలడం తప్ప పరిపాలన బాధ్యతలు పట్టించు కోవడం మానేసాడు.

ఇంతకు ముందు ముఖ్య నిర్ణయాలు తీసుకోడానికి అంతరంగిక మందిరంలోకి మంత్రిగారిని అనుమతించేవాడు మహారాజు. ఇప్పుడు మంత్రిగారిని కూడా రాజు గారి దరిదాపులకు రానివ్వడం లేదు చిత్రాంగి.

భుజంగుడు చెప్పిన రెండవ ఎత్తుగడ ప్రకారం మహారాజు పులస్త్యుడిని ప్రజల దృష్టిలో చెడ్డవ్యక్తిగా, వ్యసనపరుడిగా చిత్రీకరించే పనిలో పడింది చిత్రాంగి. అలా జరిగితే నెమ్మదిగా ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని, అప్పుడు



ఆయనని దించేసి ఆమె రాణి అవుతుందని చిత్రాంగికి నచ్చ చెప్పాడు. అలా లభించిన అధికారాన్ని తనకే ఒప్పచెబుతుందని భుజంగుడి కుటిల భావన.

ఒక వేళ ఆ ప్రయత్నంలో చిత్రాంగి విఫలమైతే భుజంగుడు సైన్యం ద్వారా తిరుగుబాటు ప్రకటించి రాజుగా గద్దెనెక్కాలనుకున్నాడు. ఆయన సలహా మేరకు మధుపానం చేసి మైకంలో ఉన్న మహారాజుని సభలకి హాజరయ్యేలా చేసేది చిత్రాంగి.

మంత్రి మాట పెడచెవిన పెట్టి తన మాటలు, సలహాలు వినేలా చేయడంలో చిత్రాంగి క్రమేపీ పురోగతి సాధించింది. అది వారి మూడవ ఎత్తుగడలో భాగం.

ఒక రోజు నిండు సభలో రాజు పులస్త్యుడు కూర్చుని ఉన్నాడు. ఆయన ఎప్పటిలాగానే మధువు సేవించి పూర్తిగా మైకం కమ్మి ఉన్నాడు. సరిగ్గా అప్పుడే కొంత మంది కాషాయవస్త్రధారులు రాజసభకు వచ్చారు.

వారు రాజు పులస్త్యుడికి నమస్కరించి 'రాజా! మేము మహా తపస్వి శ్వేతకేతుడి శిష్యులం. మా గురువుగారు మీ రాజ్యం మీదుగా ప్రయాణం చేస్తూ ఈ రోజుకి మీ వద్ద ఆతిథ్యం పొందాలనుకున్నారు. తమకు వసతి ఏర్పాటు చేయమని గురువు గారు కోరారు. వారు ప్రస్తుతం ఊరి బయట దుర్గాదేవి ఆలయంలో పూజలు జరుపుతున్నారు. తర్వాత ఇక్కడకు వేంచేస్తారు,' అని చెప్పారు.

మధుపాన మైకంలో ఉన్న పులస్త్యుడు వారు చెప్పింది సరిగా వినిపించుకోలేదు. అప్పుడు మంత్రి మధుకరుడు జోక్యం చేసుకొని 'మహారాజా! మునీశ్వరులు మన రాజ్యానికి విచ్చేసినప్పుడు స్వాగత సత్కారాలు పలికి వసతి కల్పించడం మన సంప్రదాయం. వారు తపోగుణ సంపన్నులు. మన రాజ్యం మరింత సుభిక్షంగా ఉండేందుకు వారి దీవనెలు అవసరం,' అని చెప్పాడు.

మహారాజు పులస్త్యుడు ఆ మాటలు వినిపించుకోకుండా 'నేను మహారాజును. రాజ్యపాలకుడిని. నాకెవరి మాటలు వినాల్సిన అవసరం లేదు. తపఃసంపన్నులైతే నాకేం? ఎవరైతే నాకేం? పోయి అడవికి వెళ్ళి ముక్కుమూసి తపస్సు చేసుకోమని చెప్పండి,' అన్నాడు. అంతే కాదు. మంత్రి మీద, శిష్యుల మీద విసుగు ప్రదర్శించాడు.

'అపచారం అపచారం. మా గురువుగారు మహా తపఃసంపన్నులు. ఆయన మీ రాజ్యంలో అడుగు పెట్టడమే మీ భాగ్యం. వారు తమను వసతి కోరడమే మీ అదృష్టం,' విన్నవించుకున్నారు శిష్యులు.

మధుకరుడికి శిష్యులమాటలు అమృతతుల్యాలుగా తోచాయి. మహారాజు పులస్త్యుడికి మరోమారు ఆయన నచ్చ చెప్పబోయాడు. మహారాజు మైకంలో ఉండి రకరకాలుగా ప్రేలాపన చేస్తున్నాడు. ఈసారి ఆయన మరింత కఠినంగా మాట్లాడాడు. 'మునులైతే ఎవరికి ఎక్కువ. నేను మహారాజుని. విశాలమైన భువన దేశానికి రాజుని. నాకే నీతులు చెబుతారా? నేనెవరి మాటా వినను. ఎవరికీ స్వాగతం పలికేది లేదు. పొమ్మని చెప్పండి. మర్యాదగా వేరొకచోటుకి పోయి ఉండమని చెప్పండి. లేదా భటులకి చెప్పి నేనే రాజ్యం బయటికి పంపించేస్తాను,' అని కసిరేసాడు.

పులస్త్యుడు అలా కసురుతున్న సమయంలోనే ముని శ్వేతకేతుడు సభకు విచ్చేసాడు. మహారాజు పులస్త్యుడి దూషణలు విన్నాడు. ఆయన మొదటే ముక్కోపి. పులస్త్యుడు తనను అవమానించడం తట్టుకోలేక పోయాడు. ముని తనను తాను నిగ్రహించుకోలేక పోయాడు.

వెంటనే 'ఓరీ మూర్ఖుడా! మునీశ్వరులన్నా, తపఃశక్తి సంపన్నులన్నా నీకింత అలుసా? మహారాజునన్న గర్వంతో కళ్ళుమూసుకుపోయి మాట్లాడుతూ ఉన్నావు. సుభిక్షమై సంపదలతో తులతూగుతున్న ఏ రాజ్యాన్ని చూసుకొని విర్రవీగుతున్నావో ఆ రాజ్యాన్ని కరువుకాటకాలు పట్టిపీడించు గాక! మనుషులన్నవారు మాయమై శవాల దిబ్బలు పేరుకుపోవు గాక. స్మశానంలో నువ్వు క్షణక్షణం దుఃఖం అనుభవించుదువు గాక!" అని శపించాడు ముని.

మహారాజు మైకం నుండి బయట పడి జరిగిన విషయం మంత్రి ద్వారా తెలుసుకున్నాడు. అప్పటికే ముని శ్వేతకేతుడు అక్కడనుండి వెళ్ళిపోయాడు. శాపవిమోచన మార్గం కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. మధుపాన సేవనం వల్ల ఎంత అనర్థం జరిగిందో గ్రహించాడు పులస్త్యుడు. ఆయన వెంటనే చిత్రాంగిని ఖైదులో తోయించాడు. ఆమె ద్వారా భుజంగుడి గురించి తెలుసుకొని ఆయనను కూడా పదవి నుండి తొలగించాడు. అయితే ముని శాపం క్రమక్రమంగా ప్రభావం చూపడం ప్రారంభించింది.

రాజ్యాన్ని కరువు కాటకాలు పట్టి పీడించడం మొదలుపెట్టాయి. ఒక్క వారం రోజుల్లోనే పరిస్థితులు తిరగబడటం మొదలైంది. వర్షాలు కురవడం మానేసాయి. అకస్మాత్తుగా చెరువుల్లో, నూతుల్లో, నదుల్లో జలాలు ఇంకి పోయాయి. ఫలితంగా పంటలు నాశనమయ్యాయి. భద్రపరచుకున్న తిండి గింజలూ, పప్పు ధాన్యాలూ ఆశ్చర్యకరంగా పురుగులు పట్టి పాడైపోయాయి. ఆకలి చావులు మొదలయ్యాయి. గుక్కెడు నీరు కోసం ప్రజలు కొట్టుకునే రోజులు వచ్చాయి. వేగుల ద్వారా రాజ్యంలోని పరిస్థితులు తెలుసుకుంటున్న మహారాజుకి తాను చేసిన తప్పిదం ఎంత పెద్దదో అర్థమయింది.

ఆ తరువాత చాలా మంది మునులను దర్శించి తమ రాజ్యానికి శ్వేతకేతుడి శాపం వల్ల ఏర్పడిన ప్రమాదం నుండి గట్టెక్కించమని ప్రార్థించాడు. శ్వేతకేతుడి శాపం అని వినగానే అందరూ జడుసుకునేవారే తప్ప ఏ ఒక్కరూ తరుణోపాయం చెప్పలేదు. అలా కొన్నాళ్ళు గడిచేసరికి మహారాజుకి తాను చేసిన ఘోర తప్పిదం వల్ల భువనదేశానికి పట్టిన దుస్థితికి చింతించాడు. ఆయనను మనోవ్యాధి పట్టుకొని పీడించింది. ఆ బాధతోనే ఆయన మరణించాడు.

పులస్త్యుడి కొడుకు ధర్మతేజుడికి పట్టాభిషేకం జరిపించాడు మంత్రి మధుకరుడు. భువనదేశానికి రాజు మారినా ప్రయోజనం లేకపోయింది. రాజ్యంలో నీరు లేక, పంటలు పండక ఆహార పధార్థాల కొరతతో రోజూ వందలాది మంది చనిపోసాగారు. ఇరుగుపొరుగు రాజుల సహాయం కొన్నాళ్ళ పాటు లభించింది. వారు మాత్రం ఎన్నాళ్ళని పోషించగలరు? తమవల్ల కూడ కాదని, సహాయం చెయ్యలేమని ఇరుగు పొరుగు రాజులు తేల్చి చెప్పారు.

భువనదేశం నుండి చాలా మంది ప్రజలు పొరుగు రాజ్యాలకు వలస వెళ్ళారు. వల్లకాటిని తలపించే విధంగా తయారయింది భువన దేశం. కరువుకాటకాన్ని అధిగమించేందుకు యువరాజు చెయ్యని ప్రయత్నాలు లేవు.

అప్పటికి ధర్మతేజుడు సింహాసనం అధిరోహించి ఏడాది దాటింది. ఎన్నివిధాల ప్రయత్నించినప్పటికీ ఈ గండం నుండి గట్టెక్కే మార్గం కనిపించ లేదు. ఈ పరిస్థితులను ఎదుర్కోవడం మామూలుగా వీలు కాదని గ్రహించారు. దాంతో రాజ్యమంతటా చాటింపు వేయించారు. భువనదేశంలో ఏర్పడిన కరువుని పారదోలిన వారికి, లేదా పారదోలే సలహా ఇచ్చినవారికి వారికి

నచ్చిన అయిదు ఊర్లు ఇచ్చి సత్కరిస్తామని ప్రకటన చేయించారు.

ఆ ప్రకటన చేసి పదిహేను రోజులయినా ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఈసారి బహుమతి మొత్తాన్ని పెంచారు. రాజ్యంలోని కరువును పారదోలిన వారికి పావురాజ్యం ఇచ్చి సత్కరిస్తామని ప్రకటించారు. అలా మరో పదిహేను రోజులు గడిచాయి అయినా ఫలితం లేక పోయింది. ధర్మతేజుడికి ఏం చేయాలో తోచలేదు.

మంత్రి గారితో సమావేశమై తన ఆందోళన వ్యక్తపరిచాడు ధర్మతేజుడు. ఈసారి బహుమతిని మరింత పెంచేలా సలహా ఇచ్చాడు మంత్రి. ఈ మారు ప్రకటనను తమ రాజ్యంలోనే కాక చుట్టుపక్కల ఉన్న చాలా రాజ్యాలలో చాటింపు వేసారు. ధీరులైన యువకులు కరువు సమస్యకు పరిష్కారం కనుక్కోగలిగితే భువనదేశంలో అర్ధ రాజ్యమిచ్చి పట్టాభిషేకం చేస్తామని చెప్పారు. ఈసారి వేసిన చాటింపు వల్ల పది పదిహేను మంది యువకులు వచ్చి యువరాజును కలిసారు. తమ ప్రయత్నం తాము చేస్తామని చెప్పారు. వెళ్ళిన వాళ్ళు మూడు నెలలు దాటిన తర్వాత తిరిగి వచ్చారు.

'మేము చాలా మంది రుషులను, మునులను, యోగులను, సిద్ధులను, సాధువులను కలిసాం. వారంతా శ్వేతకేతుడి పేరు చెప్పగానే భయపడుతున్నారు. ఆయన ఇచ్చిన శాపానికి తిరుగులేదట. ఫలితం అనుభవించాల్సిందే అంటూ ఉన్నారు తప్ప ఎవరూ ఏమీ చెయ్యలేమని చెప్పారు. మా వల్ల కాదు,' అని ప్రకటించి వాళ్ళు కూడా వెళ్ళిపోయారు.

ధర్మతేజుడికి ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. మంత్రి మధుకరుడు తన తెలివినంతా ఉపయోగిస్తున్నా కరువుని అధిగమించే మార్గం తోచడం లేదు. అప్పటికీ సైన్యాన్ని వినియోగించి పొరుగు రాజ్యం నుండి నీరు, ఆహారం కొని తెప్పించి సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ ఆకలిదాహాలతో ప్రతి రోజు వందలాది మంది చనిపోతున్నారు.

ఈ దఫా అర్ధరాజ్యంతోబాటు యువరాణినిచ్చి వివాహం జరిపిస్తామని చాటింపు వేయించారు. ఈసారి కూడా చాలా రాజ్యాల నుండి అనేక మంది యువకులు ఆశపడి వచ్చారు. అయినా వారి వల్ల కూడా ప్రయోజనం లేక పోయింది.

ఆ రాజ్యంలో ఉన్న పక్షులు, జంతువులు కూడా పొరుగు రాజ్యాలకు వలస వెళ్ళిపోయాయి. అలా కొన్ని పక్షుల ద్వారా భువనదేశపు కరువు సంగతి ఇతర రాజ్యాలలో ఉన్న పక్షులకు, జంతువులకు తెలిసింది.

భువన దేశపు తూర్పుదిక్కున ఒక దీవి ఉంది. ఆ దీవి పేరు అద్భుత దీవి. అద్భుత దీవిలో ఒక అడవి ఉంది. అక్కడ అనేక రకమైన పక్షులు, జంతువులు నివసిస్తున్నాయి. అక్కడ జంతువులన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. అవి ఆకారంలో చాలా పెద్దగా ఉంటాయి. అక్కడున్న నేల సారం వల్ల, అక్కడ దొరికే ఆహారంలోని గొప్పదనం వల్ల జీవులన్నీ అలా తయారయ్యాయి. చెవులపిల్లి, జింక, కోతి వంటి జంతువులు ఏనుగంత ఆకారంలో ఉంటాయి. ఇక పక్షులయితే ఆరడుగుల ఎత్తుకు తక్కువ ఉండవు. అక్కడ పెరిగే కాకి, గద్ద, చిలుక, పావురం, నెమలి... ఇలా ఏ పక్షి అయినా భారీ ఆకారాలతో ఉంటాయి. రాబందుల సంగతైతే చెప్పక్కరలేదు. అవి మరింత భారీగా ఉంటాయి. మరో విచిత్రమేమంటే అవన్నీ మాంసాహార జీవులు. పక్కనే ఉన్న సముద్రంలోని చేపలను వేటాడి తింటాయి. అవి దొరకనప్పుడు జంతువులను చంపి పక్షులు తింటాయి. అలాగే ఆహారం దొరక్కపోతే పక్షులను చంపేసి జంతువులు తింటాయి.

భువనదేశం నుండి పారిపోయి ఆ దీవికి వచ్చాయి కొన్ని పక్షులు. తాగడానికి నీరు దొరకక వలస వెళ్ళాయి ఆ పక్షులు. అవి అద్భుతదీవిలో ప్రవేశించి తమ దేశపు పరిస్థితిని చెప్పాయి. 'మా దేశంలో శవాల గుట్టలు పేరుకుపోయి ఆహారమయితే కావల్సినంత దొరుకుతుంది. కానీ దాహం తీర్చుకోడానికి నీటిచుక్క కూడా దొరకడం లేదు. మహారాజు సరఫరా చేసే నీరు మనుషులకే చాలడం లేదు. మేమక్కడ దాహం కొరత తీరకపోవడంతో ఇక్కడకు వచ్చాం,' అని చెప్పాయి.

అద్భుతదీవిలో పెరిగే పక్షులకు, జంతువులకు ఒక అలవాటు ఉంది. అక్కడ పుట్టి పెరిగిన అన్ని జీవులూ ఆరునెలల వరకూ నీరు దొరకకపోయినా బతికి ఉండగలవు. కావసినంత ఆహారం దొరుకుతుందని అక్కడి పక్షులకు తెలిసి భువనదేశం వెళ్ళాయి. అలా భువనదేశం వెళ్ళి అక్కడ దొరికిన శవాలను పీక్కుతిన్నాయి. ఆరు నెలల కాలంలో నచ్చినంత ఆహారం తిన్నాయి. వాటికి

దాహం ప్రారంభమయ్యే రోజులు దగ్గర పడడంతో తిరిగి తమ దీవికి బయలుదేరాయి. అలా వచ్చి, తిరిగి వెళుతున్న పక్షుల్లో గద్ద ఒకటి.

* * *

'మా దీవిలో ఆహారానికి, నీటికీ, గాలికీ అలవాటు పడిన వాళ్ళం ఎక్కువ కాలం వేరే రాజ్యంలోని వాతావరణంలో గడపలేం. ఆహారానికి ఆశపడి కొంతకాలం గడిపితే మా ప్రాణాలు పోతాయి. అందుకే మా గద్దలన్నీ తిరిగి వెళ్ళిపోతున్నాయి. అలసట వచ్చి కొద్దిసేపు విశ్రమించి వెళ్ళాలని ఇక్కడ ఆగాను. మీ గుర్రం ఒంటరిగా ఉండడంతో మాట్లాడుతూ గడిపాను,' చెప్పింది అద్భుతదీవి నుండి భువనదేశానికి వెళ్ళిన ఆ గద్ద.

'నువ్వు మా గుర్రంతో మాట్లాడడం వల్ల మంచే జరిగింది. నాకు భువనదేశపు పరిస్థితి తెలిసింది. ఇప్పుడు నా కర్తవ్యం తెలిసి వచ్చింది. అయినా నరమాంస భక్షణ చేసిన కారణం వల్ల నీమీద నాకు కోపంగా ఉంది,' చెప్పాడు విజయుడు.

'నేను చచ్చి పడి ఉన్న శవాలను తిన్నాను. మీ మనుషులకు మహోపకారం చేసాను. కుళ్ళిన శవాల వల్ల పుట్టిన కాలుష్యానికి విష వ్యాధులు ప్రబలి మరెంత మంది మరణించి ఉండేవారో కదా! అంతేకానీ నాకు ఆహారం అవసరమై అక్కడి మనుషులను నేను చంపలేదని గ్రహించు రాకుమారా!' అని బదులు పలికి పైకి ఎగిరింది గద్ద.



'ఆగు మిత్రమా! నాకు మరికొన్ని వివరాలు చెప్పి వెళ్ళు,' పిలిచాడు విజయుడు.

'ఇంకా ఎక్కువసేపుంటే నాకు ప్రాణగండం కలుగుతుంది. ఇప్పటికే ఆలస్యం అయింది,' అని బదులుగా చెప్పి తన ప్రయాణ వేగం పెంచింది గద్ద.

విజయుడు తన గుర్రాన్ని ఎక్కి ద్రావిడ రాజ్యపు రాజధానీ నగరంలోకి ప్రవేశించాడు. ఇంతకు ముందు ముని వేషధారణలో ఉండడం వల్ల నగర విశేషాలు చూడలేదు. ఇప్పుడు తన అసలు రూపంలో వెళ్ళి ఆ రాజ్యంలో ఉన్న వింతలూ, విశేషాలూ తెలుసుకోవాలనుకున్నాడు విజయుడు.

నగరంలో ప్రజలందరూ చాల సంతోషంగా కనిపించారు. అందరి నోట ఒకటే మాట. 'మన రాజ్యానికి గొప్ప మహిమగల ముని వచ్చారట. మరణించిన యువరాజుని బతికించారట. గోవధ యాగం ఆపించారట!' అని చెప్పుకుంటూ ఉన్నారు.

ప్రజలు చాల మంచివాళ్ళని గ్రహించాడు విజయుడు. అతడెక్కడకి వెళ్ళినా వాళ్ళు ఆదరణ చూపించారు. అతడి దాహం తీర్చారు. ప్రేమగా పలకరించి కుశలాలు అడిగారు. పరదేశి అని తెలిసి మరింతగా అతడిని గౌరవించారు. పండ్లరసం, చిక్కటి ఆవుపాలు ఇచ్చి తాగమని అతడిని కోరేవారు. పండ్ల రసం, ఆవు పాలు కొందరి వద్ద మాత్రం స్వీకరించాడు విజయుడు. విజయుడికి ఆకలి తీరింది.

ఆ నగరంలోని ఒక ప్రముఖ వ్యాపారి ధనగుప్తుడు. ఆయనకు వర్తక కేంద్రంలో పెద్ద దుకాణం ఉంది. ఆ దుకాణంలో అమ్మే వస్తువుల్లో సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, విదేశీ వస్తువులు ఎక్కువగా ఉన్నాయి. వాటిని ఆయన విదేశాల నుండి తెచ్చి నగరంలో అమ్ముతాడు. అలాగే ద్రావిడ రాజ్యంలో విరివిగా లభించే వస్తువులను ఎగుమతి చేసి ఇతర రాజ్యాలలో అమ్ముతూ ఉంటాడు. విజయుడిని ఆ వ్యాపారి చూసి పరదేశి అని గుర్తించి తన ఇంటికి భోజనానికి ఆప్యాయంగా ఆహ్వానించాడు.

విజయుడు సున్నితంగా తిరస్కరించాడు ఆ వ్యాపారి విడిచి పెట్టలేదు. 'నాయనా! నాకు విదేశాల్లో వర్తకం చేయడం అలవాటు. మీ దేశం గురించి

తెలుసుకోవాలని ఉంది. అందుకే భోజనం నెపంతో ఆహ్వానించాను. నువ్వు దేశసంచారం చేస్తున్నావని గ్రహించాను. నీ వల్ల కొత్త రాజ్యాల విశేషాలు తెలిసొస్తాయన్నది నా ఆశ. కాదనకు,' అని బతిమలాడాడు ఆ వ్యాపారి.

ధనగుప్తుడి నుండి భువనదేశపు విశేషాలు తెలుసుకోవాలన్న కోరిక విజయుడికి కూడా కలిగింది. అందువల్ల సరేనన్నాడు. మధ్యాహ్నవేళ భోజన సమయం వరకూ ఆగి వారిద్దరూ కలసి వర్తకుడి ఇంటికి వెళ్ళారు. వర్తకుడి భార్య సాదరంగా విజయుడిని ఆహ్వానించింది. విజయుడికీ, తన భర్తకు చల్లటి పానీయం అందించింది. అనేక రకాల పండ్ల రసాలతో తయారైన పానీయం అది.

భోజనం పూర్తి చేసిన తర్వాత విజయుడి నుండి ఎన్నో విశేషాలు అడిగి తెలుసుకున్నాడు ధనగుప్తుడు. తన గురించి, తమ రాజ్యంలోని వింతల గురించి వివరంగా చెప్పాడు విజయుడు. 'నేనింకా చాలా దూరం పోవలసి ఉంది,' అని చెప్పి భువనదేశం విశేషాలు అడిగాడు విజయుడు.

విజయుడు తన తదుపరి పర్యటన భువనదేశానికి అని చెప్పగానే ధనగుప్తుడి మోహంలో ఆందోళన కనిపించింది. 'వద్దు రాకుమారా! నువ్వు భువనదేశం వైపు వెళ్ళవద్దు. ప్రస్తుతం అక్కడ శవాలగుట్టలు తప్ప మరేమీ లేవు. ఆహారం, మంచి నీళ్ళు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు,' అని చెప్పాడు.

'మీరు భువనదేశం ఎప్పుడైనా వెళ్ళారా? ఇక్కడికి ఎంత దూరంలో ఉంది? నన్ను వెళ్ళొద్దని వారించే బదులు మీలాంటి ధనికులు అక్కడి పరిస్థితులు చక్కబడేవరకు ప్రజలకు సహాయ పడవచ్చు కదా!' అన్నాడు విజయుడు.

ధనగుప్తుడు విచారంగా మొహం పెట్టి 'నా వ్యాపారంలో సగభాగం భువనదేశంతో ముడిపడి ఉండేది. ఆ రాజ్యంలో కరువు విలయ తాండవం చేయడం వల్ల ఇప్పుడు అక్కడకి వెళ్ళడం మానేసాను. బంగారం లాంటి రాజ్యం నేడు వల్లకాడుని తలపిస్తోంది. ఆ రాజ్యంలోని ప్రజల ఆహారం, నీటి సరఫరాల కోసం ఇంతవరకూ ఎంతో ధనాన్ని విరాళమిచ్చాను. గానుగలో గరిటెడు అన్న సామెతలాగా మనమేం చేసినా అక్కడ ఒక మూలకి సరిపోవడం లేదు. ఎంత చేసినా ప్రయోజనం కనిపించటం లేదు. ఆ రాజ్యంలోని సమస్య మామూలు మానవుల సహకారం వల్ల తీరేది కాదు,' అని చెప్పాడు.

'నా వంతు ప్రయత్నంగా ఆ దేశానికి ఏదైనా చేయాలని ఉంది. భువనదేశం వెళ్ళేందుకు సులువైన మార్గం చెప్పండి,' అని అడిగాడు విజయుడు.

విజయుడి సంకల్పాన్ని ఆయన మెచ్చుకుని 'గొప్ప మనసుతో ఆలోచించావు నాయనా! ఆ రాజ్యాన్ని ఆపద నుండి గట్టెక్కిస్తే అర్ధరాజ్యమిచ్చి, యువరాణితో వివాహం జరిపిస్తామని మొన్ననే యువరాజు చాటింపు వేయించారు. ఇక్కడ నుండి తూర్పు దిశగా యాభై యోజనాల దూరంలో భువన దేశం ఉంది. మార్గమధ్యంలో దట్టమైన అడవులు, కొండలు, నదులు దాటవలసి ఉంటుంది. మార్గం కష్టతరమైనదే. ఏడు రాత్రులూ, ఏడు పగళ్ళూ నిరంతరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది,' అని చెప్పాడు.

విజయుడు మరొకసారి తనకి కలిగిన సందేహాలు అడిగి తీర్చుకుని ఆ రోజే బయలుదేరాడు. విజయుడికి మరో మూడు రోజులకు సరిపడేలా ఆహారాన్ని పొట్లాలు కట్టించి ఇచ్చాడు ధనగుప్తుడు.

విజయుడు ఆయనకీ ధన్యవాదాలు తెలిపి 'మీ సంతానాన్ని నాకు పరిచయం చేయలేదు,' అన్నాడు.

ధనగుప్తుడు ఒక్కసారిగా కృంగిపోయాడు. అయినా తేరుకుని 'ఎంత ధనమున్నా నాకు తృప్తిలేని విషయం అదే రాకుమారా! నాకు ఒకే ఒక్క కొడుకు. కానీ వాడికి మాటలు రావు. మతి చాంచల్యంతో ప్రవర్తిస్తుంటాడు. ఎప్పుడూ ఎటో చూస్తూ గడుపుతుంటాడు. చూపులో స్పష్టత లేదు. ఎందరో వైద్యులకు చూపించాను. ప్రయోజనం లేకపోయింది. అందుకే వాడిని అతిథులకు పరిచయం చెయ్యకుండా గదిలోనే ఉంచుతాం. అయినా నా సంతానం సంగతి ఎందుకు అడిగారో తెలుసుకోవచ్చా?' తిరిగి ప్రశ్నించాడు.

దానికి విజయుడు 'మీరు మంచి హృదయం గల వ్యాపారి. మీ ఇంట్లో భోజనం తిన్నందుకేమో మీకు మేలు చేసే అవకాశం కలిగింది. మీ కుమారుడి విషయం మీ ద్వారా కూడా నాకు తెలిసింది,' అని చెప్పాడు.

'మీ మాటలు వింతగా ఉన్నాయి రాకుమారా. నా కుమారుని గురించి మీకెలా తెలిసిందో అంతు పట్టడం లేదు. నాకు చాల ఆశ్చర్యంగా ఉంది,' అన్నాడు ధనగుప్తుడు.

'నాకు సృష్టిలోని అన్ని ప్రాణుల భాషలూ తెలుసు. మీ ఇంటినుండి

బయటకు వెళుతున్నప్పుడు మీ దొడ్లో రాటకి కట్టిన ఆవూదూడలు నన్ను చూసి మాట్లాడింది విన్నాను,' అన్నాడు విజయుడు.

'మన యజమాని తన కొడుకుని ఈ అతిథికి చూపిస్తే బాగుండేది. ఆయన ఆరోగ్యం కుదుటపడేది,' అంది ఆవు.

'వచ్చిన అతిథి అంత గొప్పవాడా?' అని అడిగింది దూడ.

'అవును. ఆయన అనేక గోవుల ప్రాణాలు కాపాడిన మహానుభావుడు. మన యజమాని వంటి మంచి మనిషికి ఈ విషయం తెలియదు కదా!' అని బాధపడింది ఆవు.

'మీ ఆవూదూడల సంభాషణ వినగానే మీ కొడుకు తీరని బాధల్లో ఉన్నాడని గ్రహించాను. పెంపుడు జంతువుల మీద మనం చూపించే ప్రేమ వృథా పోదని మీ ఆవుల సంభాషణ తెలిపింది. యజమాని క్షేమం కోసం మూగజీవులు కూడా తపిస్తాయని చెప్పడానికి ఇదే నిదర్శనం,' అన్నాడు విజయుడు.

ధనగుప్తుడు అంతులేని సంతోషంతో భార్యని పిలిచి తన పదేళ్ళ కొడుకుని రప్పించాడు. విజయుడి ముందు నిలబెట్టాడు. విజయుడు తన సంచిలో



నున్న స్వస్థత తీగ పుష్పాన్ని బయటకు తీసి ధనగుప్తుని కుమారుడి నాసికా రంధ్రాల దగ్గర ఉంచాడు. కాసేపటి తరువాత కొన్ని స్వస్థత తీగ ఆకులు తీసి లేపనం తయారుచేసి పిల్లవాడి నుదుటిభాగాన అతికించాడు. అద్భుతం జరిగినట్టు ఆ పిల్లవాడిలో స్పష్టమైన మార్పు ప్రారంభమైంది.

ఆ పిల్లవాడు నవ్వుతూ విజయుడి వైపు తిరిగి 'మీకు ధన్యవాదాలు!' అని మొట్టమొదటి మాట పలికాడు. అది మొదలు అతడి నోటివెంట గలగల మాటలు దొర్లి వచ్చాయి. పదేళ్ళ నుండి మౌనంగా ఉండి పోయిన బాలుడి నోటి నుండి మాటల వరద తలిదండ్రుల వైపు పారింది.

తలిదండ్రుల సంతోషానికి అంతులేక పోయింది. వాళ్ళు విజయుడి కాళ్ళమీద పడిపోయారు. 'నాకు ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. ఈ శుభ సందర్భంగా నా సగం ఆస్తిని భువనదేశపు ప్రజలకోసం వెచ్చించాలని నిర్ణయించుకున్నాను,' అని ప్రకటించాడు ధనగుప్తుడు.

దానికి విజయుడు సంతోషించి 'మీ నిర్ణయాన్ని మీ రాజుగారికి తెలపండి. మీ లాంటి మరికొందరు భాగ్యవంతులు ముందుకు వస్తారు. అప్పుడు కొంతయినా ఉపయోగం ఉంటుంది,' అని చెప్పాడు.

ధనగుప్తుడు ఇంటి లోపలికి వెళ్ళి ఒక అత్తరు సీసాతో బయటకు వచ్చాడు. అత్తరుసీసా వల్ల ఎలాంటి ఉపయోగం ఉందో వివరంగా చెప్పి దానిని విజయుడి చేతిలో పెట్టాడు.

'ఇంత గొప్ప వస్తువు మీకు ఎవరి నుండి వచ్చిందో తెలుసుకోవచ్చా?' అడిగాడు విజయుడు.

'తప్పకుండా చెబుతాను. నేను విదేశీ వర్తకం చేస్తున్నప్పుడు ఒకసారి సముద్ర యానం చేస్తున్నాను. ఆ ప్రయాణంలో నాకొక ఫకీరు పరిచయం అయ్యాడు. ఇద్దరమూ కలిసి ఓడలో ఆరు నెలలు కలసి ఉన్నాం. అప్పుడు అతడికి మంచి స్నేహితుడినయ్యాను. మా గమ్యం చేరిన తరువాత విడిపోయే ముందు ఆ ఫకీరు నాకు ఈ అత్తరు సీసాను బహూకరించి 'మీరు వ్యాపారం పని మీద కుటుంబానికి దూరంగా గడుపుతున్నారు. ఈ అత్తరు చాల మహిమ గలది. ఇది మీకు ఉపయోగపడుతుంది,' అని నా చేతిలో పెట్టాడు. ప్రస్తుతం దాని అవసరం నాకంటే నీకే ఎక్కువ ఉంది. నువ్వు ఇప్పుడు పర్యటనలో

ఉన్నావు. కాదనకుండా స్వీకరించు,' అన్నాడు ధనగుప్తుడు.

'అలాగా! చాల సంతోషం. తిరుగు ప్రయాణంలో మళ్ళీ మిమ్మల్ని తప్పకుండా కలుస్తాను,' అని వ్యాపారి వద్ద సెలవు పుచ్చుకొని గుర్రం ఎక్కాడు విజయుడు.

* * *

విజయుడి ప్రయాణం మొదటి రోజు సాఫీగానే సాగింది. రెండో రోజు దట్టమైన అడవి మీదుగా ప్రయాణం చేయవలసి వచ్చింది. అలాంటప్పుడు గుర్రం వేగం తగ్గి నెమ్మదిగా వెళ్ళేది. కొంతసేపు చెట్టునీడలో విశ్రాంతి తీసుకుని గుర్రాన్ని పచ్చిక బయలు మీద వదిలేవాడు. వెలుతురు బాగున్నప్పుడు వేగంగా వెళ్ళేవాడు, అడవి దాటుతుండగా అడ్డొచ్చిన క్రూరమృగాలను ఎదుర్కొనేవాడు విజయుడు.

ఒకసారి అడవి మధ్యలో నుండి వెళుతూ ఉండగా ఒక ప్రమాదం జరిగింది. ఒక చెట్టు కొమ్మ మీద చుట్టుకొని ఉన్న కొండచిలువ విజయుడి మీద పడి పట్టు బిగించింది. అతడిని కింద పడేసింది. ఊహించని ఆ ఘటనతో కాస్తంత గందరగోళం కలిగినా వెంటనే తేరుకున్నాడు విజయుడు. కొండచిలువ విజయుడికి అవకాశం ఇవ్వకుండా అతడి చేతులని చుట్టేయాలని, మింగి వెయ్యాలని చూసింది. అదే జరిగితే దానిని చంపేందుకు కత్తి తీసే అవకాశం కూడా అతడికి లభించదు.

విజయుడు పాము భాషలో 'నన్నెందుకు చుట్టుకున్నావు? నీకు నేను అపకారం కానీ, అన్యాయం కానీ చేయలేదు కదా. నేనొక అత్యవసర కార్యం మీద వెళుతున్నాను. నన్నొదిలిపెట్టు,' అని చెప్పాడు. నెమ్మదిగా దానిని మాటల్లో పెట్టి అవసరమైతే తన ఖడ్గానికి పని చెప్పాలనుకున్నాడు.

కొండచిలువ ఆ మాటలకు చిర్రున తలెత్తి విజయుడి వైపు చూసింది. 'నీకు పాము భాష ఎలా తెలుసు?' అని అడిగింది. ఆ కొండచిలువ తన పట్టుని మాత్రం సడలించలేదు. విజయుడికి ఊపిరి ఆడడం కష్టమనిపించింది. ఎలాగో సందు దొరికితే తన ఖడ్గాన్ని బయటకు తియ్యాలని ఉందతడికి. 'నాకు పాము భాష ఒక్కటే కాదు అన్ని జీవుల భాషలు తెలుసు. నీ ఆకలి తీర్చడానికి ఏదైనా జంతువుని వేటాడి ఇస్తాను. నన్ను విడిచిపెట్టు,' అని

మరొకసారి చెప్పాడు విజయుడు.

కొండచిలువ 'మనుషుల మాటలను నేను నమ్మను. మీరంతా మోసగాళ్ళు. నోటి ముందున్న వేటను వదులుకొని వేరే దానికోసం ఆగడం నా వల్ల కాదు,' అంది. కొండచిలువ మాటల్లో ఉండగా కుడిచేతిని దాని పట్టు నుండి తప్పించి ఒర లోని ఖడ్గాన్ని బయటకు లాగి దాని కడుపులోకి దించి పెద్ద గాయం చేసాడు విజయుడు. అది ఒక్కసారి బాధగా అరిచి విజయుడి మీద తన పట్టు సడలించింది. ఈసారి అతడిని నోటితో మింగేయాలని ఎదురుగా వచ్చింది కొండచిలువ.

విజయుడు దానివైపు కత్తి చూపించి 'నువ్వు మింగావనుకో. నీ కడుపులో దూరిన తర్వాత మొత్తం చీల్చుకొని బయటకు వస్తాను,' అని చెప్పి ఒక్క ఎగురుతో పక్కనున్న చెట్టెక్కి అక్కడినుండి మరో గెంతులో కొండచిలువ తల మీదకు దూకి కత్తిని దాని తలలోకి సూటిగా దించేసాడు. అది నేల మీదపడి బాధతో అరుస్తూ ప్రాణం వదిలింది.

మళ్ళీ గుర్రాన్ని చేరుకొని ప్రయాణం మొదలుపెట్టాడు విజయుడు. ఈసారి అడవి దాటేవరకూ మరింత జాగ్రత్తగా స్వారీ చేసాడు. అడవిలో ఒకటి, రెండు చోట్ల కనిపించిన పండ్లు తిన్నాడు తప్ప వర్తకుడు అందించిన ఆహారం తినడానికి సరైన స్థలం కనిపించలేదు. ఆకలిని అదుపుచేసుకుంటూ గుర్రాన్ని పరిగెత్తించాడు విజయుడు.

చీకటి పడే వేళకు ఒక పల్లె చేరుకున్నాడు విజయుడు. ఆ పల్లెలోకి వెళ్ళేసరికి ఆకలి, దాహం రెండూ ఒకేసారి గుర్తొచ్చాయి. ఆ ఊరు చివర్లో ఉన్న చెట్టుకి గుర్రాన్ని కట్టేసి చుట్టూ చూశాడు. దగ్గర్లో ఒక నేల నుయ్యి కనిపించింది. నేలనుయ్యి నుండి నీరు సేకరించుకుని ధనగుప్తుడు కట్టించి ఇచ్చిన ఆహార పొట్లంలోని భోజనం తినాలనుకున్నాడు.

ఆయన గుర్రం మీద వచ్చి అక్కడ ఆగడం, గుర్రాన్ని చెట్టుకి బంధించి నేల నుయ్యి వైపు వెళ్ళడం చూశారు కొందరు గ్రామస్తులు. వారిలో ఒక ముసలి వ్యక్తి పరుగులాంటి నడకతో విజయుడి వైపు వచ్చాడు. 'ఓ యువకుడా! ఆగు. ఆ నూతి వద్దకు వెళ్ళొద్దు. అది శవాల నుయ్యి. తొందరగా ఇటు రా,' అని అరిచాడు.

విజయుడు ఒక్క క్షణం ఆగి అతనివైపు చూసాడు. 'మీరు ఆగమని చెబుతున్నారెందుకు?' అని ప్రశ్నించాడు.

'మీరున్న చోటు అసలు మంచిది కాదు. మా ఇంటికి వెళదాం రండి. అక్కడ భోజనం తింటూ మాట్లాడుకుందాం,' అని చొరవగా దగ్గరకు వచ్చి తనతో తీసుకెళ్ళాడు ఆ ముసలి వ్యక్తి. గుర్రాన్ని విప్పి మేతకు వదిలిపెట్టి అతడితో కలసి నడిచాడు విజయుడు. తనని పిలిచిన ముసలివ్యక్తి ఇల్లు బాగా విశాలంగా ఉంది.

ముందున్న గదిలో కూర్చుని విజయుడు భోజనం పొట్లం విప్పబోతూ ఉండగా ముసలివ్యక్తి వచ్చి 'మా ఇంట్లో ఎవ్వరూ లేరు. ఒంటరివాడిని. నీకేం వండిపెట్టలేను కానీ నువ్వు పొట్లం విప్పి ఆహారం తీసుకో. ఈ లోగా నీకోసం పండ్లరసం తీసుకొస్తాను,' అని లోపలకు వెళ్ళాడు.

విజయుడు అతడిని వారించబోయాడు. 'నా వద్ద ఆహారం ఉంది కదా! మీరేమీ ఇవ్వవద్దు,' అని చెప్పబోయాడు. పొట్లం విప్పుతూండగా ఇంటి ముందున్న చెట్టుపై ఉన్న రెండు పావురాలు మాట్లాడుతున్న మాటలు విజయుడి చెవిలో పడ్డాయి.

'ఈ యువకుడు మాంత్రికుడికి చిక్కిన మరో అమాయకుడు. ఈ రాకుమారుడితో వెయ్యి మంది పూర్తవుతారు. ఈ రోజుతో మాంత్రికుడి పంట పండింది,' అంది మొదటి పావురం.

రెండో పక్షి 'నీ అంచనా తప్పు అనిపిస్తోంది. యువకుడిని చూస్తుంటే అందరి యువకుల మాదిరిగా మాంత్రికుడికి చిక్కేవాడిలా కనిపించడం లేదు. మాంత్రికుడిని మట్టి కరిపించేవాడిలా ఉన్నాడు,' అంది.

అప్పుడు మొదటి పక్షి 'చిక్కక ఏం చేస్తాడు? ఇప్పటికి ఎంతోమంది మీద తన మాయలు ప్రయోగించాడు. కాసేపట్లో ఈ యువకుడినీ ఏదో ఒక జంతువుగా మార్చేసి, అతడి గుర్రాన్ని కోసుకుని తినేస్తాడు. ఇంతకు ముందు చాలమందికి, వారి జంతువులకూ అదే గతి పట్టింది కదా!' అంది.

ఈసారి రెండో పక్షి అందుకుంది. 'నిజమే! లోపలకి వెళ్ళిన మాంత్రికుడు ద్రవంతో వస్తాడు. అది తాగిన వెంటనే యువకుడు మత్తులోకి జారతాడు. మాంత్రికుడు ముందుగది గోడకి ఉన్న అరలోనుండి మంత్రదండాన్ని తీసి

అతడిని జంతువుగా మార్చేస్తాడు. చూస్తాండు. మరో గంట గడిచేసరికి అంతా జరిగిపోతుంది. ఈ యువకుడికి మాంత్రికుడి విషయం ఎలా తెలపాలో తోచడం లేదు.'

మరో ప్రమాదం తన ఎదురుగా పొంచి ఉందని గ్రహించాడు విజయుడు. ఆహారం తినడం వాయిదా వేసి లోపలకు చూసాడు. ఇంటికి పిలిచిన ముసలి వ్యక్తి కనిపించలేదు. లోపల మరో గదిలో తన చేత తాగించడానికి ద్రవం తయారు చేస్తున్నాడు కాబోలు అనుకొన్నాడు. పావురాలు చెప్పింది గుర్తు చేసుకొని గబగబా ముందు గదిలో ప్రవేశించాడు. ఆ గది గోడకి ఉన్న అరను క్షుణ్ణంగా వెతికాడు. మంత్రదండం కనిపించింది. దానిని తీసి తన అంగీ లోపల దాచుకుని విజయుడు ఏమీ జరగనట్టు కూర్చున్నాడు.

తన భోజనం పొట్లం విప్పి తినసాగాడు విజయుడు. తనకి తాగేందుకు ముసలివ్యక్తి ఇచ్చిన మంచి నీటి కడవను కాలితో తన్ని కింద పడదోసాడు. అందులో ఉన్న నీరంతా నేల మీద ఒలికిపోయింది.

చెట్టు మీదున్న పావురాలు మళ్ళీ మాట్లాడడం వినిపించింది. ఈసారి ఆ పావురాలు తన గురించి మాట్లాడుకోవడంతో మరింత శ్రద్ధగా ఆలకించాడు.

మొదటి పావురం మొదలుపెట్టింది. 'మన మాటలు ఈ మానవుడు వింటున్నాడేమోనని సందేహం కలుగుతోంది. ఇతడికి మన భాష కూడ తెలుసని అనిపిస్తోంది. మనం మాట్లాడుకున్నది వినబట్టే కదా, మంత్రదండం దాచేసాడు ఈ యువకుడు. కానీ ఆ మాంత్రికుడు జిత్తులమారివాడు కదా! తన శక్తియుక్తులు ఉపయోగించడం మానతాడంటావా? మంత్రపఠనంతో ప్రయోగం చేసి ఇతడిని జంతువుగా మార్చేస్తే మరి ఎలా తప్పించుకోగలడు?' అని అడిగింది.

మరో పావురం 'అతడికి మన భాష తెలిస్తే తప్పక తప్పించుకోగలడు. అది మరీ మంచిది. అలా అయితే నువ్వడిగిన ప్రశ్నకు జవాబు చెబుతాను. మాంత్రికుడు స్పష్టంగా మంత్రం చదివితేనే ఆయన వాక్కు ఫలిస్తుంది. ఆయన దంతాలు ఊడిపోతే స్పష్టంగా మంత్రం చదవలేడు. అప్పుడు ఆయన వాక్కుకి శక్తి ఉండదు. మంత్రం ఫలించదు. ఆ విషయం ఈ యువకుడు తెలుసుకుంటే చాలు,' అని చెప్పింది.

విజయుడి భోజనం పూర్తయ్యే సరికి మాంత్రికుడు లోపల నుండి ఒక పాత్ర నిండా ఎర్రటి ద్రవం తెచ్చాడు. దాన్ని విజయుడికి అందించి 'భోజనం పూర్తయిన వెంటనే ద్రవం తాగు నాయనా! ప్రయాణపు అలసట తీరి మంచి నిద్ర పడుతుంది,' అని చెప్పాడు ముదుసలి వేషంలో ఉన్న ఆ మాంత్రికుడు.

విజయుడు ఆ పాత్ర అందుకొని కింద పెట్టి తన ఎంగిలి చేతిని చూపి 'నా కాలు తగిలి నీటికుండ పగిలిపోయి నీరంతా నేల పాలయింది. చేతులు కడుక్కోడానికి, తాగడానికీ మంచి నీరు ఇప్పించండి!' అడిగాడు. మాంత్రికుడు లోపలకు వెళ్ళి నీటితో తిరిగి వచ్చేసరికి ఎర్రని ద్రవాన్ని ఇంటి ముందున్న జువ్విచెట్టు మొదలు భాగంలో పోసాడు విజయుడు. ఖాళీ పాత్రను అక్కడే ఉంచేసాడు. ఏమీ తెలియనట్టు ముసలి వాడికోసం కాచుకున్నాడు.

లోపలి నుండి మాంత్రికుడు వచ్చి మరో పాత్రతో నీరు అందించాడు. ఎర్రటి ద్రవం ఉన్న పాత్ర వైపు చూశాడు. అది ఖాళీగా కనిపించడంతో 'ద్రవం తాగావా నాయనా?' అని అడిగాడు. అతడి గొంతులో ఆనందం తాండవిస్తోంది.

'దాహంగా ఉండడంతో మీరు లోపలకెళ్ళి నీరు తెచ్చేలోపు పండ్ల రసం తాగేసాను,' అన్నాడు విజయుడు.



చెట్టుమీదున్న పావురాలు పలికిన మాటలు అసలు నిజమైనవో కావో, అసలతడు మాంత్రికుడు అవునో కాదో తేల్చుకోవాలనుకున్నాడు విజయుడు. మరోవైపు మాంత్రికుడే అని విజయుడి మనసులో బలంగా అనిపించింది. పావురాలు తనని హెచ్చరించడానికే అలా మాట్లాడాయని నిర్ధారించుకున్నాడు.

విజయుడి పక్కనే మాంత్రికుడు కూర్చొని మాట్లాడబోతూండగా విజయుడు ఆవులింతలు తీస్తూ నిద్ర నటించాడు. 'బాగా నిద్ర ముంచుకొస్తోంది. మత్తు ఆవరించింది. ఇక్కడే విశ్రమించమంటారా?' అని అడిగాడు.

'లోపల గదిలో మంచం ఉంది. అక్కడకెళ్ళి మంచం మీద నిద్రపో యువకుడా,' అని గది చూపించాడు మాంత్రికుడు. విజయుడు లోపలికి వెళ్ళి మంచం మీద పడుకుని నిద్ర నటిస్తూ ఓర కంటితో మాంత్రికుడిని చూశాడు. ఆ వ్యక్తి లోపలి గదిలోకి వెళ్ళి గోడకి ఉన్న అరలో ఒక వస్తువు కోసం వెతుకుతున్నాడు. అతడు మంత్రదండం కోసమే వెతుకుతున్నట్టు విజయుడికి అనిపించింది. తాను దానిని తీసి దాచేయడంతో మంత్రదండం అతడికి కనబడలేదు కాబోలు, అతడిలో గాభరా పెరిగింది. ఆ సంగతి స్పష్టంగా అర్థమైంది విజయుడికి.

అక్కడ మంత్రదండం కనబడక పోవడంతో లోపల గదుల్లోకి కూడ వెళ్ళి వెతికాడు మాంత్రికుడు. అక్కడ కూడ కనిపించక పోవడంతో విసుగొచ్చి విజయుడున్న మంచం దగ్గర నిలబడి రెండు చేతులూ ఎత్తి ఒక చేతిని అతడి తల వైపు, మరో చేతిని కాలి వైపు విశాలంగా చాచి క్షుద్ర మంత్రం పలకడం మొదలుపెట్టాడు.

దాంతో అతడు మాంత్రికుడే అని నిర్ధారణకి వచ్చాడు విజయుడు. ఒక్క ఉదుటున లేచి తన కత్తిని బయటకు తీసి దాని పిడితో మాంత్రికుడి నోటి మీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి మాంత్రికుడి నోటి నుండి ఆరు దంతాలు ఊడి పడ్డాయి.

మాంత్రికుడికి అసలేం జరిగిందో అర్థం కాలేదు. కోపంగా విజయుడి వైపు చూసాడు. మాంత్రికుడి దంతాలు ఊడి, నోటి వెంట రక్తం కారుతూ ఉండటంతో విజయుడి మీద క్షుద్ర మంత్ర ప్రభావం కనిపించ లేదు.

విజయుడు ఈసారి మాంత్రికుడి కంఠానికి కత్తి గురి పెట్టి 'ఏం

చేద్దామనుకున్నావు? దేనికోసం వెతుకుతున్నావు?' అని గద్దించి అడిగాడు.

మాంత్రికుడికి మొదటిసారి భయం ఏమిటో తెలిసొచ్చింది. 'నన్ను చంపకు. నిజం చెబుతాను. నిన్ను జంతువుగా మార్చాలనుకున్నాను. మంత్రాల దీవిలో ఉన్న మాంత్రికలోకానికి నాయకుడిని కావాలనుకున్నాను. అందుకు వెయ్యి మంది యువకులను జంతువులుగా మార్చి చూపించమని షరతు పెట్టారు మాంత్రిక లోకంలోని మా పెద్దలు. వారి ఆజ్ఞ ప్రకారం ఇంతవరకు తొమ్మిది వందల తొంభై తొమ్మిది మందిని జంతువులుగా మార్చాను. నిన్ను కూడ జంతువుగా మార్చేసి ఉంటే నా కల నెరవేరేది. అందుకే మత్తు మందు కలిపిన ఎర్రని ద్రవమిచ్చి నిన్ను కుక్కగా మార్చాలనుకున్నాను. నా మంత్ర దండం కనబడకపోయేసరికి నా క్షుద్ర మంత్ర శక్తితో మంత్రం పఠించ బోయాను. నా సంకల్పానికి నువ్వు అడ్డు వచ్చావు. ఇక ఎప్పటికీ మంత్రగాడిగా పనికి రాకుండా చేశావు. నా కల నాశనం చేసావు,' అని చెప్పాడు. అలా అంటూ నెమ్మదిగా తన బొడ్లోని కత్తిని బయటకు తియ్యాలని ప్రయత్నించాడు మాంత్రికుడు.

మాంత్రికుడికి అవకాశం ఇవ్వకుండా ఆయన చేతిలోని కత్తిని కింద పడేలా ఎగరగొట్టాడు విజయుడు. గబగబా లేచి మాంత్రికుడి చేతులు వెనక్కు విరిచి కట్టేసాడు. 'ఇంతవరకూ నువ్వు జంతువులుగా మార్చిన యువకులెక్కడ?' అని మాంత్రికుడిని అడిగాడు.

ఆ మాంత్రికుడు 'నాతో లోపలికి రా. వాళ్ళందరినీ చూపిస్తాను,' అని చెప్పి మరో రెండు గదుల తర్వాత ఉన్న గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడున్న గదిలో ఒక మూలన నేలపై పరిచి ఉన్న తివాచీని పక్కకి తొలగించాడు. నేల మీద పరిచిన తివాచీని తప్పించగానే అక్కడొక చెక్కబల్ల కనబడింది. చెక్కబల్లను పక్కకు జరపమని చెప్పాడు మాంత్రికుడు. బల్లను తొలగించగానే ఆ స్థానంలో కిందకు దారి చూపిస్తూ మెట్లు ఉన్నాయి. నేల మాళిగకు దారి తీశాయి మెట్లు. వాళ్ళిద్దరూ కిందకు దిగారు.

మాళిగలో విశాలమైన గదులు చాలా ఉన్నాయి. పైనున్న ఇంటితో సంబంధం లేకుండా సొరంగంలా అవి చాల దూరం వరకు వ్యాపించి ఉన్నాయి. ఒక్కో గది నిండా రకరకాల జంతువులు కనిపించాయి. అవి

మంత్ర ప్రభావంతో బంధించడం వల్ల కదల లేకుండా ఉన్న స్థలంలోనే కదలక మెదలక విగ్రహాల మాదిరి కూర్చొని ఉన్నాయి!

మాంత్రికుడు ఆ జంతువులను విజయుడికి చూపించి 'వాళ్ళంతా నా మంత్రబలంతో జంతువులుగా మారినవాళ్ళు. ఎన్నో రాజ్యాల నుండి వచ్చి నాకు చిక్కిన వాళ్ళు. నా కల తీరే సమయంలో నువ్వు వచ్చి నాశనం చేసావు. ఇంతవరకూ ఈ గ్రామస్తులు కూడ నన్ను మాంత్రికుడని గుర్తించలేదు,' అన్నాడు.

'యువకులందరినీ మనుష్యరూపంలోకి మార్చడమెలా?' గద్దించాడు విజయుడు.

'నాకు దంతాలు ఊడిపోయి మంత్రశక్తి పోయింది. అద్భుతశక్తులున్న మంత్రదండం కనిపించడం లేదు. ఇప్పుడు వారి కోసం నేనేమీ చేయలేను. వారు అలా ఉండిపోవలసిందే,' అస్పష్టంగా చెప్పి అవమానంతో తల కిందకు దించుకున్నాడు మాంత్రికుడు.

'మంత్రదండం దొరికితేనో?' రెట్టించాడు విజయుడు.

మాంత్రికుడు 'అప్పుడు చాలా తేలిక. జంతురూపంలోని యువకులవైపు మంత్రదండం చూపించి 'నిజరూపం నీకు ప్రాప్తించు' అని మూడసార్లు తిప్పితే చాలు. అసలు రూపంలోకి మారిపోతారు,' అని చెప్పాడు.

'మంత్రదండం నీ ఒక్కడికే పనిచేస్తుందా? ఎవరు ఉపయోగించినా ఫలితం వస్తుందా?' అని అడిగాడు మళ్ళీ.

'మంత్రదండం, వాటి మహిమ చాలా శక్తివంతమైనవి. అది ఎవరి వద్ద ఉంటే వాళ్ళు గొప్ప శక్తిమంతులవుతారు. వారు చెప్పిందంతా జరుగుతుంది,' జవాబిచ్చాడు మాంత్రికుడు.

మరుక్షణం విజయుడు తన అంగీలో దాచిన మంత్రదండాన్ని బయటకు తీసి జంతువుల వైపు చూపించి 'నిజ రూపం మీకు ప్రాప్తించు' అని మూడుసార్లు తిప్పాడు. అంతే! అక్కడున్న జంతువులన్నీ మనుష్య రూపాలు దాల్చడం మొదలుపెట్టాయి. ఎదురుగా ఎందరో అందమైన యువకులు కనిపించారు. నిద్ర నుండి లేచినట్లు కళ్ళు నులుముతూ చుట్టూ చూసారు.

వారిలో ఎక్కువమంది ఇంచుమించు విజయుడి వయసులో ఉన్న వారే.



వాళ్ళందరూ మాంత్రికుడిని గుర్తుపట్టారు. అతడివల్లనే తమకీ గతి పట్టిందన్న కోపంతో అతడిని చంపడానికి ముందుకొచ్చారు. విజయుడు వాళ్ళందరినీ శాంతపరిచాడు.

అంతమందిని జంతువులుగా మార్చేసిన మాంత్రికుడిని వాళ్ళ కళ్ళ ముందే తన మంత్రదండం ఉపయోగించి ఒక ఎలుకగా మార్చాడు విజయుడు.

విజయుడు ఆ యువకుల వైపు తిరిగి 'మిమ్మల్ని తన స్వార్థం కోసం జంతువులుగా మార్చి బాధ పెట్టిన మాంత్రికుడిని కూడ జంతువుగా మార్చేసాను. ఇకముందు మాంత్రికుడు ఎలుక రూపంలో తిరగాల్సిందే తప్ప మరెవ్వరూ అతడిని మనిషిగా మార్చే అవకాశమే ఉండదు. కాసేపట్లో నేనెలాగూ మంత్రదండాన్ని నాశనం చేస్తాను,' అని చెప్పాడు. యువకులు అతడిని అభినందించారు. తమ రూపాలు తిరిగి లభించినందుకు ఎంతగానో సంతోషించారు.

విజయుడితో సహా యువకులంతా నేల మాళిగ నుండి పైనున్న ఇంటిలోకి వచ్చారు. వారిలో ఎక్కువ మంది యువకులు భువనదేశపు కరువు సమస్యను పరిష్కరించడానికి బయలుదేరిన వాళ్ళే అని తెలుసుకున్నాడు విజయుడు. అయితే దురదృష్టం కొద్దీ ఈ మాంత్రికుడికి దొరికిపోయి జంతువులుగా మారి,

బంధింపబడ్డారు. తల్లిదండ్రులకూ, బంధువులకు వారు దూరమయ్యారు. విజయుడి వల్ల తిరిగి తమతమ అసలు రూపాలు పొందగలిగారు. తమను తమతమ రాజ్యాలకు పంపమని విజయుడిని వారు కోరారు. మంత్రదండం సాయం తీసుకొని వాళ్ళందరినీ వారు చెప్పిన ప్రదేశాలకు పంపాడు విజయుడు. వారికి కావలసిన వాహనాలు సృష్టించి ఇచ్చింది మంత్రదండం. వారికి ప్రయాణ కష్టం తీరింది.

అంత రాత్రివేళ మాంత్రికుడి ఇంట్లోనూ, ఇంటి బయట చాల మంది యువకులు గుమిగూడి ఉండడం పల్లెకు గస్తీ కాస్తున్న కాపలావాడు చూసాడు. గస్తీవాడు ఆశ్చర్యపోయి అక్కడికి వచ్చాడు. విజయుడిని అడిగి వివరాలు తెలుసుకొన్నాడు.

'ఎప్పుడైనా ఎవరైనా కొత్త వాళ్ళు ఊళ్ళోకి వస్తే ఆయన ప్రేమగా తన ఇంట్లోకి తీసుకెళ్ళేవాడు. అతిథులంటే అతడికి అభిమానమని అనుకున్నారు ఈ పల్లె జనమంతా. ఆయన మాంత్రికుడని పోల్చుకోలేక పోయాం,' అన్నాడు గస్తీవాడు.

గస్తీవాడు పరుగు పెడుతూ వెళ్ళి ఊళ్ళో వాళ్ళని నిద్ర లేపి ఈ వార్తను చెప్పాడు. గ్రామస్తులంతా గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చారు. మంత్రదండం ఉపయోగించి పంపేయగా మిగిలిన యువకుల్లో కొందరు అదే గ్రామానికి చెందిన వాళ్ళు కూడ ఉన్నారు. వాళ్ళని సంతోషంగా పలకరించారు ఆ గ్రామస్తులు. కొందరైతే కన్నీరు కార్చారు. యువకుల తలిదండ్రులు కొందరు మరణించారయ్యో!

'మీరు కనబడకపోయేసరికి ఏమైపోయారో అని బెంగపడ్డాం. కానీ ఈ మాంత్రికుడికి చేతిలో పడి జంతువులుగా మారిపోయారా? మనతో చాలా నమ్మకంగా ఉంటూనే ఎంతో దారుణానికి ఒడిగట్టాడు,' అన్నారు గ్రామస్తులు.

వాళ్ళు విజయుడికి కృతజ్ఞతలు చెప్పారు. ఆ గ్రామపెద్ద పూలదండలతో సత్కరించి విజయుడిని ప్రత్యేకంగా అభినందించి, 'మేం చాలా రోజులుగా వర్షాలు పడక నీటికి అల్లాడుతున్నాం. ఆ మంత్రదండం సాయంతో వర్షాలు కురిపించి మా ఊరుకి మేలు చేయగలరా!' అని ప్రాధేయపడ్డాడు.

గ్రామపెద్ద కోరిక వినగానే విజయుడి మనసులో అనుమానం కలిగింది.

మంత్రదండంతో వర్షాలు కురుస్తాయా అనుకున్నాడు. అయితే గ్రామస్తుల తృప్తి కోసం ఒక ప్రయత్నం చేద్దామనుకున్నాడు. ఆకాశం వైపు మంత్రదండం చూపించి 'వెంటనే భారీవర్షం కురవాలి' అన్నాడు. అలా కోరాడు కానీ అతడిలో నమ్మకం కలగడం లేదు. ఆకాశం వైపు చూస్తూ అలాగే కొంత సేపు నిలబడ్డాడు. అప్పుడు జువ్వి చెట్టు మీద ఉన్న పావురాలు అలికిడి చేయడం వినిపించింది.

ఆ పావురాలు తనకి చేసిన సహాయం గుర్తొచ్చింది విజయుడికి. పావురాల వైపు చూసి 'మీరు మాట్లాడింది విని ఒక మాంత్రికుడిని అంతం చేయగలిగాను. మీ సహాయంతో ఎందరో యువకులను రక్షించగలిగాను. మీ మేలు మరవలేను,' అని చెప్పాడు. ఆ పావురాలు సంతోషంగా రెక్కలూపి మరో వైపుకి ఎగురుతూ 'వర్షం వచ్చేస్తోంది. తొందరగా ఏదైనా గూడు చేరాలి,' అనడం వినిపించింది.

మరికొద్దిసేపటికే ఆకాశంలో మేఘాలు చురుగ్గా కదిలాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గ్రామస్తుల సంతోషానికి అంతులేక పోయింది.

మాంత్రికుడి ఇల్లు వర్షానికి కుప్పకూలిపోయింది. ఆ రాత్రికి గ్రామపెద్ద ఇంటిలోనే గడిపాడు విజయుడు. తెల్లారేసరికి వర్షం తగ్గింది. తెల్లవారిన తర్వాత విజయుడు బయలుదేరబోతుంటే గ్రామస్తులు అతడికి ఎదురొచ్చారు. వారు చాలా సంతోషంగా కనిపించారు.

'మీ దయ వల్ల మా ఊరికి మంత్రగాడి నుండి పెద్ద గండం తప్పింది. నీటికొరతతో బాధలు పడుతున్న మా ఊరి ప్రజలకు వర్షం కురిపించి గొప్ప సాయం చేసావు,' అని చెప్పారు గ్రామస్తులు. చివరగా వారిలో నుండి గ్రామపెద్ద విజయుడి ముందుకి వచ్చి 'ఆ మంత్రదండాన్ని మాకు ఇచ్చి పుణ్యం కట్టుకో నాయనా. దాని సాయంతో మా ఊరుని పట్టి పీడిస్తున్న సమస్యలన్నీ దూరం చేసుకుంటాం' అని బతిమలాడాడు.

దానికి విజయుడు అభ్యంతరం చెబుతూ 'మీరు గ్రామపెద్దగా మీ ఊరి సమస్యలను తీర్చాలనుకోవడం మంచిదే. కానీ మంత్రదండాన్ని నమ్ముకుని మీ శక్తియుక్తులను వృథా పరచకూడదు. మీరు మీ శక్తిని నమ్ముకోవాలి. లేకపోతే అక్కడ ఎలుకగా మారిన మాంత్రికుడికి వచ్చినట్టే చెడ్డ ఆలోచనలు

పుడతాయి. ఈ మంత్రదండం చేతిలో పడిందంటే ఎంతటి వారికైనా దుర్బుద్ధి పుడుతుంది. మీకున్న ముఖ్యమైన సమస్యలు చెప్పండి. ఇప్పుడే తీరుస్తాను. ఈ ఒక్కసారికి దీని సాయం తీసుకుందాం. మంత్రదండాన్ని మాత్రం ఇక్కడే మీ కళ్ళ ముందే నాశనం చేస్తాను,' అన్నాడు.

గ్రామంలో వాళ్ళందరూ కలసి మాట్లాడుకున్నారు. కొన్ని ముఖ్యమైన సమస్యలు విజయుడితో చెప్పారు. ముఖ్యమైన వాటిని మంత్రదండం సాయంతో క్షణాల మీద పరిష్కరించాడు విజయుడు. పల్లెవాసులు జేజేలు చెబుతుండగా మంత్రదండాన్ని వారి కళ్ళ ముందే నాశనం చేసేసి ముందుకి దారి తీశాడు విజయుడు.

* * *

మళ్ళీ ప్రయాణం ప్రారంభించిన విజయుడు ఈసారి ఎత్తయిన కొండల మధ్యనున్న సన్నటి దారిలో గుర్రాన్ని పరిగెత్తించాడు. అయితే కొండల మధ్య ప్రయాణం కష్టంగా మారి గుర్రం పరుగు మందగించింది. తన గుర్రం అలిసిపోవడం చూసాడు విజయుడు. కొంతసేపు నెమ్మదిగా దౌడు తీయించాడు.

కొంతదూరం ముందుకు వెళ్ళేసరికి దారి పక్కనే ఒక పెద్ద గుహ కనబడింది. గుర్రానికి విశ్రాంతి ఇవ్వాలనుకున్నాడు విజయుడు. ఆ గుహ దగ్గరికి రాగానే గుర్రం మీదనుండి దిగాడు. గుర్రాన్ని బయటే నిలబెట్టి గుహ లోపలకు వెళ్ళాడు విజయుడు.

తన పరిస్థితి తెలుసుకొని విశ్రాంతి ఇచ్చాడని అనుకుంది గుర్రం. 'నేను ఇక్కడే ఉన్న నీడలో అలసట తీర్చుకుంటాను. గుహ లోపల ఏముందో చూడు,' అంది.

విజయుడికి అది నిజమే అనిపించింది. గుహ లోపల కొంతదూరం వెళ్ళేసరికి బాగా లోపలి వరకు విస్తరించి ఉందని పోల్చుకున్నాడు. ఆసక్తిగా మరింత ముందుకు వెళ్ళాడు.

మరింత దూరం వెళ్ళగానే భరించ రాని దుర్వాసన అతడి ముక్కుకి తెలిసింది. లోపల గుట్టలు గుట్టలుగా మనుషుల కపాలాలు, బొమికెలు కనిపించాయి. నేల మీద రక్తపు మరకలు కనిపించాయి. అవి అక్కడికెలా

వచ్చాయన్న సందేహం విజయుడికి వచ్చింది. గుహలో ప్రవేశించిన వాళ్ళని ఏదైనా జంతువు చంపేసి బొమికెలను వదిలిందేమో అనుకున్నాడు. అది జంతువుల పని అయితే కాలి అడుగుల గుర్తులు ఉండాలి. అక్కడ అలాంటి గుర్తులేవీ కనబడలేదు. మనుషులను చంపి కంకాళాలు వదిలింది ఎవరో తెలుసుకోవాలనుకుంటూ నడుస్తున్నాడు విజయుడు.

అంతలో ఒక పిట్ట అతని తల మీద నుండి భయంకరంగా అరుచుకుంటూ వెళ్ళింది. ఏదో ప్రమాదం పొంచి ఉందని విజయుడికి అనిపించింది. అంతలో ఝూమ్మని శబ్దం చేస్తూ గాలి తన వెనక వైపు నుండి వస్తున్నట్లు అనిపించింది. తల తిప్పి వెనకకి చూసేలోపు అతని వీపు మీద చాల గట్టిగా దెబ్బ పడింది. ఆ దెబ్బకు విజయుడు ముందుకు తూలి పడబోయాడు. కాని దెబ్బను తట్టుకొని నిలబడ్డాడు. అదే మరొకరయితే భూమిని కరుచుకోవలసిందే! ఏమి జరిగిందని గాలి వీచిన వైపు చూశాడు విజయుడు. కానీ గాలి శబ్దమే తప్ప ఎవరూ కనబడలేదు.

మళ్ళీ మరోసారి దగ్గరలో గాలి వీస్తున్న శబ్దం వినబడింది. మరో దెబ్బ గట్టిగా తగిలింది. ఎవరు కొట్టారో, ఎందుకు కొడుతున్నారో తెలియలేదు. దొంగదెబ్బ తీస్తోంది ఎవరో తెలిస్తే ఎదుర్కోవచ్చు. అదృశ్యంగా ఉండి కొడుతున్నారు. ఇప్పుడెలా? అనుకొని ఆలోచిస్తుండగానే ఈసారి ఎదురుగా గాలి తన ముఖం వైపు వచ్చిన శబ్దం అయింది. ఒరలో నుండి ఖడ్గాన్ని తీసి అంచనా చూసి కొట్టాలనుకునే లోపు అతడి ముఖంపై మరో గట్టిదెబ్బ పడింది. విజయుడు వెనక్కు పడ్డాడు. ఆయన కింద పడగానే భుజానికి తగిలించుకున్న సంచి కూడ జారి కిందపడింది. అదే సమయంలో ముని తేజస్వి ఇచ్చిన భరిణె సంచిలో నుండి బయటకు వచ్చి కనిపించింది.

దానిని చూడగానే విజయుడికి దాని ఉపయోగం గుర్తొచ్చింది. ఆ లేపనాన్ని కనురెప్పలకు తాకిస్తే అదృశ్యంగా ఉన్నవి కూడా స్పష్టంగా కళ్ళముందు కనిపిస్తాయని ముని తేజస్వి చెప్పిన విషయం గుర్తొచ్చింది. అందులో ఉన్న లేపనాన్ని కనురెప్పలపై రాసుకొని అదృశ్యంగా ఉండి తనను దెబ్బ తీసి చంపాలనుకున్నదెవరో చూడాలనుకున్నాడు. అక్కడ చూసిన పుర్రెలకు, తనని కొట్టిన వాళ్ళకూ ఏదో సంబంధం ఉంటుందని అనుకున్నాడు.

గభాలున మూత తెరిచి లేపనాన్ని రెప్పలపై పూసుకున్నాడు.

అప్పటికే విజయుడి ముఖం మీద గుద్ది ముందుకి వెళ్ళి మళ్ళీ దిశ మార్చుకొని వస్తున్న అదృశ్యశక్తి ఎవరన్నది లేపన ప్రభావం వల్ల విజయుడు స్పష్టంగా చూసాడు.

అదొక భయంకర రాక్షసి. పెద్దపెద్ద కోరలు, గగుర్పాటు కలిగించే రూపంతో చేతులు ముందుకి చాచి వస్తోంది. దాని చేతులకున్న పొడవాటి గోళ్ళు కత్తుల్లా కనిపించాయి. ఈసారి విజయుడిని గట్టిగా దెబ్బ తీసి చంపాలన్న కోపంతో వస్తోంది ఆ రాక్షసి. అది ఇంతకు ముందు చంపిన వాళ్ళంతా ఒకటో రెండు దెబ్బలకు చచ్చినవాళ్ళే. కింద పడిన తరువాత మళ్ళీ లేచిన వాళ్ళు లేరు. కానీ విజయుడు అలా కాకుండా మళ్ళీ లేచి నిలబడేసరికి దానికి చెప్పలేనంత కోపం వచ్చింది.

విజయుడికి ఆడరాక్షసి రూపం స్పష్టంగా కనిపించడంతో ఒర నుండి కత్తి బయటకు తీసి ఎదురుదాడికి సిద్ధమయ్యాడు. ఈసారి రాక్షసి దగ్గరికి రాగానే కత్తితో దాని చేతుల మీద బలంగా నరికాడు. ఇలా జరుగుతుందని ఊహించలేదు రాక్షసి. అదృశ్యరూపంలోనే ఉన్నాననీ, విజయుడికి కనిపించడం లేదని అనుకుంది రాక్షసి. అయితే విజయుడు గాయపరచగానే పెద్ద కేక పెట్టింది. దాని చేతులు సగం వరకూ తెగిపడ్డాయి.

'నరుడా, ఎవడివిరా నువ్వు? నన్నెలా కొట్టావురా? నీకు నేను కనబడుతున్నానా?' అని అరుస్తూ లేచి నిలబడింది రాక్షసి. చేతుల నుండి రక్తం ధారలు కారుతున్నా లెక్క చేయకుండా ముందర నిలబడ్డ విజయుడి మీద దాడి చేసి నోరు వెడల్పు చేసి అతడిని మింగెయ్యాలని వచ్చింది. ఈ సారి కత్తిని దాని పొట్టలో పొడిచాడు విజయుడు. 'ఆగరా నరుడా. నన్ను చంపితే నీకేమొస్తుంది!' అని పెద్దగా అరిచింది రాక్షసి.

రాక్షసి మెడకి విజయుడు కత్తి గురి పెట్టి 'ఎవరు నువ్వు? ఇక్కడున్న పుర్రెలు నువ్వు చంపిన మనుషులవేనా?' అని అడిగాడు.

అప్పుడు నోరు విప్పింది రాక్షసి. 'చెబుతాను నరుడా! నన్ను మాత్రం చంపకు. నేను, నా భర్త ఇక్కడ చాల రోజులుగా ఉంటున్నాం. ఈ దారిన పోయే మనుషులను చంపి ఆకలి తీర్చుకునేవాళ్ళం. ఒకసారి చాల రోజులపాటు

ఈ దారిలో మనుషులు రాలేదు. అప్పుడు బాగా ఆకలితో ఆహారవేటకు వెళ్ళాడు నా మొగుడు. ఇప్పటివరకూ తిరిగి రాలేదు. నీ లాంటి వీరుడి చేతిలో హతమారి ఉంటాడని భయం కలిగింది. నాకు ముసలితనం వచ్చేసింది. ఇంతకు ముందులా వేగంగా ఎదురుపడి మనుషుల్ని చంపలేక పోతున్నాను. అందుకని నాకున్న మాయారూప శక్తులతో అదృశ్యరూపంలో వెళ్ళి మనుషులను చంపి తింటూ బతుకుతున్నాను. నిన్నూ అలాగే చంపాలనుకున్నాను. కానీ నువ్వు సామాన్యుడివి కాదు. అదృశ్యంగా ఉన్న నన్ను కనిపెట్టి ఎదురుదాడి చేసావు,' అని చెప్పింది.

దానికి విజయుడు 'ఇలా బతికున్న వాళ్ళని చంపి తినే బదులు దేవుడు సృష్టించిన ఎన్నో రకాల ఆహారం ఉంది కదా. తియ్యని పండ్లు, పచ్చని ఆకుకూరలు, రకరకాల కాయగూరలు, త్వరగా కడుపు నిండే కందమూలాలు, దుంపజాతులెన్నో ఉన్నాయి. అవి తిని పొట్ట పోషించుకోవచ్చు కదా. నిన్ను చంపకుండా వదిలేస్తే మళ్ళీ మనుషులను తినాలని ప్రయత్నిస్తావు. కాబట్టి వదిలే ప్రసక్తి లేదు. నిన్ను చంపేస్తాను,' అని చెప్పి కత్తి ఎత్తాడు.

ఆ రాక్షసి విజయుడి వైపు దీనంగా చూసి 'ఆగు నరుడా! నన్ను చంపకు. ఈ రోజు నుండి మనుషులను చంపనని ప్రమాణం చేస్తున్నాను. నన్ను వదిలితే నీకు కొన్ని రాక్షస మాయలూ, శక్తులూ ధారపోసి ఋణం తీర్చుకుంటాను,' అని ప్రాధేయ పడింది రాక్షసి.

రాక్షసి వైపు అనుమానంగా చూసి 'నీ మాటలు నమ్మను. నీ ప్రాణాలు కాపాడుకోవడానికి ఎన్నైనా మాయమాటలు చెబుతావు. మీ రాక్షసజాతి మాట నిలుపుకున్న సందర్భం ఏదీ లేదు!' అన్నాడు విజయుడు.

దానికి ఆ రాక్షసి 'నరుడా! నన్ను నమ్ము. నేను మాట ఇస్తే తప్పను. ఈ రోజు నుండి సాత్వికాహారం మాత్రమే తింటాను. మా గురువు శుకాచార్యుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఈ రోజు నుండి నరమాంస భక్షణ చెయ్యను,' అంది.

విజయుడుకి ఇంకా దాని మాటల మీద నమ్మకం కలగలేదు. 'నువ్వు చంపిన మనుషులను మళ్ళీ బతికించే శక్తి నీకు ఉందా?' అని అడిగాడు. దానికి ఆ రాక్షసి 'ప్రాణం తీయడమే కానీ పోయడం నాకు తెలియదు,' అంది.

అప్పుడు విజయుడు 'ప్రాణం పోసే శక్తి లేనప్పుడు ప్రాణం తీసే హక్కు నీకుండదు. ఇక ముందు బుద్ధిగా శాకాహారం తింటానని మాట ఇచ్చావు కాబట్టి వదిలేస్తాను. నువ్వు ఆడరాక్షసివని, అందులోనా ముసలిదానివని దయతలచి మాత్రమే వదులుతున్నాను,' అని కత్తి దాని మెడ దగ్గర నుండి తీసాడు.

విజయుడు దానిని చంపడం లేదని చెప్పగానే రాక్షసి ఎంతో సంబర పడింది. తనకు ప్రాణబిక్ష పెట్టిన విజయుడికి కృతజ్ఞతలు చెప్పి 'నరుడా! ఈ గాయాల నుండి రక్తం కారుతోంది. కాసేపు నన్ను వదిలితే నేను నా పూర్వపు స్థితికి వస్తాను,' అని చెప్పి ఒక్క క్షణం గుహలోపల ఉన్న గదిలోకి వెళ్ళి మళ్ళీ వచ్చింది. ఈసారి దాని శరీరం మీద గాయాలు కనిపించలేదు.

విజయుడుకి ఆశ్చర్యం కలిగింది. తనవద్ద ఉన్న స్వస్థత తీగతో సరితూగేది ఒకటి రాక్షసిదగ్గర ఉందని గ్రహించాడతాడు. అంతలో రాక్షసి ఆ గుహలో ఓ మూల ఉన్న మట్టికుండని తెచ్చి కిందపడేసింది. కుండ పగిలిపోవడంతో అందులో ఉన్న ఎర్రని ద్రవం నేలమీద జారింది. కుండలోపల నుండి ఒక అపురూపమైన వజ్రం కూడ కింద పడింది. వజ్రాన్ని తీసుకోమని విజయుడికి చెప్పింది.

విజయుడు దానిని తీసి చూస్తుండగా రాక్షసి చెప్పింది, 'చాల ఏళ్ళ క్రితం ఈ దారిలో వెళుతూ నా చేతిలో చనిపోయాడు ఒక రాకుమారుడు. అతడెలా సంపాదించాడో గానీ అతడిది ఆ వజ్రం. ఆ రాకుమారుడు నన్ను ఎదిరించి గట్టిపోటీ ఇచ్చాడు. అప్పుడు నాకు చాలా శక్తిసామర్థ్యాలు ఉండేవి. మా రాక్షస మాయతో రాకుమారుడిని పల్టీ కొట్టించాను. నా బలం ముందు నిలవలేక పోయాడు. ఆయన అంగీలో దాచిన వజ్రాన్ని నాకిచ్చి 'ఎన్నో శ్రమలకోర్చి సంపాదించిన వజ్రం ఇది. దీనిని తీసుకొని నన్ను వదిలెయ్యి. నన్ను మాత్రం చంపవద్దు' అని బతిమలాడాడు. నేను వజ్రం తీసుకుని అతడిని వదలాలనుకున్నాను. కానీ నా మొగుడు నా మాటలు లెక్క చేయకుండా అతడిని చంపి తినేసాడు. వజ్రాన్ని చూసిన నా మొగుడు అది చాల విలువైనది అని చెప్పి జాగ్రత్త చెయ్యమన్నాడు,' అంది రాక్షసి.

ఆ వజ్రం గోధుమ వర్ణంలో వెలగపండు పరిమాణంలో ఉంది. దాని నుండి వింతకాంతులు విరజిమ్ముతున్నాయి. వజ్రం విజయుడి చేతిలోకి రాగానే

గుహ కాంతివంతంగా మారిపోయింది.

రాక్షసి ఇచ్చిన వజ్రం మహా విలువైనదే గాక గొప్ప శక్తివంతమైనది అనుకున్నాడు విజయుడు. కుండలోపల ఎర్రని ద్రవంలో మునిగి ఉన్నప్పుడు సహజత్వాన్ని కోల్పోయి అతి సాధారణంగా ఉన్న వజ్రం తన చేతిలో పడగానే కాంతివంతంగా మారడం వింత అనుభూతి కలిగించింది. దానిని చేతితో పట్టుకోగానే ఒక్కసారిగా ఎంతో శక్తి పెరిగినట్లు అనిపించింది విజయుడికి. విజయుడికి సంతోషం కలిగింది.

'ఈ వజ్రం గురించి ఆ రాకుమారుడు వివరాలు చెప్పాడా?' అడిగాడు విజయుడు. 'ఆయన ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కానీ నా మొగుడు బాగా ఆకలిగా ఉండడం వల్ల మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చంపి తినేసాడు,' అని జవాబు చెప్పింది రాక్షసి.

ఏదో గుర్తు తెచ్చుకోవాలని కొంతసేపు ప్రయత్నించాడు విజయుడు. 'నేను చిన్నవయసులో ఉన్నప్పుడు జరిగిన విషయం గుర్తొచ్చింది. ఒకసారి రాజసభ జరుగుతుండగా ఒక వార్తాహరుడు వచ్చి ఒక ప్రకటన పత్రం తెచ్చాడు. దానిని చదివిన మా తండ్రిగారు ఈ వజ్రం విషయం మాకు చెప్పారు. ఆ పత్రంలోని సారాంశమేమిటంటే మణిదేశ రాజు మాణిక్యుడు తన కుమార్తె మణిమేఖలకు వివాహం చేసుకోవాలన్న ఆసక్తి ఉన్న రాకుమారులు వెలగపండు పరిమాణంలో గోధుమ వర్ణంలో ఉన్న వజ్రాన్ని సంపాదించి ఇవ్వాలని ప్రకటించారు. అప్పట్లో ఎందరో రాకుమారులు ఈ వజ్రం సంపాదించడానికి పోటీలు పడ్డారని కథలుగా చెప్పుకున్నారు. అయితే వజ్రం కథ మాత్రం పూర్తిగా తెలియదు. మరి దీనిని ఎలా సంపాదించాడో, నీ పాలిట చిక్కింది ఏ దేశపు రాకుమారుడో కదా!' అని విచారించాడు.

విజయుడి ముఖంలో విచారం చూడగానే రాక్షసి స్పందించింది. మళ్ళీ తనపై కోపం తెచ్చుకొని కత్తి ఎత్తుతాడేమో అనుకుంది. 'నువ్వు వీరుడివైన రాకుమారుడివని నీ సాహసం చూసినప్పుడే గ్రహించాను నరుడా! ఎప్పుడో జరిగినదానికి ఇప్పుడు విచారించి ప్రయోజనం లేదు. కాబట్టి బాధపడకు నరుడా! నాకున్న శక్తివల్ల ఒక విద్యను నీకు ధారపోస్తున్నాను. దాని మహిమ వల్ల భూగర్భంలో దాగి ఉన్న నిధినిక్షేపాల సంగతులు నీకు తెలుస్తాయి.

భూగర్భంలో నిధులున్న స్థలం దగ్గర నువ్వుంటే వాటి శబ్దాలు నీ చెవులకు స్పష్టంగా వినిపిస్తాయి. అదే నీకు సంకేతం,' అని వివరించి ఆ శక్తికి సంబంధించిన మంత్రాన్ని చెప్పింది.

విజయుడు సంతోషపడ్డాడు. విజయుడి ఉత్సాహం చూసిన రాక్షసి 'నరుడా నీ తదుపరి ప్రయాణం ఏ దేశానికో చెపుతావా?' అని అడిగింది.

'మునిశాపం వల్ల భువనదేశంలో వచ్చిన కరువుదెబ్బకి ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని విన్నాను. వాళ్ళకి సాయం చెయ్యడానికి వెళుతున్నాను,' అన్నాడు.

అప్పుడా రాక్షసి 'నువ్వు మనుషుల్లో మంచివాడిలా ఉన్నావు. నీకు మా జాతి వల్ల ఆపద వస్తే మాత్రం వారికి నాపేరు కిరాతకి అని చెప్పురా. నిన్ను వదిలేసి దండం పెడతారు,' అంది మురిపెంగా చూస్తూ.

విజయుడు ఆశ్చర్యంగా దానివైపు చూసి 'నీవంత గొప్పదానివా?' అని అడిగాడు.

దానికి రాక్షసి 'అవును నరుడా! నేనంటే నరులకే కాదు మా రాక్షసులకు కూడ భయమే. అందుకే 'నేను కిరాతకిని జయించినవాడిని' అని చెప్పావంటే చాలు మా వాళ్ళు నీకు దాసోహం అయిపోతారు. తిరిగి నీకు సాయం చేస్తారు. నాకు తెలిసినన్ని రాక్షసవిద్యలు మాలో మరెవ్వరికీ రావని అంటారు. ఇప్పుడు వయసు పెరిగిపోయింది. జవసత్వాలు తగ్గాయి. అందుకే నీకు దొరికాను,' అంది.

రాక్షసి కిరాతకి వల్ల దెబ్బలు తగిలితే తగిలాయి కాని ఉపయోగం కూడా కలిగింది అనుకున్నాడు విజయుడు. అక్కడ నుండి బయలుదేరి మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టాడు.

* * *

మరో మూడు రోజులపాటు అనేక పల్లెలు, కొండలు, నదులు, లోయలు దాటి భువనదేశపు రాజధాని చేరుకున్నాడు విజయుడు. దారిపొడుగునా భయంకర కరువుకి సాక్ష్యంలా ఎడారిగా మారిన పొలాలు నిలబడ్డాయి. బతికున్న మనుషుల కంటే శవాలే ఎక్కువ కనిపించాయి. గుండెలు పిండేసాయి అతడికి.



యువరాజు ధర్మతేజుడిని కలవడానికి వెళ్ళాడు విజయుడు. కరువు సమస్య పరిష్కారం కోసం రాజుగారి కోటలో ఏర్పాటు చేసిన గంటను మోగించాడు విజయుడు. ఒక భటుడు వచ్చి విజయుడు వచ్చిన పని ఏమిటని అడిగి తెలుసుకున్నాడు. లోపలకు వెళ్ళి కొద్దిసేపటికే తిరిగి వచ్చి విజయుడిని అంతరంగిక మందిరంలోకి తీసుకొని వెళ్ళాడు భటుడు.

యువరాజు ధర్మతేజుడు మంత్రులతో, ముఖ్యులతో అనేక సమస్యల మీద చర్చిస్తున్నాడు. మంచి నీటి సమస్య లగాయితు చింతపండు వరకూ రాజ్యంలో అన్నీ లోటే.

విజయుడిని ఆహ్వానించి ఉచితాసనం మీద కూర్చుండబెట్టి 'మీరు ఏ దేశం నుండి వచ్చారు రాకుమారా? మా భువనదేశానికి మీరెలా సాయం అందిస్తారు?' అని ప్రశ్నించాడు.

విజయుడు తన గురించి చెప్పి 'మీ దేశపు కరువు సమస్య ప్రకృతి ప్రకోపం వల్ల వచ్చింది కాదని తెలుసుకున్నాను. అతీతశక్తుల సాయం లేనిదే దీని నివారణ కుదరదు. మీ దేశంలోని ప్రజలకు పంపడానికి నిల్వ ఉంచిన

ఆహారాలు, నీరు ఇంకా ఎన్ని రోజుల వరకు సరిపోతాయి?' అని అడిగాడు.

ధర్మతేజుడిలోనూ, ఆయన అనుచరుల్లోనూ విజయుడి పట్ల గౌరవంతో పాటు గొప్ప నమ్మకం కలిగింది. ఇతడు తప్పక తమ సమస్యకు పరిష్కారం చూపిస్తాడని వారికి ధైర్యం వచ్చింది.

'రాకుమారా! మీరు చెప్పినట్టు మా దేశపు సమస్య మామూలుది కాదు. మహాతపఃశక్తి సంపన్నుడు శ్వేతకేతుడి శాపం వల్ల వచ్చింది. కాబట్టి అంత తేలికగా పోదు. అయినప్పటికీ ఎందరో యువకులు, రాకుమారులు మా చాటింపుకి స్పందించి ఎన్నో విధాల ప్రయత్నాలు చేసారు. అయినా పరిష్కారం దొరకలేదు. అసలు శాపమిచ్చిన శ్వేతకేతుడి జాడ తెలిస్తే మేమంతా వెళ్ళి కాళ్ళమీద పడి శాపవిమోచన కోరేవాళ్ళం. ఆ మునీశ్వరుడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకుంటే తప్ప ఏమీ సాధించలేం. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు తొలగించేందుకు సాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఎందరో ప్రజలు రాజ్యం వదిలి పొరుగు రాజ్యాలకు వలస వెళ్ళిపోయారు. కరువు తగ్గిన తరువాతే తిరిగి వస్తారు. మరికొద్ది రోజుల వరకు మాత్రమే మా ఆహార నిల్వలు సరిపోతాయి. తరువాత మాకు దేవుడే దిక్కు' అని చెప్పాడు.

దానికి విజయుడు 'రాజా! మీరు ధైర్యంగా ఉండండి. నేను ఎలాగైనా శ్వేతకేతుడి జాడ తెలుసుకుంటాను. ఆయనను కలిసి పరిష్కార మార్గం దొరికే వరకూ అయినా మీ దేశప్రజలకు కష్టాలు తొలగేలా చూడాలి. మీ రాజ్యానికి నలుదిక్కులలో ఉన్న రాజ్యాలలో సుభిక్షంగా ఉన్న రాజ్యమేదో చెప్పగలిగితే ఆ రాజుగారిని కలుస్తాను. మీ సమస్యకు పరిష్కారం దొరికేవరకూ నేను సాయం కోరతాను,' అని చెప్పాడు.

మంత్రి మధుకరుడు ముందుకు వచ్చి, 'రాకుమారా! ఇంతవరకు చుట్టుపక్కల ఉన్న రాజులందరూ సాయమందించారు. ఇక వారి వల్ల కూడ సహాయం అందదని చెబుతున్నారు. మీరు వాళ్ళను కలిసినా ప్రయోజనం ఆశించలేం!' అన్నాడు.

'మంత్రిగారూ! మీరు వివరాలు చెప్పండి చాలు. వాళ్ళని కలిసి మీ రాజ్యానికి సాయం కోసం ఒప్పిస్తాను. వారికి నేను సాయపడతాను. వాళ్ళ

రాజ్యంలోని నిధినిక్షేపాలు వాళ్ళకి దొరికేలా చేస్తాను. నా వల్ల వారికి లాభం కలుగుతుంది కాబట్టి నేను చెప్పినట్టు మీకు సాయపడతారు,' అన్నాడు విజయుడు.

అక్కడున్నవాళ్ళందరూ విజయుడి వైపు ఆశ్చర్యంగా చూసారు. 'ఆ నిధినిక్షేపాలు మన రాజ్యంలో ఉన్నాయేమో తెలుసుకోవచ్చు కదా. మనమే వాటిని బయటకు తీయించి వాటితో పొరుగు రాజ్యాలనుండి ఆహార పదార్ధాలు కొని మన ప్రజలకు ఇవ్వొచ్చు,' అని సూచించారు.

విజయుడికి ఆ సలహా నచ్చింది. 'మీ పూర్వీకులెవరైనా భూగర్భంలో నిధులు దాచినట్టు మీరెవరైనా విని ఉంటే అలాగే చేద్దాం,' అన్నాడు.

మంత్రి మధుకరుడు తమ వాళ్ళని వారించాడు. విజయుడితో 'రాకుమారా! ఇప్పుడున్న పరిస్థితులలో నిధులు తవ్వకం జరపడమంటే చిన్న విషయం కాదు, ఖర్చుతో ముడిపడిఉంది. అలాంటి పనులు ఇప్పటికి వాయిదా వేసి మీరు చెప్పినట్టు చేద్దాం. పొరుగు రాజ్యాలలో సంపన్న రాజ్యం సహాయం కోసం ప్రయత్నించండి,' అన్నాడు. విజయుడు ఏకాంతంగా ఉన్నప్పుడు అతనే ఇలా చెప్పసాగాడు.

* * *

భువనదేశానికి ఉత్తర దిక్కులో యాభై యోజనాలు దూరం తర్వాత ప్రారంభమవుతుంది మందారపురం. అది సుభిక్షమైన రాజ్యం. దానికి రాజు మంగళుడు. ఆయన మంచివాడే కాక ధర్మాత్ముడు. మంగళుడు పరిపాలనా దక్షుడు కూడా!

ఒకసారి ఆయన వేటకి వెళ్ళి కొన్ని జంతువులను వేటాడి గుడారంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. కొందరు ముని శిష్యులు ఆ దారిలో వెళ్ళడం ఆయన చూశాడు. ఆ రాజు గారికి మునీశ్వరులంటే మహా ఇష్టం. మునిశిష్యులను కలుసుకుని తన గుడారానికి తీసుకువెళ్ళాడు. వారికి పండ్లుఫలహారాలు ఇచ్చి సపర్యలు చేసాడు. వారిని 'మునులారా! మీరెవరు? ఈ అరణ్యంలో ఉన్నారెందుకు?' అని అడిగాడు మంగళుడు.

'రాజా నీ ఆతిథ్యానికి ధన్యవాదాలు. మేం మహా తపఃశక్తి సంపన్నుడు

శ్వేతకేతుడి శిష్యులం. మా గురువు గారి ఆదేశానుసారం మేం ఆతిథ్యం కోసం భువనదేశపు రాజు పులస్త్యుడిని కలిసాం. ఆయన మునులను దూషించాడు. మా గురువు గారినీ వదిలి పెట్టలేదు. మా గురువుగారికి కోపం వచ్చి ఇక ముందు ఏ రాజునీ ఆతిథ్యం అడగకూడదని నిర్ణయించుకున్నారు. ఈ అరణ్యంలోకి వచ్చి విశాలమైన మర్రి చెట్టుకింద కూర్చున్నారు. ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఆ మర్రి చెట్టు ఉంది. మేం ఆహారం కోసం వెతుక్కుంటూ వచ్చాం,' అని చెప్పారు.

రాజు మంగళుడు ఆ మాటలు విని ఎంతో సంతోషించాడు. 'ముని శ్వేతకేతుడి గురించి విన్నాను. ఆయనని కలుసుకోవాలని ఎన్నాళ్ళ నుండో కోరిక ఉంది. ఆయన దర్శనభాగ్యం కలిగించండి,' అని చెప్పాడు. ముని శిష్యులు అతికష్టం మీద సరేనన్నారు.

రాజు మంగళుడు తన భటులకు చెప్పి మంచి ఫలాలు, పుష్పాలు, తాగునీరుతో సహా వెళ్ళి శ్వేతకేతుడిని కలుసుకున్నాడు. ఎంతో వినయంగా ఆయనకు సేవలు అందించాడు. ఆయన పాదసేవ చేసుకున్నాడు. ఆయన



అనుమతితో తన రాజభవనానికి తీసుకెళ్ళాడు. మహారాణి ముక్తాలత, కుమార్తె మోహనాంగిలతో కూడ స్వయంగా ఆయనకు సేవ చేయించాడు. ఆయన కుటుంబం ముని ఆశీస్సులు పొందింది. వారి వినయ సౌశీల్యతకు మెచ్చిన ముని శ్వేతకేతుడు వారిని అనేక విధాల దీవించి వెళ్ళాడు. అది మొదలు మందారపురం రాజ్యం సుభిక్షంగా మారింది. పాడిపంటలకు పెట్టింది పేరుగా నిలిచింది. ఆ రాజ్యంలో సమయానికి వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి.

మంగళుడుకి భువనదేశపు కరువు సమస్య తెలిసి ఎంతో బాధపడ్డాడు. పొరుగు రాజ్య సమస్యను సానుభూతితో అర్థం చేసుకుని అనేక బండ్లనిండా తిండిగింజలు, పప్పుధాన్యాలు పంపించాడు.

మంగళగిరి రాజ్యపు విశేషాలు చెప్పిన మంత్రి మధుకరుడు 'ఎన్నో విధాల మాకు సాయమందించారు. ఇంకా వారిని సాయం కోరడమంటే అత్యాశ అవుతుందని ఆలోచిస్తున్నాం,' అన్నాడు.

మంత్రి మధుకరుడు చెప్పింది విన్న విజయుడు 'మీరేమీ బాధపడవద్దు. వారి నుండి మీకు సహాయం అందే ఏర్పాటు నేను చేస్తాను,' అని భరోసా ఇచ్చి మరిన్ని విషయాలు వారితో చర్చించాడు.

ఆ రోజుకి విజయుడిని అక్కడే విశ్రాంతి తీసుకోమని కోరాడు ధర్మతేజుడు. విజయుడు సంతోషంగా ఒప్పుకున్నాడు. వాళ్ళిద్దరూ ఒకే వయసు వాళ్ళు కావడంతో ఆ రాత్రంతా కబుర్లే కబుర్లు!

* * *

విజయుడు తన గదికి వచ్చిన తర్వాత కూడ ఆలోచించాడు. మందారపురం రాజుని ఒప్పించి సాయం పంపడానికి చాల రోజులు పడుతుంది. ఈలోగా ఈ రాజ్యప్రజలకు ఆకలిదప్పులను తప్పించే పరిస్థితిని ఎలా చక్కదిద్దాలా అనుకున్నాడు. అంతలో వ్యాపారి ధనగుప్తుడు తనకిచ్చిన అత్తరు సీసా గుర్తొచ్చింది.

అత్తరుసీసాలోని సుగంధద్రవ్యం జల్లగానే అందులో నుండి కోరుకున్న వారిని కళ్ళెదురుగా చూడగలమని చెప్పాడు. దానిని పరీక్షించినట్టు ఉంటుంది,



తన తల్లిదండ్రులెలా ఉన్నారో చూసినట్లూ అవుతుంది అనుకున్నాడు విజయుడు. తనవాళ్ళని వదిలి ఇప్పటికే ఏడాది దాటిపోయింది. అసలే తన తల్లికి తన మీద విపరీతమైన ప్రేమ. తనమీద బెంగ పెట్టుకుందేమో అనుకున్నాడు. వారిని ఒకసారి చూసి మాట్లాడితే సరి. వాళ్ళని కలవడానికి ఇంకెన్ని మాసాలు పడుతుందో అనుకున్నాడు.

అత్తరుసీసా బయటకు తీసి తన తల్లిదండ్రులను మనసులో తలచుకొని అత్తరు జల్లాడు. అత్తరువాసన గది మొత్తం వ్యాపించగానే గాలిలో విజయుడి తల్లిదండ్రులు మహారాజు విక్రమదేవుడు, మహారాణి వకుళాదేవి కనిపించారు. వాళ్ళిద్దరూ కొడుకుని చూసి చాల సంతోషించారు. విజయుడు కూడ వారిని తనివితీరా చూసుకున్నాడు.

తమ రాజ్యంలోని పరిస్థితులు బాగానే ఉన్నాయనీ, విజయుడు తిరిగి రావడం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పాడు తండ్రి విక్రమదేవుడు. విజయుడు పంపించిన ఫిర్యాదుల ప్రకారం ఇద్దరు సేవకులపైనా విచారణ జరిపి శిక్షించానని చెప్పాడు. విజయుడు ప్రస్తుతం తాను భువనదేశంలో

ఉన్నానని చెప్పి ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యను చెప్పాడు.

దానికి విక్రమదేవుడు తమ రాజ్యం నుండి ఎటువంటి సాయమైనా చేస్తానని చెప్పాడు. అవసరమైతే మళ్ళీ చెబుతానని చెప్పాడు విజయుడు.

తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత విజయుడికి ఒక విషయం గుర్తు వచ్చింది. తన కలలో కామధేనువు కనిపించి అవసరమైనప్పుడు ప్రత్యక్షం అవుతానని వరం ఇచ్చింది. కామధేనువు తనకి కనిపించి కరుణిస్తే ఇక్కడ పని తేలిక అవుతుందని ఆశపడ్డాడు విజయుడు.

మరోసారి అత్తరుసీసా తెరిచి కామధేనువుని మనసులో తలచుకొని గాలిలో జల్లాడు. సువాసన ఆ గదిలో వ్యాపించడం ప్రారంభమైన కొద్దిక్షణాలకే ఎదురుగా గాలిలో కామధేనువు రూపం ప్రత్యక్షమైంది.

విజయుడుకి తాను చూస్తోంది కలా, నిజమా అనిపించింది. రెండు చేతులెత్తి భక్తిగా కామధేనువుకి నమస్కరించి నిలబడ్డాడు. కామధేనువు విజయుడిని ఉద్దేశించి 'నాయనా రాకుమారా! నీకు ఇచ్చిన మాట ప్రకారం స్మరించగానే ప్రత్యక్షమయ్యాను. నీకు ఏం సాయం కావాలో చెప్పు,' అంది.

విజయుడు సాష్టాంగనమస్కారం చేసాడు. తరువాత 'అమ్మా! పిలవగానే ప్రత్యక్షమయినందుకు ముందుగా ధన్యవాదాలు. భువనదేశం కరువుతో అల్లాడి పోతోంది. చనిపోయిన వారు పోగా మిగిలిన ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. వాళ్ళని ఈ ఆపద నుండి గట్టెక్కించాలని నా కోరిక. నీ సహాయం కోరి పిలిచాను. ఈ రాజ్యప్రజలను రక్షించు తల్లీ!' అని ప్రార్థించాడు.

'రాకుమారా! ఈ రాజ్యానికి పట్టిన గతికి కారణం నీకు తెలిసిందే. ముని శాపానికి తిరుగులేదు. ఆయననుండే శాపవిమోచన తెలుసుకుని తీరవలసిందే. నీ మంచి బుద్ధికి మెచ్చి సహాయ పడదలిచాను. కొన్నాళ్ళపాటు ప్రజల ఆకలి బాధ తీరడం కోసం ఇదిగో... అక్షయపాత్ర ప్రసాదిస్తున్నాను. దీనిని పూజగదిలో ఉంచి భక్తిగా పూజ చేసిన తర్వాత ఇందులోనుండి బియ్యపు గింజలు పుడతాయి. వాటిని ప్రజలకు పంచమని చెప్పు. ఒక్క గింజ తింటే చాలు ఆరునెలల వరకు ఆకలి, దాహం కలగవు. ఈ లోగా నువ్వు శాపవిమోచన తెలుసుకొని ప్రజలకు సాయపడు' అని అక్షయపాత్రను ఇచ్చి అదృశ్యమయింది కామధేనువు.

విజయుడు తన చేతిలో ఉన్న అక్షయపాత్రను చూసి ఎంతో ఆనంద పడ్డాడు. కామధేనువుని పరిపరివిధాల స్తుతించాడు.

తరువాత యువరాజు ధర్మతేజుడిని కలిసి అక్షయపాత్రను అందించాడు. దాని సాయంతో ఆరునెలల వరకూ ప్రజలకు ఇబ్బంది లేదని చెప్పాడు. అక్షయపాత్రలో నుండి పుట్టే బియ్యపుగింజలు దేశం నలుమూలలకు పంపమని చెప్పాడు.

విజయుడు మరొకసారి యువరాజుతో 'ఆరునెలల వరకూ మీ ప్రజలకు ఆకలి సమస్య తీరింది. అప్పటిలోగా శాపవిమోచన మార్గం దొరికితే మంచిదే! శాశ్వత పరిష్కారం దొరకకపోతే పొరుగు రాజ్యంలోని నదులను భువన దేశంలోకి మళ్ళించాలి. అందుకు మీకు చాల ధనం కావాలి. నేను మందారపురం రాజుని కలుస్తాను. రేపే నా ప్రయాణం,' అన్నాడు.

మంత్రి మధుకరుడు కూడ అక్కడకి చేరుకున్నాడు. విజయుడి మాటలు విన్నాడు. 'రాకుమారా! మా ప్రకటన ప్రకారం మీరు పరిష్కారం కనుగొంటే మా రాజ్యంలో సగభాగమూ, యువరాణినీ ఇచ్చి గొప్పగా వివాహం జరిపిస్తాం,' అని చెప్పాడు.

విజయుడు 'మంత్రిగారూ! నా ఆలోచన ఎంతసేపు మీ రాజ్యానికి మేలు కలిగించాలని మాత్రమే! ప్రజల ఇబ్బందులు తొలగించాలి. వాటి తర్వాతే మీరు చెప్పిన విషయం ఆలోచిద్దాం!' అన్నాడు.

* * *

విజయుడు బయలుదేరి అప్పటికే మూడు రోజులయింది. మందారపురం వెళ్ళే దారిలో అతడు ఉన్నాడు. ఒక దట్టమైన అడవిలో గుర్రం వాయువేగంతో పరుగెత్తుతోంది. రాత్రి అయింది. గుర్రాన్ని ఆపి విశ్రాంతి తీసుకుందా మనుకున్నాడు విజయుడు. ఒక విశాలమైన మర్రి చెట్టు కనిపిస్తే అక్కడికి వెళ్లి చుట్టూ పరిశీలించాడు. చెట్టు కింద చదునుగా ఉంది. అప్పుడప్పుడు చెట్టు కింద మనుషులు సంచరిస్తారని గ్రహించాడతడు. ఆ ప్రదేశం విశ్రాంతి తీసుకోడానికి అనువైనదిగా భావించాడు. ఆహారం తిన్నాడు. నడుము వాల్చాడు.



అవి వెన్నెలరాత్రులు. పండు వెన్నెల విరగ కాస్తోంది. పండువెన్నెల్లో హాయిగా ఆదమరిచి నిద్రపోతున్నాడు విజయుడు.

వెన్నెల విహారానికి ఒక గంధర్వకన్య బయలుదేరింది. ఆమె పేరు చంపకగంధి. ఆకాశంలో ఒంటరిగా విహరిస్తోంది చంపకగంధి. మర్రిచెట్టు కింద గుర్రం కనిపించింది ఆమెకు. దాని పక్కనే నిద్రపోతూ ఒక నిండైన యువకుడూ కనిపించాడు. అతడి అందమైన రూపం చూసి మైమరచిపోయింది ఆమె.

చంపకగంధి ఒక గంధర్వ రాజు కూతురు. ఆమెకు తన స్నేహితురాళ్ళతో పాటు పౌర్ణమి రాత్రులలో భూలోక విహారానికి రావడం అలవాటు. అక్కడున్న ఒక కొలనులో దిగి జలకాలాడి తిరిగి తమ లోకానికి వెళ్తుంటారు వాళ్ళు. ఈ రోజు ఆమె విజయుడిని చూసింది. తన మనసులో కలిగిన భావాలను చిత్రలేఖతో పంచుకుంది.

'మనం గంధర్వులం. అతడు మానవుడు. రాకుమారుడిలా కనిపిస్తూ ఉన్నాడు. అతడిని మోహించడం తగదు. పెళ్లి జరగదు సరికదా, మీ తండ్రిగారికి తెలిస్తే ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే!' అని సలహా ఇచ్చింది.

అయినప్పటికీ చంపకగంధి తన పట్టు విడవలేదు. విజయుడికి పక్కనే

చేరి అతడి మొహాన్ని దగ్గర నుండి చూసి మరింత ప్రేమ పెంచుకుంది. అక్కడ నుండి కదలలేనంది. ఆ రాకుమారుడిని వదిలి రావాలని లేదని చెప్పింది చంపకగంధి.

ఆమె స్నేహితురాలు ఎన్నో విధాల నచ్చ చెప్పినా వినలేదు చంపకగంధి. తాను గంధర్వ లోకం చేరడమంటూ జరిగితే ఆ యువకుడితోనే అని మొండి పట్టు పట్టుకు కూర్చుంది.

ఇంతలో ఆమెను ఇతర గంధర్వకన్యలు కలిసారు. 'అతడిని నువ్వు మోహిస్తే సరిపోదు. అతడు కూడ నిన్ను మోహించాలి. అతడు తెల్లారితే గానీ లేవడు. అతడి అభిప్రాయం తెలుసుకోవాలి కదా! మనం వేకువ ఝాములోపు మన లోకం చేరకపోతే చాల ప్రమాదం. త్వరగా బయలుదేరు,' అంది చిత్రలేఖ.

ఇతర స్నేహితురాళ్ళయితే 'నువ్వు వచ్చినా రాకున్నా సరే మేం మాత్రం వెళ్ళిపోతాం. భూలోకంలోనే ఉండిపోవాలనుకుంటే నీ ఇష్టం. తెల్లారిపోయి మానవుల కంట పడితే మాత్రం నీ శక్తులు నాశనమై ఇక్కడే ఉండిపోవలసి ఉంది. జాగ్రత్త!' అని చెప్పి ఆకాశమార్గంలోకి ఎగిరి పోయారు. ఏమి చేయాలో తోచని చంపకగంధి ఒక నిర్ణయానికి వచ్చింది.

విజయుడిని తన దివ్య శక్తులతో ఒక చెవులపిల్లిగా మార్చింది. తనతోపాటు తీసుకుపోయింది. గంధర్వలోకం చేరిన తర్వాత తన గదిలో రహస్యంగా దాన్ని ఒక బోనులో బంధించి దాచింది. ఆమెకు చూడాలని అనుకున్నప్పుడల్లా చెవులపిల్లిని మనిషిగా మార్చి చూసుకునేది. తన ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసి ఒకసారి మనిషి రూపంలోకి విజయుడిని మార్చింది చంపకగంధి.

చంపకగంధిని చూసి ఆశ్చర్యపోయాడు విజయుడు. ఆమె అందానికి మరింత ఆశ్చర్యపోయాడు. 'నువ్వెవరు? నేనెక్కడున్నాను. ఇక్కడకి ఎలా వచ్చాను?' అని అడిగాడు విజయుడు.

అతనిని మోహించి తీసుకొచ్చిన విషయం చెప్పి తనతోపాటు ఉండి పోవలసిందిగా కోరింది చంపకగంధి.

విజయుడు 'నేను ఒక ప్రజా ప్రయోజన కార్యక్రమానికి బయలుదేరాను.

నా ఆశయం నెరవేరేవరకూ బ్రహ్మచారి జీవితం గడపదలచాను,' అని చెప్పి తనని బంధవిముక్తుడిని చెయ్యమని కోరాడు.

చంపకగంధి 'నా కోరిక తీర్చేవరకూ నిన్ను వదలను,' అంటూ విజయుడిని మళ్ళీ చెవులపిల్లిగా మార్చేసింది. అలా చాలా రోజులు గడిచిపోయాయి. ఈలోగా ఎన్నోసార్లు విజయుడిని మనిషిగా మార్చి తన కోరిక తీర్చమని బతిమాలి అడిగింది చంపకగంధి. తన కోరిక తీర్చకపోతే చెవులపిల్లిగానే శాశ్వతంగా ఉంచేస్తానని కూడా బెదిరించింది. అయినా విజయుడి నిర్ణయంలో ఎలాంటి మార్పూ రాలేదు.

చంపకగంధి చేతిలో విజయుడు బందీ అయిపోయి నాలుగు నెలలు గడిచిపోయాయి.

మరొకసారి చంపకగంధి తనను మానవరూపంలోకి మార్చి అడిగినప్పుడు విజయుడు తెలివిగా ప్రవర్తించాడు. 'ఓ గంధర్వకన్యా! నువ్వు చేసిన ఈ పని వల్ల నేను వెళ్ళి చెయ్యాల్సిన ప్రజా ప్రయోజన కార్యక్రమం ఆలస్యమయింది. నేను నా పని పూర్తి చేసి వచ్చి నిన్ను కలుసుకుంటాను. నన్ను నమ్ము. ప్రస్తుతానికి విడుదల చెయ్యి,' అని అనేక విధాల నచ్చచెప్పాడు.

అప్పటికే గంధర్వరాజుకి తన కుమార్తె మీద అనుమానం వచ్చింది. చెవులపిల్లి విషయం తరచి తరచి ప్రశ్నించాడు. తన స్నేహితురాలు ద్వారా ఆమె తల్లిదండ్రులకి తెలిసిందనీ అనుమానించింది చంపకగంధి. ఎక్కువ కాలం అతడిని చెవులపిల్లి రూపంలో దాచడం కష్టం అని కూడా గ్రహించింది ఆమె.

అందువల్ల విజయుడి మాటలు విని దారిలోకి వచ్చింది. 'భూలోకానికి ప్రతి పౌర్ణమికీ వస్తాను. ఇంకా పదిహేను రోజుల్లో రానున్న పౌర్ణమి నాడు భూలోకానికి నిన్ను చేరుస్తాను. నువ్వు నాకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి. నువ్వు లేకుండా నేను బతకలేను!' అంది.

మాట ఇచ్చినట్టుగానే విజయుడిని మళ్ళీ మనిషిగా మార్చేసి ఆమె విడిచిపెట్టింది. ఆమె వెళ్ళిపోయే ముందు ఒక మందార పుష్పాన్ని విజయుడికి ఇచ్చింది. 'ఇది వాడిపోయిందంటే నాకు వేరొకరితో వివాహం జరిగినట్టు భావించి నన్ను మరిచిపో. నీ పని పూర్తయిన తర్వాత కూడ ఇది వాడిపోకపోతే



దీనిని ముద్దుపెట్టుకొని 'ఓ చంపకగంధీ నిన్ను ఇష్టపడ్డాను. మనం కలుద్దాం,' అని మనస్ఫూర్తిగా పిలిస్తే నేను వచ్చి కలుస్తాను. మా తండ్రిని ఒప్పించి వివాహమాడతాను. ఒకవేళ ఆయన మన పెళ్ళికి ఒప్పుకోకపోతే మానవ స్త్రీగా మారి నీతోనే ఉండిపోతాను,' అని చెప్పింది.

తన మీద ఆమెకున్న ప్రేమకు చలించిపోయాడు విజయుడు. 'ఓ సుందరీ! నీ ప్రేమను అర్థం చేసుకున్నాను. నా మాట మన్నించి విడిచి పెట్టినందుకు ధన్యవాదాలు. ప్రస్తుతం మందారపురం వెళుతున్నాను. ఆశయం నెరవేరిన తరువాత నిన్ను కలుస్తాను. ఇప్పటికే నీవల్ల బాగా ఆలస్యమైపోయింది. కాబట్టి నన్ను నా పంచకళ్యాణితో సహా మందారపుర ఊరి పొలిమేరల్లో దించగలవా?' అని కోరాడు.

విజయుడు కోరినట్లే చేసింది ఆమె. చంపకగంధి కన్నీళ్ళతో విజయుడికి వీడ్కోలు చెప్పింది. విజయుడి కళ్ళు చెమర్చాయి.

* * *

గుర్రాన్ని నడిపిస్తూ వెళుతున్న విజయుడికి కొంచెం దూరంలో ఒక ఉద్యానవనం కనిపించింది. వెంటనే అటు వెళ్ళి ఒక చెట్టుకి గుర్రాన్ని కట్టి మరో చెట్టు కింద నడుము వాల్చాడు. నిద్రపట్టబోతుండగా దగ్గరలో నాణాలు కుప్ప పోస్తున్నట్లు, నగలు కదుపుతున్నట్లు శబ్దం వినబడింది. కళ్ళు మూసుకునే శబ్దం వచ్చిన దిశగా చెవులు రిక్కించి వింటూ వచ్చాడు విజయుడు.

ఎవరైనా దొంగలు దొంగతనం చేసి ధనం, నగలు మూట గట్టుకొని పక్కనున్న చెట్టు కింద లెక్క పెట్టుకుంటున్నారేమో అనుకున్నాడు విజయుడు. తాను కదిలితే పారిపోతారని భావించి అతడు కదలకుండా పడుకున్నాడు. ఎంతకీ శబ్దం ఆగడం లేదు. ఆ శబ్దాలతో అతడికి నిద్ర పట్టడం లేదు. ఎంతమంది దొంగలున్నారో, ఎంత సొత్తు దోచుకొచ్చారో కూడ తెలుసుకోవాలనిపించి కళ్ళు తెరిచి చూశాడు. ఆశ్చర్యమేమిటంటే ఉద్యానవనంలో తాను, తన గుర్రం తప్ప మరెవరూ లేరు.

అతడు తిరిగి నిద్రకు ఉపక్రమించాడు. నాణాలు గలగల శబ్దం మరోసారి వినిపించింది. మరింత శ్రద్ధగా విన్నాడు విజయుడు. శబ్దాలు తాను నిద్రిస్తున్న చెట్టు కిందున్న భూమి నుండి వస్తున్నట్టు గ్రహించాడు. విజయుడికి రాక్షసి కిరాతకి ద్వారా నేర్చుకున్న విద్య సంగతి గుర్తొచ్చింది. ఇదంతా ఆ విద్య ప్రభావమే అని అతడు గ్రహించాడు. అందువల్లనే భూగర్భంలో ఉన్న నిధుల విషయం తనకు తెలుస్తోంది. అతడి సంతోషానికి అంతు లేకపోయింది.

మందారపురాన్ని ఏలే రాజుగారితో మాట్లాడి భువనదేశానికి తగిన సాయం చేయమని అడగడం ఇక తేలిక అవుతుందని విజయుడు ఆశపడ్డాడు. అతడి మనస్సు తేలికయ్యింది. ఇక 'ఎప్పుడు తెల్లవారుతుందా, మహారాజుని కలుసుకొని తాను వచ్చిన పని చెప్పగలుగుతానా!' అని ఎదురు చూస్తూ గడిపాడు విజయుడు.

బాగా వెలుతురు వచ్చినంతవరకూ అక్కడే గడిపాడు. నిధి ఉన్న చెట్టుని గుర్తు పట్టడం కోసం విజయుడు చెట్టు మొదలు భాగాన తన చిన్న కత్తితో ఒక గుర్తు చెక్కాడు. అక్కడనుండి నగరంలోకి బయలుదేరాడు విజయుడు.

నగర వీధుల్లో పంచకల్యాణి పరుగులు తీస్తోంది. అతడికి ఒక చోట పూటకూళ్ళమ్మ ఇల్లు కనిపించింది. అక్కడ చాల ప్రాంతాలనుండి తరలి వచ్చిన

బాటసారులు కనిపించారు. వారు మాట్లాడుకుంటున్న మాటల్లో ఏదైనా సమాచారం తనకు తెలుస్తుందేమో అనుకొని ఆ ఇంటికి వెళ్ళి కూర్చుని తనకు ఫలహారం పెట్టమని అడిగాడు విజయుడు. ముసలమ్మకి ఒక బంగారు నాణెం ఇచ్చి చిల్లర ఉంచుకోమని చెప్పి 'అవ్వా ఏమిటి ఈ రాజ్యంలో విశేషాలు?' అని అడిగాడు.

అప్పటికి పరదేశీలు వెళ్ళిపోయారు. అవ్వ కూడా ఒంటరిగా వుంది.

'మనవడా నీదే రాజ్యం? ఏం పనిమీద వచ్చావు ఇక్కడకి?' అని అడిగింది అవ్వ, అతడి వేషం, భాషా గుర్తు పట్టి.

విజయుడు తన గురించి చెప్పి 'నేను మహారాజు గారిని కలవడానికి వచ్చాను,' అన్నాడు. అవ్వ విజయుడిచ్చిన నాణెం చూసి 'మనవడా నువ్వు తిన్న ఫలహారానికి బంగారు నాణెం చాల ఎక్కువ. నువ్వు మిగతా ధనం ఉంచుకోమని చెప్పావు కానీ అంత ధనం నాకెందుకు నాయనా! కాసేపు అక్కడ కూర్చున్నావంటే. రాజభటులు వచ్చిన తరువాత సందేహాలు తీరుస్తాను,' అంది.

కొంతసేపటికి రాజుగారి కొలువులోని సేవకులు ఇద్దరు వచ్చి ఫలహారం తినసాగారు. వారితో చనువుగా మాట్లాడుతూ 'మనరాజు గారు ఎక్కడున్నారు? పులిని వేటాడి తిరిగొచ్చారా?' అని అడిగింది అవ్వ.

వాళ్ళు దానికి జవాబుగా 'లేదు. రాజుగారు కోటలో ఉంటే మేం ఇంత తీరిగ్గా మాట్లాడగలమా! రాజుగారు సర్వశిద్ధిపల్లెకి వెళ్ళారు. ఇంకా రాలేదు. ఆ పులి ఇప్పటికే చాల మందిని పొట్టన పెట్టుకుందట. దాన్ని చంపడం ఎవరివల్లా కాకపోవడంతో రాజుగారే స్వయంగా వెళ్లారు,' అని చెప్పారు.

అక్కడ కూర్చున్న విజయుడిని చూసి 'ఏమోయి పరదేశీ. ఏ దేశము నుండి వచ్చావు? ఇక్కడ ఎవరిని కలవాలి?' అని అడిగారు భటులు.

విజయుడు తాను వచ్చిన పని చెప్పాడు. 'అలాగా. మహారాజుగారు ప్రస్తుతం కోటలో లేరు. సాయంత్రానికి తిరిగి వస్తారు. నువ్వు అప్పుడు కోటకి రావచ్చు,' అన్నారు వాళ్ళు.

తల ఊపాడు విజయుడు. 'అవ్వా! బంగారు నాణెం ఉంచుకుని మధ్యాహ్నానికి కూడ భోజనం వండి పెట్టు,' అని పక్కనే ఉన్న మంచం మీద

నడుం వాలుస్తానని చెప్పాడు. రాత్రంతా నిద్ర లేదని కూడా చెప్పాడు.

అక్కడున్న మంచం మీద నడుము వాల్చాడు విజయుడు. అవ్వ మాటలు మొదలుపెట్టింది. 'మహారాజుగారు చాల మంచివారు. రాజ్యంలో దేనికీ సమస్య లేదు. వర్షాలు కురుస్తున్నాయి. పంటలు బాగా పండుతున్నాయి. ఇంకా ఏమి చెప్పమంటావు?' అని అడిగింది.

అప్పుడు విజయుడు 'అవ్వా మీ రాజ్యం ఇంత సుభిక్షంగా ఉండడానికి కారణం ఎవరో ముని అని చెప్పుకోగా విన్నాను. నీకేమైనా ఆ విశేషాలు తెలుసా?' అని అడిగాడు.

'అవును మనవడా. ముని శ్వేతకేతుడు మా రాజుగారి సేవలకు మెచ్చి వరమిచ్చాడు,' అని చెప్పింది అవ్వ. శ్వేతకేతుడు ఎక్కడుంటాడో తెలుసా అని అడిగిన ప్రశ్నకు తెలియదని చెప్పింది ఆమె.

అవ్వ మాటలు వింటూ నిద్రలోకి జారుకున్నాడు విజయుడు. మధ్యాహ్న భోజన వేళకి అతడిని నిద్రలేపి అవ్వ తిండిపెట్టింది. సాయంత్రం రాజుగారు వచ్చారని తెలుసుకొని కోటలోకి వెళ్ళాడు అతడు.

రాజదర్శనం తేలికగానే దొరికింది విజయుడికి. రాజు గారికి అతడు నమస్కరించి తన పరిచయం చేసుకున్నాడు. విజయుడిని రాజు మంగళుడు సాదరంగా ఆహ్వానించి ఆసనం చూపాడు. వచ్చిన పని తెలుసుకున్నాడు. భువనదేశపు సమస్య విని తన సంతాపం తెలిపాడు.

'మీరు ఆ దేశానికి చాలవిధాల సాయపడ్డారని ఆ దేశపు రాజు ధర్మతేజుడు గారు చెప్పారు. మరికొన్నాళ్ళ పాటు వారికి ఆహారానికి లోటు లేదు. కానీ తర్వాతి కాలానికి కూడా వారికి సాయం అందించగలరా?' అని బతిమాలాడు.

మంగళుడు సమాధానం చెప్పకుండా మంత్రివైపు చూశాడు. మంత్రిగారు తమ కోశాధికారిని కలిసి వచ్చి 'రాజా! మనం ఇప్పటికే చాల సాయం చేసాం. పోనీ వారి సమస్య ఎప్పుడు తీరుతుందో తెలిస్తే అంతవరకూ సాయం చేయగలమో లేదో చెప్పొచ్చు. భువనదేశపు సమస్య అసలు తీరుతుందో లేదో చెప్పలేనప్పుడు ఎంత కాలమని సాయం చేయగలం? మన రాజ్యప్రజలకు తగిన సదుపాయాలు అందించలేకపోతే ఇక్కడి ప్రజల్లో అసంతృప్తి వస్తుంది కూడా. తనకు మాలిన ధర్మం పనికి రాదు కదా!' అన్నాడు.

విజయుడు 'మహారాజా! మంత్రిగారు చెప్పింది అక్షరాల నిజం. ముని శాపానికి విమోచన మార్గం తప్పక తెలుసుకోగలనని నమ్మకముంది. అంత వరకు అక్కడి ప్రజలను ఆదుకోగలిగే శక్తి మీ రాజ్యానికి మాత్రమే ఉంది. మీరు ఇక ముందు ఉచితంగా సహాయం చేయవద్దు. అందుకు బదులుగా గొప్ప నిధినిక్షేపాలున్న స్థలాన్ని మీకు చూపిస్తాను. ఆ నిధివల్ల మీకు అనేక ప్రయోజనాలు సమకూరుతాయి. అంతవరకూ ఈ వజ్రాన్ని ఉంచండి,' అని తనకు కిరాతకి ఇచ్చిన గోధుమరంగు వజ్రాన్ని ఆయనకు బహూకరించాడు.

మహారాజు మంగళుడు ఆ వజ్రం చూసి ఎంతో సంతోషించాడు. అలాంటి వజ్రం గురించి వినడమే కానీ చూడలేదని చెప్పాడు. అది కలిగి ఉన్న రాజ్యానికి కరువు కాటకాలు దరి చేరవని తాళపత్రగ్రంథాలలో చదివినట్లు చెప్పాడు ఆయన.

'మా రాజ్యంలో నిధినిక్షేపాల సంగతి మీకెలా తెలిసింది?' అని అడిగాడు మంగళుడు.

విజయుడు తన శక్తి గురించి చెప్పి నిధినిక్షేపాలు ఉన్నాయన్న స్థలానికి రాజు గారిని తీసుకు వెళ్ళాడు. అక్కడకు వెళ్ళిన రాజు గారు 'ఈ ఉద్యానవనంలో నిధులున్నాయంటే నమ్మలేము,' అన్నాడు.

ముని తేజస్వి నుండి పొందిన భరిణెలోని లేపనం బయటకు తీశాడు విజయుడు. దానిని తన కనురెప్పల మీద తాకించి నిధిని చూశాడు. లేపన ప్రభావం వల్ల భూగర్భంలో పెద్దపెద్ద ఇనుపపెట్టెలలో దాచి ఉంచిన బంగారం, మణులు, మాణిక్యాలు, వజ్రాలు స్పష్టంగా కనబడ్డాయి.

భూగర్భంలో, నిధులున్నాయన్న విషయంలో అనుమానం తొలగి పోయింది. 'మహారాజా! నా మాట నమ్మండి. నేను చెప్పిన స్థలంలో తవ్వించండి. మీకు నిధి దొరుకుతుంది' అన్నాడు ధైర్యంగా విజయుడు.

విజయుడు చెప్పిన మాటలతో నమ్మకం కుదిరింది రాజుగారికి. 'మీరు అన్నట్టు గొప్పనిధి దొరికితే భువనదేశానికి పూర్తి సాయమందిస్తాం,' అని మాట ఇచ్చారు ఆయన.

మరునాడు ఉదయం మహారాజు మంగళుడు, మహారాణి ముక్తాలత, యువరాణి మోహనాంగితో వచ్చి విజయుడికి వారిని పరిచయం చేసాడు.

యువరాణి మోహనాంగిని చూడగానే ఆమె సౌందర్యం విజయుడిని కనులు తిప్పుకోనీయలేదు. రాజదంపతులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నిధి తవ్వకాన్ని మొదలు పెట్టమన్నారు.

విజయుడు చెప్పిన ప్రదేశంలో తవ్వకాలు జరిపారు పనివాళ్ళు. సాయంత్రం వరకూ తవ్వుతూనే ఉన్నారు కానీ నిధి గురించి ఏమీ ఆచూకీ దొరకలేదు. వారు విజయుడి వైపు అపనమ్మకంగా చూశారు. నిధి చేతికి వచ్చేవరకూ తవ్వకాలు ఆపవద్దని చెప్పాడు విజయుడు. మహారాజు కూడా ఆజ్ఞ ఇవ్వడంతో తవ్వకం పని కొనసాగింది.

మూడో రోజుకు కూడ భూగర్భంలో ఉన్న నిధి బయటపడక పోయే సరికి కాళికాలయానికి వెళ్ళాడు విజయుడు. అక్కడ శ్రద్ధగా కాళికామాతను ప్రార్థించాడు. 'అమ్మా ఈ నిధి బయటకు తీయించడంలో నా స్వార్థం ఏమీ లేదు. ఆ రాజ్యప్రజలకు మేలు చేద్దామనే మంచి ఆలోచన మాత్రమే వుంది,' అని చెప్పి సాష్టాంగ పడ్డాడు.. అలా మరో నాలుగురోజులు గడిచాయి. అయినా నిధి లభించలేదు. జాడే దొరకలేదు.

ఏడవరోజు సాయంకాలం తవ్వకాలు ఆపించేయాలని మంగళుడు నిర్ణయించుకున్నాడు. ఆ విషయమే విజయుడికి కబురు పంపాడు. ఆ వార్త విన్న విజయుడు 'తల్లీ, నీకు దయలేదా? నా విద్యలను అవహేళన చేస్తావా? నాకు గోచరిస్తున్న నిధిని చేతికందకుండా చేస్తున్నదెవరో కానీ నువ్వు సాయం చేయాలి. పరోపకారం కోసం చేసే నా ప్రయత్నం ఫలించేలా చూడమ్మా!' అన్నాడు.

అయినా కాళికాదేవి నుండి ఎటువంటి స్పందన రాకపోయేసరికి విజయుడు తన ఖడ్గాన్ని బయటకు తీసి 'తల్లీ! వారి ముందు అవమానం పొందే కంటే నీ ముందు నా తల నరుక్కొని చనిపోతాను,' అని కత్తి ఎత్తి తల నరుక్కోబోయాడు.

అప్పుడు కాళికామాతకి దయగలిగి విజయుడి ఎదుట ప్రత్యక్షమైంది. 'ఆగు రాకుమారా! తొందర పడవద్దు. మందారపురం రాజు మంగళుడి ముత్తాతల కాలంలో యుద్ధభయంతో విశేషమైన నిధిని భూస్థాపితం చేసారు. ఆ నిధి అన్యుల చేతికి చిక్కకూడదని వేదపండితుల చేత మంత్రబంధనం



చేయించారు. నిధినిక్షేపాలున్న పెట్టెల చుట్టూ మంత్రించిన రక్షారేకులు కట్టారు. వాటి ప్రభావం వల్ల అవి సామాన్యులకు అందనంత లోతుకి వెళ్ళిపోతున్నాయి. నువ్వు ప్రజా క్షేమం ఆశించి చేస్తున్నావు కాబట్టి నా మహిమతో రక్షారేకులు తొలగిస్తాను. నిధి కనిపిస్తుంది. శుభమస్తు,' అని చెప్పి ఆమె మాయమైంది.

సంతోషంగా పూజ ముగించి గుడి నుండి బయటకు వచ్చాడు విజయుడు. నిధి తవ్వుతున్న ఉద్యానవనానికి వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే పనివాళ్ళ గునపాలకు ఠంగుమంటూ గట్టిగా తగిలింది. వాళ్ళు మరికొంత సేపు తవ్వేసరికి పెద్ద ఇనుపపెట్టెలు నాలుగు కనిపించాయి వారికి. ఆ పెట్టెలను బలమైన గొలుసులతో బిగించి కట్టి తాళాలు వేసి ఉన్నాయి. వస్తాదుల లాంటి బలిష్టులు అయిన కొందరు వ్యక్తులు వాటిని అతికష్టం మీద బయటికి తీసారు. పెట్టెలకు బిగించిన తాళాలు అతికష్టం మీద పగలగొట్టారు. కళ్ళు మిరిమిట్లు గొలిపేలా విలువైన సంపద కనిపించింది. వజ్రాలు! బంగారు నగలు! మణులు! మాణిక్యాలు! బంగారు నాణాలు!

మహారాజు మంగళుడు సంతోషంగా విజయుడి దగ్గరకి వచ్చి కౌగిలించుకొని 'రాకుమారా! నిన్నెలా అభినందించాలో తెలియడం లేదు. నీ తెలివీ, శక్తులూ అమోఘం. పరోపకార బుద్ధి ఘనం! తరతరాల వరకు మా రాజ్యాన్ని మాత్రమే కాదు అనేక రాజ్యాలను సంపన్నం చేసే గొప్ప నిధి నీ వల్ల వెలుగులోకి వచ్చింది. భువనదేశపు సమస్య గురించి మీరింక చింత పడవద్దు. ఆ దేశాన్ని మేం అన్ని విధాల ఆదుకుంటాం' అని మాట ఇచ్చాడు.

తన మంత్రులతో మాట్లాడి వెంట వెంటనే సాయం అందించే ఏర్పాట్లు చేసాడు రాజు మంగళుడు. అప్పటికి గానీ విజయుడికి తృప్తిగా అనిపించలేదు.

* * *

విజయుడు అతిథి భవనంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు అక్కడకి మంగళుడు వచ్చాడు. సాక్షాత్తు మహారాజుగారే స్వయంగా తన భవనానికి రావడంతో విజయుడు ఆశ్చర్యపోయాడు.

'రాకుమారా! మీ ప్రతిభా సామర్థ్యాలను విన్నప్పటి నుండి నా కుమార్తెను మీకిచ్చి వివాహం చేయాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది. పైగా మహారాణి, మా పుత్రిక కూడ తమ సమ్మతిని తెలిపారు. మీ సమ్మతి కూడా తెలుసుకొని మీ తండ్రిగారి అనుమతి కోరాలని వచ్చాను,' అని చెప్పాడు.

ఆశ్చర్యపోయాడు విజయుడు. తాను కూడ యువరాణిని చూసి ఉన్నాడు. ఆమె చక్కని అందగత్తె. సౌశీల్యవతిగా కూడా తోచింది. అందులో సందేహం లేదు. అయినప్పటికీ తాను బయలుదేరిన పని వేరు. మొదట తన దేశాటన పూర్తవ్వాలి. తర్వాత తల్లిదండ్రుల అనుమతితో వివాహం చేసుకోవాలి. అలా అనుకున్న విజయుడు 'క్షమించండి మహారాజా! ఇప్పుడు నేను ముని శ్వేతకేతుడిని కలవాలనీ, భువనదేశానికి వచ్చిన కరువుకు శాపవిమోచన తెలుసుకోవాలని వెళుతున్నాను. వివాహం గురించి నాకు ఇంకా ఒక స్పష్టమైన అభిప్రాయం కలగలేదు,' అని చెప్పాడు.

మంగళుడు నవ్వుతూ 'యువరాజా! మీరు చెప్పింది సబబుగా ఉంది. మీరు ఇప్పుడే వివాహం చేసుకోవద్దు. మీరు చెయ్యాలనుకున్న పనులు పూర్తి అయిన తర్వాతనే మీ అంగీకారం తెలుపవచ్చు. మీ తండ్రిగారికి జాబు

రాయించి పంపుతాను. ఈ వివాహానికి వారి అనుమతి కోరతాను,' అని చెప్పాడు.

తరువాత వారిద్దరూ పరిపాలనకు సంబంధించిన అనేక విషయాల మీద మాటలాడుకున్నారు. మాటల మధ్య మంగళుడు ఇలా చెప్పాడు.

'ఇక్కడికి వంద యోజనాల దూరంలో గల మహతిపురం అడవుల్లో ఒక ఆశ్రమం స్థాపించుకుని గౌతముడు అనే ముని తపస్సు చేస్తున్నాడు. భువనదేశానికి శాపమిచ్చిన ముని శ్వేతకేతుడు ఆయనకు మంచి స్నేహితుడని నాకు మొన్ననే తెలిసింది. గౌతముడిని కలిస్తే శ్వేతకేతుడి వివరాలు తెలుస్తాయని నాకు నమ్మకం ఉంది. మహతిపురం వెళ్ళే దారిలో సముద్రపు పాయను దాటవలసి ఉంటుంది సుమా!'

శ్వేతకేతుడిని కలిసే మార్గం చెప్పినందుకు మహారాజు మంగళుడికి ధన్యవాదాలు చెప్పాడు విజయుడు.

మంగళుడు వెళ్ళిన తర్వాత సంచి లోని అత్తరుసీసా సాయంతో భువనదేశపు యువరాజు ధర్మతేజుడితో మాట్లాడాడు. అక్కడి పరిస్థితిని తెలుసుకున్నాడు. అక్షయపాత్ర సహాయంతో ప్రజలందరికీ ఆకలిదప్పులు తీరుతున్నాయని ధర్మతేజుడు చెప్పాడు. విజయుడు సంతోషించాడు. మందారపురం రాజుగారికి నిధిని చూపించినట్టూ, భువనదేశానికి సాయం విషయమై అంగీకారం తెలిపినట్టూ ధర్మతేజుడితో విజయుడు చెప్పాడు. ధర్మతేజుడు అతడికి మరీ మరీ కృతజ్ఞతలు చెప్పాడు.

* * *

మహతిపురం అడవులు చేరడానికి విజయుడు బయలుదేరి మూడు రోజులపాటు ఏకధాటిగా ప్రయాణం కొనసాగించాడు. కర్తవ్య దీక్ష బలంగా వుండడం వల్ల అలసట తెలియకుండా అతడు వెళుతున్నాడు.

మూడవరోజు సాయంత్రం వేళకి అతడు ఒక అడవి సరిహద్దును దాటుతున్నాడు. చీకటి పడిన తర్వాత ప్రయాణం ఆపాడు. విశాలమైన మర్రి చెట్టు దగ్గర ఆగి చెట్లకు కనిపించిన పండ్లు కోసుకుని తిన్నాడు. నీరు తాగి ఒక మర్రి చెట్టు కిందనే నడుము వాల్చాడు.

అలసట వల్ల అతడికి బాగా నిద్ర పట్టింది. అర్ధరాత్రి వేళ ఊపిరి ఆగుతున్నట్టు అనిపించింది విజయుడికి. కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా తాటిచెట్టంత ఎత్తులో భయంకరాకారంలో ఉన్న రాక్షసుడు కనిపించాడు. రాక్షసుడు అతడి గుండె మీద కాలు వేసి నిలబడ్డాడు. మరొక ప్రమాదం ముంచుకొచ్చిందని గ్రహించాడు విజయుడు. ఒక్క ఉదుటున లేచి నిలబడి తన ఖడ్గం బయటకు తియ్యబోయాడు. అప్పటికే ఆ రాక్షసుడు ఖడ్గాన్ని తీసి దాచేసాడు. అందువల్ల ఖడ్గం కనిపించలేదు. రాక్షసుడి పాదం కింద నుండి ఒడుపుగా బయటపడ్డాడు విజయుడు. అతడు ఏమాత్రం జంకలేదు. ఎగిరి గాల్లోకి లేచాడు. తనకి వచ్చిన మల్లయుద్ధ విద్య ప్రయోగించి రాక్షసుడి పొట్టలో గుద్దాడు.

ఆ దెబ్బకి రాక్షసుడిలో ఏ మాత్రం స్పందన కనిపించలేదు. సరికదా వికటంగా నవ్వుతూ 'నరుడా! మంచి ఆకలి మీద ఉన్నానురా. చాల రోజుల తర్వాత నరమాంసం దొరికింది. నిన్ను నిద్ర లేపకుండా తినడం ఇష్టం లేక లేపాను. నన్ను ఎదిరించడం మానవుల తరం కాదు. నీ ఖడ్గాన్ని ముందుగానే తీసి అదిగో అక్కడ పెట్టాను. నాకు ఆహారం అవ్వడం తప్ప నీకు మరో మార్గం లేదు,' అని హుంకరించాడు.

రాక్షసుడు ఒక చేతితో విజయుడి మెడ పట్టుకుని మీదకు ఎత్తుతూ నోటి దగ్గరకు తీసుకెళ్ళాడు. విజయుడు అదను చూసి బలాన్నంతా చేతిలోకి తెచ్చుకొని రాక్షసుడి ముఖం మీద గుద్దాడు. ఆ దెబ్బ రాక్షసుడి కంటి మీద తగిలింది. దాంతో ఏమి జరిగిందో అర్థం కాలేదు రాక్షసుడికి. కళ్ళు పచ్చబడ్డాయి. తల తిరిగింది. ఒక్క క్షణం పాటు ఏమీ కనిపించలేదు. చేతి పట్టు సడలించి విజయుడిని అంత ఎత్తు నుండి కిందకి వదిలేసాడు.

విజయుడు కింద పడ్డాడు. ఆ రాక్షసుడు కాసేపటికి తేరుకొని కళ్ళు తెరిచాడు. విజయుడికి రాక్షసి కిరాతకి చెప్పిన విషయం గుర్తుకి వచ్చింది. అంతే! రాక్షసుడికి ఎదురుగా నిలబడి 'నేను రాక్షసి కిరాతకిని ఎదిరించి నిలబడ్డ వాడిని. నా జోలికి రావద్దు,' అన్నాడు.

ఆ రాక్షసుడిలో అకస్మాత్తుగా విచిత్రమైన మార్పు కనిపించింది. 'నా భార్య కిరాతకి నీకు తెలుసా? నువ్వు ఇంకా బ్రతికి ఉన్నావంటే కొంపదీసి

ఆమెను చంపేసావా?' అని అన్నాడు కోపంగా.

రాక్షసుడిని మాటల్లో పెడుతూనే విజయుడు తన ఖడ్గాన్ని అప్పటికే చేజిక్కించు కున్నాడు. 'నువ్వు కిరాతకి భర్తవా?' అని అడిగాడు విజయుడు నిర్ధారణ కోసం.

రాక్షసుడు 'నరుడా! నా భార్య బతికే ఉందా?' అని తిరిగి అడిగాడు.

విజయుడు తనకూ, కిరాతకికీ మధ్య జరిగిన పోరాట వివరాలు చెప్పాడు. ఒక వజ్రాన్ని తనకు బహుమతిగా ఇచ్చినట్టు కూడా చెప్పాడు. రాక్షసుడు ఆనందపడుతూ 'నా పెళ్ళాం నుండి కబురు తెచ్చావు నరుడా! చాలా రోజుల తర్వాత సంతోషంగా ఉంది. ఆమె బతికే ఉంది కదా!' అన్నాడు.

'అవును క్షేమంగా వుంది!' అన్నాడు విజయుడు.

తరువాత తన గురించి చెప్పాడు రాక్షసుడు. 'నీలాంటి ఒక యోధుడిని చంపబోయాను. మా మధ్య పెద్ద పోరు జరిగింది. ఆ పోరులో నేను కొండ మీద నుండి కాలు జారి నేలమీద పడ్డాను. నా తల రాయికి తగిలింది. అప్పటి నుండి మతిస్థిమితం కోల్పోయి భార్య గురించి మరిచిపోయాను.



ఇప్పుడు నువ్వు చెప్పిన తరువాత నా భార్య సంగతి గుర్తొచ్చింది,' తల తడుముకున్నాడు రాక్షసుడు.

'నీ కోసం కిరాతకి ఎదురు చూస్తోంది. త్వరగా వెళ్ళి కలుసుకో,' అన్నాడు విజయుడు.

'నరుడా! నా భార్యకి వచ్చిన మంత్రతంత్రాలు, విద్యలూ అన్నీఇన్నీ కావు. అలాంటిదాన్ని ఎదిరించి ఆమె నుండి కానుకగా వజ్రం పొందావంటే నువ్వు మహా వీరుడివే. ఈ లోకంలో ఇక నీకు తిరుగే లేదు. ఇంతకీ ఏం పని మీద వెళుతున్నావు,' అని అడిగాడు రాక్షసుడు.

తన కర్తవ్యం గురించి రాక్షసుడికి చెప్పాడు. అది విన్న రాక్షసుడు 'నువ్వు వీరుడివే కాకుండా లోకశ్రేయస్సు కోరేవాడివి. నిన్ను చంపాలనుకోవడం ఎంత తప్పు. నువ్వు హాయిగా, క్షేమంగా ఈ రాత్రికి నిద్ర పోయి ఉదయాన్నే వెళ్ళు. నా మాయవల్ల నువ్వు నిద్రలో ఉండగా నిన్నెవరూ తాకకుండా ఒక మంత్రం చెబుతాను. నువ్వు నిద్రపోయే ముందు మంత్రం చదివి పడుకో,' అని ఒక మంత్రం చెప్పాడు.

రాక్షసుడు గాలిలో ఎగురుతూ తన భార్య కిరాతకిని కలవడానికి వెళ్ళిపోయాడు. విజయుడు నిద్రకు ఉపక్రమించాడు.

* * *

ఉదయం ప్రయాణం సాగించిన విజయుడు మార్గమధ్యంలో సముద్రపు పాయను దాటవలసి వచ్చింది. ఓడ రేవు దగ్గరే గుర్రాన్ని కాపలా కాయమని ఒకరికి అప్పగించి ఓడ ఎక్కాడు. ఓడ ప్రయాణం చేస్తున్న మూడో రోజున పెద్ద తుపాను వచ్చి పెద్దపెద్ద అలలు లేచాయి. సముద్రం మీద భారీ గాలులు వీచాయి. వాన కురిసింది. సముద్రమంతా అల్లకల్లోలమయిపోయింది. వారు ప్రయాణిస్తున్న ఓడ నీటిలో మునిగి పోయింది. మనుషులందరూ నీటిలో మునిగి చనిపోయారు. అదృష్టం సహకరించి విజయుడి చేతికి ఓడ నుండి ఊడిపోయిన కర్ర ముక్క దొరికింది. దానిమీదకి నెమ్మదిగా ఎక్కి కూర్చొని గట్టిగా పట్టుకున్నాడు విజయుడు.

విపత్తు ముంచుకొచ్చినప్పుడు చెయ్యడానికేమీ లేదని అతడికి తెలుసు.



అందుకే మానవసాయం కంటే దైవిక సహాయమే కాపాడుతుందని నమ్మి మనస్ఫూర్తిగా దుర్గామాతని తలచుకుని తనను కాపాడమన్నాడు.

విజయుడు పట్టుకున్న చెక్కముక్క గాలికి ఇష్టమొచ్చినట్టు కొట్టుకొంటూ ప్రయాణించింది. సముద్రం మీద తుఫానుకి తోడు చల్లటి గాలికి శరీరం గడ్డకట్టి స్పృహ కోల్పోయాడు విజయుడు.

అలా మూడురోజులు పగలూ రాత్రి సముద్రంలో కొట్టుకుంటూ వెళ్ళిన విజయుడు సముద్ర తీరం చేరి ఇసుకలో పడ్డాడు. ఎర్రని ఎండ శరీరానికి వేడిగా తగలడంతో కళ్ళు తెరిచి చూశాడు విజయుడు. తాను బతికే ఉన్నందుకు సంతోషించాడు. తన వస్తువులున్న సంచి నడుముకి వేలాడుతూ కనిపించింది. తనతో ఓడలో ఉన్న వాళ్ళందరూ సముద్రంలో మునిగి చనిపోయినప్పటికీ తాను మాత్రమే ప్రాణాలతో మిగిలాడు. 'తన వస్తువులు కూడ భద్రంగా ఉన్నాయంటే ఇదంతా దుర్గామాత దయ కాకపోతే మరింకేమిటి?' అనుకున్నాడు మనసులో.

ఓపిక తెచ్చుకుని లేచి నిలబడ్డాడు విజయుడు. అతడికి ఇంకా నీరసంగానే ఉంది. తన చుట్టూ ఆహారం దొరుకుతుందేమోనని చూశాడు. అక్కడికి కొంతదూరంలో ఒక ఫలవృక్షాలున్న తోట కనిపించింది. అటు వెళ్ళాడు

విజయుడు. తోట మధ్యలో ఒక భవంతి కనిపించింది.

తోటలో చెట్లన్నీ కేవలం రెండడుగులు ఎత్తే ఉన్నాయి. చిన్నపిల్లలు కూడా వాటిని తేలిగ్గా అందుకుని కోసుకునేటంత ఎత్తులో చెట్లు ఉండడం ఆశ్చర్యం అనిపించింది. అంతకంటే ఆశ్చర్యం... ద్రాక్షపళ్లు మరీ పెద్దవిగా బత్తాయిపళ్ళ పరిమాణంలో ఉన్నాయి. అలాగే అరటి పళ్ళు ఒక్కొక్కటి దోసకాయలంత పెద్దవిగా ఉన్నాయి. చెట్లు చూస్తే చాలా పొట్టిగా ఉండి పండ్లు చూస్తే పెద్దవిగా ఉండడం వింతే అనుకున్నాడు విజయుడు.

తనకి నచ్చిన పండ్లు కోసుకుని తిన్నాడు విజయుడు. అలసట పోయింది. అతడికి చాల శక్తి వచ్చి చేరింది. తనకి పూర్వపు శక్తి శరీరంలోకి చేకూరగానే తోట మధ్యలో ఉన్న భవంతిని సమీపించాడు విజయుడు. ఆ భవంతి చాలా అందంగా ఉంది. భవంతిని చూస్తోనే విజయుడు నిర్ఘాంతపోయాడు.

ఆ భవంతి నేల మీద నిలబడి లేదు. భూమికి రెండడుగుల ఎత్తులో గాలిలో వేలాడుతూ ఉంది. భవంతి కింద భాగంలో నేల కాకుండా నీరు దర్శనమిచ్చింది. ఒక సరస్సు మధ్యలో భవనం నిర్మించారా అన్నట్టు దూరానికి కనిపిస్తోంది. భవంతికి పైకప్పు ఉందో లేదో తెలియడం లేదు. అసలు స్వరూపం అతడి కంటికి కనబడడంలేదు. నేలని తాకకుండా నీటి పైభాగాన కొంత ఖాళీ స్థలం వుంది. గాలిలో భవన నిర్మాణం చేసిన వాళ్ళు ఎంత గొప్పవారో, ఎంతటి మహిమావంతులో అతడి ఊహకు అందలేదు.

నీటిలో తొలి అడుగు వేశాడు విజయుడు. ఆశ్చర్యం. అక్కడ నీరు లేదు. మామూలు నేల ఉంది. అయితే చెరువుల్లో, సరస్సుల్లో ఉన్నట్టు నీరు రంగులో నేల కనబడేలా చేసారని పోల్చుకున్నాడు. అంత భవనానికి కూడ కేవలం రెండే తలుపులు ఉన్నాయి. మరికొంచెం ముందుకి వెళ్ళి ఒక వైపున్న తలుపు తోసుకొని లోపలకు వెళ్ళ బోయాడు. ఆశ్చర్యం ఏమిటంటే అక్కడ తలుపుల రూపంలో కనబడుతున్నవి తలుపులు కావు. అది రాతిగోడ.

లోపలకు వెళ్ళడానికి దారి కోసం నిశితంగా పరిశీలించాడు విజయుడు. కానీ అలాంటి ఏర్పాటు అతడికి కనబడలేదు. ఆ భవనానికి కిటికీలు కూడ లేవు. అన్ని వైపులా గోడ కట్టినట్టు కనబడుతోంది. తార్కికంగా ఆలోచిస్తే తలుపుల దగ్గర గోడ ఉంది కాబట్టి గోడ స్థానంలో తలుపులు ఉంటాయని

తట్టింది అతడికి. అక్కడున్న గోడని లోపలకు తోశాడు. ఆయన ఊహించినట్టుగా తలుపులు తెరిచిన శబ్దం చేస్తూ గోడ లోపలకి దారి ఇచ్చింది. నడిచే దారి కనబడింది అతడికి.

లోపలకు వెళ్ళిన విజయుడుకి విశాలంగా ఉన్న గదులు కనిపించాయి. ఒక్కొక్క గదికి మునుపటి మాదిరిగానే తలుపుల స్థానంలో గోడ, గోడ స్థానంలో తలుపులు కనిపించాయి. ఒక్కొక్క గదిలో మనుషులు ఎవరైనా ఉన్నారేమో చూస్తూ ముందుకు నడిచాడు. ఎక్కడా మనుషుల సంచారం లేదు. ఒక గదిలో మాత్రం మనుషులు తినే ఆహారం, తాగునీరు, విశ్రాంతి తీసుకోవడానికి పట్టుపరుపులున్న మంచాలు కనిపించాయి. గదులు చాలా అందంగా అలంకరించి ఉన్నాయి. ప్రతి గదిలోకి వెళ్ళి క్షుణ్ణంగా చూశాడు విజయుడు.

ఇదేదో మాయామహల్‌లా ఉందనుకుంటూ బయటకు రాబోతుండగా చివరి గదిలోని మంచం మీద ఒక కప్ప కనిపించింది.

అంత పెద్ద మంచం మీద మనుషులు కాకుండా కప్ప కనబడడం విజయుడికి మరో వింతగా అనిపించింది. ఇది మనుషుల కోసం కట్టిన భవనం కాదేమో. ఇక్కడ ఉండడం ప్రమాదమేమో అనుకున్నాడు మనసులో. అక్కడ నుండి బయటకు నడవబోతుండగా ఎవరో పిలిచినట్లయింది. అయితే అది మానవ భాష మాత్రం కాదు. అది కప్ప భాష. మంచం మీదున్న కప్ప తనతో ఏదో చెప్పడానికి పిలిచినట్లు పోల్చుకున్నాడు. కప్ప దగ్గరకి వెళ్ళి 'నువ్వెవరు. ఒక్కదానివే ఎందుకున్నావిక్కడ?' అని అడిగాడు విజయుడు.

అప్పుడు ఆ కప్ప, 'నా కథ చెబుతాను. నేనెవరో నీకు తెలుస్తుంది!' అని చెప్పడం మొదలుపెట్టింది.

* * *

వాణీపురాన్ని వశీకరుడు అనే రాజు ప్రజలకు ఎటువంటి బాధలు కలగకుండా పరిపాలించేవాడు. అతడికి ఒక్కతే కుమార్తె. పేరు శశివదన. పేరుకి తగ్గట్టు ఆమె అందగత్తె. ఆమెకి పెళ్ళి వయసు రాగానే వివాహ ప్రయత్నాలు మొదలుపెట్టాడు రాజు. రాకుమారుల చిత్రపటాలు తెప్పించి పరిశీలించారు కానీ మహారాణికి వారెవరూ నచ్చలేదు. చాలాకాలం తర్వాత

మనసులోని మాట బయటపెట్టింది మహారాణి.

పావనరాజ్యానికి యువరాజయిన తన మేనల్లుడిని అల్లుడిగా చేసుకుందామని ఆమె చెప్పింది. రాకుమార్తె శశివదన కూడ సమ్మతించడంతో వివాహానికి తగిన ఏర్పాట్లు చేశాడు వశీకరుడు.

వివాహం జరుగుతున్న రోజు సాయంత్రం రాకుమార్తె శశివదన తన చెలికత్తెలను తోడు తీసుకొని తమ కులదేవత కాళికాదేవిని పూజించడానికి ఆలయానికి బయలుదేరింది. ఆలయమార్గంలో ఒక కాషాయవస్త్రధారి ఎదురయ్యాడు. అతడి ఎత్తు కేవలం మూడడుగులే ఉంది. మరుగుజ్జు రూపం. ఆయన రాకుమార్తెను ఆశీర్వదిస్తానని చెప్పడంతో చెలికత్తెలు శశివదనకి ఆ విషయం చెప్పారు. సహజంగా ఆమెకు సాధువుల మీద ఉన్న గౌరవంతో ఆశీర్వాదం తీసుకోవడానికి ఒప్పుకుంది. ఆమె మరుగుజ్జు పాదాలను తాకి నమస్కరిస్తుండగా జరిగిందొక విచిత్రం.

చెలికత్తెలు చూస్తుండగా శశివదన తల మీద ఆశీర్వదించడాని కన్నట్టుగా మరుగుజ్జు చేయి వేశాడు. అంతే, దట్టమైన పొగ చుట్టూ వ్యాపించింది. ఆ వాసన పీల్చిన చెలికత్తెలు మత్తులోకి జారిపోయారు. వాళ్ళు స్పృహలోకి తిరిగి వచ్చిన తర్వాత చూస్తే అక్కడ మరుగుజ్జు కానీ, రాకుమార్తె శశివదన కానీ లేరు. చెలికత్తెలు ఆందోళన పడుతూ పరుగున రాజభవనం చేరుకున్నారు. మరుగుజ్జు సాధువు ఎవరో రాకుమార్తెను ఆశీర్వదిస్తానంటే ఆమె ఆయన పాదాల ముందు వంగిన విషయం, వారు ఇద్దరూ మాయమైన విషయం చెప్పారు. రాజ్యం అంతటా విచారం అలుముకుంది.

అసలు ఆ మరుగుజ్జు ఎవరో, ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. కాషాయ వస్త్రాలు ధరించి వచ్చిన మంత్రగాడెవరైనా యువరాణిని మాయం చేసారేమో కూడ తెలియక మహారాజు అయోమయంలో పడ్డాడు.

కుమార్తె మాయమైన బాధలో ఉన్న మహారాజు మూడునెలలు వరకూ బయట ప్రపంచానికి కనిపించలేదు. ఆ తర్వాత మనశ్శాంతి కోసం ఒక మునుల ఆశ్రమం సందర్శించాడు. ఆశ్రమంలో మహారాజు వశీకరుడికి ఒక విషయం తెలిసింది.

తంత్రజ్ఞుడు అనే మరుగుజ్జు ఒక మాంత్రికుడి దగ్గర శిష్యుడిగా చేరి

అతడికి సేవలు చేసి ఆయన మెప్పు పొందాడు. దొంగతనంగా కొన్ని మంత్ర విద్యలు నేర్చుకున్నాడు. అవి నేర్చిన తర్వాత మరుగుజ్జుకి ఒక ఆశ పుట్టింది. అందరిలా పొడుగు పెరగాలనీ, అందంగా మారిపోయి గొప్ప అందగత్తెను పెళ్ళి చేసుకోవాలని కోరిక కలిగింది.

ఒకసారి మాంత్రికుడు సంతోషంగా ఉన్న సమయం చూసి తన మనసులో మాట చెప్పి తనకి మంత్రవిద్యలు నేర్పమని బతిమలాడాడు మరుగుజ్జు. ఆయన మీద జాలితో కొన్ని మంత్ర విద్యలు నేర్పి 'పదహారు మంది రాజకన్యలను తెచ్చి మహాశక్తికి బలి ఇచ్చి ఆమెను మెప్పిస్తే అతడు పొడుగరీ, అందగాడూ అవుతాడు,' అని చెప్పాడు మాంత్రికుడు.

మాంత్రికుడు నిద్ర పోతున్న సమయం చూసి అతడి మంత్రదండం దొంగిలించాడు. తరువాత అతడినే చంపేసాడు మరుగుజ్జు. మంత్రదండం సాయంతో తన విద్యలను మరుగుజ్జు ప్రయోగిస్తున్నాడు. అప్పటి నుండి రాజకన్యలను దొంగతనంగా ఎత్తుకెళ్ళి దాచేస్తున్నాడు. అయితే ఆయన మంత్రదండం కూడ ఈ మధ్యనే ఎక్కడో పడిపోయింది. మంత్రదండాన్ని నమ్మేబదులు మరో మార్గం దొరుకుతుందేమో అని ఆలోచించాడు. దుష్ట శక్తులకు మాత అయిన ఆమెను మెప్పించి తన కుడిచేతి చూపుడు వేలు చూపించి ఏది కోరితే అది జరిగేలా వరం పొందాడు.

రాబోయే కార్తీకపౌర్ణమి నాడు మహాశక్తికి పదహారుమంది కన్యలనూ బలి ఇచ్చేసి వరం పొందాలనుకున్నాడు మరుగుజ్జు. రాకుమార్తె శశివదనని తీసుకెళ్ళింది కూడా అతడే అని ఆశ్రమంలో చెప్పారు.

తన కుమార్తె శశివదనని బలి ఇవ్వడానికి మరుగుజ్జు తీసుకెళ్ళాడని తెలిసి మహారాజు వశీకరుడు కుమిలిపోయాడు. మనశ్శాంతి కోల్పోయి చిక్కి సగమై పోయాడు.

మహారాజు తిరిగి రాజ్యానికి చేరుకొని మరుగుజ్జు తంత్రజ్ఞుడిని పట్టుకోవడం కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. తంత్రజ్ఞుడి ఆచూకి తెలిపినా, శశివదనని రక్షించి తెచ్చినా మంచి బహుమానం ఇస్తానని తన రాజ్యమంతటా చాటింపు వేయించాడు.

శశివదనని తీసుకెళ్ళిన మరుగుజ్జు తంత్రజ్ఞుడు జంబూరదీవిలో ఒక

అందమైన భవంతి సృష్టించాడు. అందులో శశివదనని బంధించాడు. 'కార్తీక పౌర్ణమి మరో ఏడు నెలలుంది. ఆ రోజున నిన్ను మహాశక్తికి బలి ఇస్తాను. ఈ లోగా మరో పది హేనుమంది రాజకన్యలను ఎత్తుకొస్తాను. అంతవరకూ ఇక్కడే ఉండు,' అని ఆమెతో చెప్పాడు మరుగుజ్జు. రాకుమారి శశివదన పారిపోకుండా కప్పగా మార్చేసి ఆమెను మంత్రబంధనం చేశాడు. ఆమె మనుష్య రూపంలో ఉంటే ఎవరైనా మనుషులు చూసి రక్షించే అవకాశం ఉందని తంత్రజ్ఞుడి ఉద్దేశం.

మాసానికోసారి జంబూర దీవికి వచ్చి శశివదనని చూసి అతడు వెళుతుంటాడు. అలా వచ్చినప్పుడల్లా ఎవరో ఒక రాకుమార్తెను ఎత్తుకొస్తాడు మరుగుజ్జు. అలాంటప్పుడు అతడికి సంతోషం కలిగితే శశివదనని మనుష్య రూపంలోకి మారుస్తాడు. ఆహారం తినమని ప్రేమగా చెబుతాడు. తనకి సేవలు చేయమని అడుగుతాడు. నెల క్రితం వచ్చినప్పుడు 'మరో ఐదుగురు రాజకన్యలను ఎత్తుకొస్తే బలి తంతుకు సరిపోతుంది,' అని శశివదనతో చెప్పాడు.

మరుగుజ్జు తంత్రజ్ఞుడు చెప్పిన గడువు మరో నెల మాత్రమే ఉంది. ఈలోగా అతడికి మిగతా రాజకన్యలు దొరికి తనని బలి యిస్తాడేమో అని బెంగతో కుమిలి పోతోంది శశివదన. అయితే తన గోడు చెప్పడానికి ఎవరు కనిపిస్తారు గనక! జంబూరదీవిలో మనిషన్న వాడు అడుగు పెట్టలేదు. కప్ప భాష తెలిసిన వాళ్ళు వచ్చినప్పుడే తప్ప మరెవరు వచ్చినా శశివదనకి ప్రయోజనం లేదు. విజయుడు కనిబడినందుకు ఆమె ఎంతో సంబరపడింది. పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి ఆమెకు.

విజయుడు నిట్టూర్చాడు. ప్రపంచంలో స్వార్థం, పాపం పెరిగి పోతున్నాయి.

'దేవుడు ఏది చేసినా మన మంచికే చేస్తాడని అంటారు. తుఫాను వల్ల మా ఓడ మునిగిపోయినా నేను మాత్రమే బతికాను. బహుశా మిమ్మల్ని రక్షించే బాధ్యత కాళికామాత నాకు అప్పగించిందేమో! ఆ భయంకర తుఫాను అందుకే వచ్చిందేమో!. నువ్వు ధైర్యంగా ఉండు. నీతోబాటు మిగతావాళ్ళని కూడ రక్షించి మిమ్మల్నందరినీ మీమీ ఇళ్ళకు చేరుస్తాను,' చెప్పాడు విజయుడు.

'రాకుమారా! వాడికి చాల విద్యలు తెలుసు. వాడిని జయించడం చాల కష్టం,' అంది శశివదన.

దానికి విజయుడు 'రాకుమారీ! నువ్వు బెంగపడవద్దు. నా జాగ్రత్తలో నేను ఉంటాను. మిగతా రాజకన్యలెక్కడ? నువ్వు తప్ప ఇంకెవరూ ఈ భవనంలో నాకు కనబడలేదు,' అన్నాడు.

'వారిని కూడ ఏదో ఒక పురుగుగానో లేదంటే ఈగగానో మార్చేసి ఉంటాడు. అందరినీ ఒక రూపంలోకి మార్చినా మళ్ళీ మాలో మేం మాట్లాడుకొని తిరగబడతామని వాడికి భయం!' చెప్పింది శశివదన.

విజయుడు అక్కడే ఉండి మరుగుజ్జు తంత్రజ్ఞుడి రాకకోసం ఎదురు చూస్తూ మరో నాలుగు రోజులు గడిపాడు. అయిదోరోజు ఉదయాన్నే భవంతి నుండి బయటకు వచ్చి సముద్రపు ఒడ్డున నడవసాగాడు. ఈ రోజైనా పండ్లకి బదులు చేపలను వేటాడాలనుకున్నాడు. అలా వెళుతుండగా ఇసుకలో ఆడుకుంటున్న తాబేళ్ళు కనిపించాయి. అవి ఉన్నట్టుండి సముద్రం లోపలకు పరిగెత్తసాగాయి. ఒక పిల్ల తాబేలు పరిగెత్తలేక వెనక బడిపోయింది. దానికోసం తల్లి తాబేలు వెనక్కి వచ్చింది. పిల్లతాబేలు దగ్గరికి వెళ్ళి 'తొందరగా సముద్రం లోపలకి నడు. లేదంటే చనిపోతాం,' అంది.

పిల్ల తాబేలు ప్రశ్నార్థకంగా చూసి 'మనం నిన్న కూడా చాలా సేపు ఇక్కడ ఉన్నాం. ఈ రోజు ఎందుకలా అన్నావు?' అంది.

'ఈ రోజు మరుగుజ్జు తంత్రజ్ఞుడు రాబోతున్నాడు. వాడికి తాబేలు మాంసమంటే ఇష్టం. కనబడితే చంపి కూర వండించుకొని తింటాడు,' అంది తల్లి తాబేలు.

విజయుడికి మరుగుజ్జు మాంత్రికుడు భవంతికి వస్తున్నాడని అర్థం అయ్యింది. వెంటనే వెనుదిరిగి భవనం లోపలకి వెళ్ళాడు. కప్ప రూపంలోని శశివదనని కలిసాడు. మరుగుజ్జు మాంత్రికుడు వస్తున్నాడని చెప్పాడు. శశివదన భయపడుతూ 'ఈ రోజు ఎంత మంది రాజకన్యలను తెస్తున్నాడో. నాకు చావు దగ్గర పడిందేమో,' అంది.

'రాకుమారీ. భయపడవద్దు. నేను మిమ్మల్ని రక్షిస్తాను. మిమ్మల్ని తప్పించే ఉపాయం ఆలోచిస్తున్నాను,' అని చెప్పాడు విజయుడు. అపుడు గుర్తొచ్చింది. ముని తేజస్వి తనకిచ్చిన లేపనాన్ని తీసి కళ్ళకు పూసుకొని మరుగుజ్జు తంత్రజ్ఞుడిని తలచుకున్నాడు విజయుడు.

మరుగుజ్జు రూపం విజయుడి కళ్ళముందు ప్రత్యక్షమైంది. అంతే! తంత్రజ్ఞుడి కదలికలు, చేసిన పనులు కూడా కనిపించాయి. విజయుడికి అతడి మంత్రశక్తి రహస్యం బోధపడింది. మరుగుజ్జు తన కుడి చేతి చూపుడు వేలిలోనే శక్తులను దాచుకున్నాడు. ఆ వేలు చూపించి వాడు ఏది కావాలని కోరుకుంటే అది జరిగిపోతుంది. అంతే కాకుండా వాడి ప్రాణాలను కుడికాలి బొటనవేలులో దాచినట్లు గ్రహించాడు విజయుడు. ఆ వేలు నరికితే ప్రాణం పోతుందని అతడు తెలుసుకున్నాడు.

మరుగుజ్జు వాడికి చిక్కిన రాకుమార్తెలకు అసలు రూపం తెప్పించి తల్లిదండ్రుల దగ్గరకు పంపించడం తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు విజయుడు. తంత్రజ్ఞుడిని ఎలాగో మభ్యపెట్టి వాడి దగ్గర నుండి రాకుమార్తెల వివరాలు తెలుసుకుని వాళ్ళకి మేలు చెయ్యాలనుకున్నాడు. వెంటనే తన వేషం మార్చుకున్నాడు విజయుడు. అడవుల్లో తిరిగే కొండజాతి మనిషిలాగా తయారై ఆకులు దట్టంగా తన ఒంటికి చుట్టుకున్నాడు. భవంతి బయట ఉన్న తోటలో పడుకున్నాడు అతడు.



మరికొంత సేపటికే గాలిలో తేలుతూ వచ్చాడు మరుగుజ్జు తంత్రజ్ఞుడు. తోటలో ఉన్న విజయుడిని చూశాడు. తన రహస్య స్థావరంలో అడవిమనిషి ఉన్నాడని గ్రహించి అతడు కంగారు పడ్డాడు. విజయుడి ముందు నిలబడి 'ఎవరు నువ్వు? ఇక్కడికెలా వచ్చావు?' అని అడిగాడు మరుగుజ్జు.

'నేను శతశృంగం పర్వత ప్రాంతానికి చెందిన వాడిని. సముద్రంలో చేపల వేటకు పడవ మీద వెళ్ళాను. హఠాత్తుగా వచ్చిన తుఫాను దెబ్బకి నా పడవ నీటిలో మునిగిపోయింది. అప్పుడు నా చేతికి దొరికిన కర్రను పట్టుకొన్నాను.అది ఇక్కడకు తెచ్చి పడేసింది. ఇంతవరకూ ఒక్క మనిషీ కనబడలేదు. ఎంతో భయపడ్డాను. నువ్వు దేవుడు పంపిన దూతలా వచ్చావు. నాకు ఆకలిగా ఉంది. తినడానికి ఏదైనా ఇవ్వగలవా? నీకు సేవలు చేసి ఋణం తీర్చుకుంటాను,' అన్నాడు విజయుడు.

మరుగుజ్జు తంత్రజ్ఞుడు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ అడవి మనిషి నుండి తనకు వచ్చిన ప్రమాదం లేదని అనుకున్నాడు.

'నువ్వు ఏమి తినాలనుకుంటే దానిని రప్పిస్తాను. నేను గొప్ప మాంత్రికుడిని. నాతో భవనం లోకి రావోయ్!' అంటూ చెప్పి విజయుడిని తనతో భవనం లోపలికి తీసుకువెళ్ళాడు మరుగుజ్జు.

విజయుడు అడిగిన ఆహార పధార్థాలు, వంటకాలు క్షణాల్లో సృష్టించి అతడు ఇచ్చాడు. వాటిని కొద్దికొద్దిగా రుచి చూసి 'మీరు నా అన్నదాత. మీరూ తినండి,' అని మర్యాద కోసం తినమన్నాడు విజయుడు. మరుగుజ్జువాడు బాగా తిని భుక్తాయాసం అనుభవిస్తున్న సమయం చూసి 'ఇలాంటి సమయంలో మత్తుపానీయం తాగితే భలే ఆనందమిస్తుంది,' అన్నాడు విజయుడు. మరుగుజ్జు వాడు గాల్లోకి వేలు చూపించి ఒక పాత్ర నిండా మత్తుపానీయం సృష్టించాడు.

అంతే కాదు, తన మంత్రశక్తుల రహస్యాలు వివరించాడు.

ఆ పానీయాన్ని మరుగుజ్జుతో పీకలదాకా తాగించాడు విజయుడు. మరుగుజ్జుకు పూర్తిగా మైకం కమ్మింది. ఆ సమయం కోసమే చూస్తున్న విజయుడు వాడి కుడిచేతి చూపుడువేలు గాలిలోకి చూపిస్తూ 'ఈ భవనంలో వేరువేరు రూపాల్లో ఉన్న రాకుమార్తెలంతా వారి నిజరూపాల్లోకి మారాలి. నా ముందు నిలబడాలి,' అని మనసులో అనుకొని 'తంత్రం చెప్పిందే మంత్రం.

మంత్రం కావాలి సఫలం' అన్నాడు.

మరుగుజ్జు తంత్రజ్ఞుడిని మైకంలోకి పంపించి ఏది కావాలో మనసులో అనుకొని 'తంత్రం చెప్పిందే మంత్రం. మంత్రం కావాలి సఫలం' అని పలికితే కోరుకున్నది జరుగుతుందని అంతకు ముందే తెలుసుకున్నాడు విజయుడు. విజయుడు కోరుకున్న వెంటనే పది మంది రాజకన్యలూ ఆయన ఎదురుగా వచ్చి కనిపించారు. రాకుమార్తెలంతా అందగత్తెలే. మరొక ప్రక్క మరుగుజ్జు తంత్రజ్ఞుడు చెప్పింది అబద్ధం కాదని సంతోషించాడు. ఇక రాకుమార్తెల ఆనందానికి అంతు లేకుండా పోయింది.

'మళ్ళీ ఇలా మా అసలు రూపం చూస్తామనుకోలేదు,' అని విజయుడుకి కృతజ్ఞతలు చెప్పారు రాకుమార్తెలు.

వాళ్ళని వారించి 'మనం ఎక్కువ సమయం వృధా చేయకూడదు. తంత్రజ్ఞుడు మైకంలో ఉన్నప్పుడే మనం అనుకున్న పనులన్నీ పూర్తి చేసుకోవాలి. మిమ్మల్నందరినీ మీమీ ఇళ్ళకి పంపిస్తాను. మీరంతా సిద్ధంగా ఉండండి,' అని రాజకన్యలతో చెప్పాడు విజయుడు.

దానికి రాజకన్యలు 'రాకుమారా. మీ మేలు జన్మజన్మలకీ మరవలేం. మా తల్లిదండ్రులను చూడాలని తహతహలాడుతున్నాం. మా కోసం వారందరూ బెంగతో ఎదురు చూస్తూ ఉంటారు,' అన్నారు.

విజయుడు మరోసారి మరుగుజ్జు వాడి వేలు పట్టుకొని రాజకన్యలంతా వారివారి సొంత ఇళ్ళకు చేరాలని కోరుకొని 'తంత్రం చెప్పిందే మంత్రం. మంత్రం కావాలి సఫలం' అని మంత్రం చెప్పాడు. వాళ్ళంతా మాయమై పోయారు. వాళ్ళని చాలా తేలికగా రక్షించ గలిగినందుకు సంతోషపడ్డాడు. తన తరువాతి కర్తవ్యం జ్ఞాపకం వచ్చింది విజయుడికి.

ఈసారి మరుగుజ్జు వాడి వేలు చూపించి, 'మేం ఇద్దరం మహతిపురం అడవుల్లో ఉన్న ముని గౌతముడి ఆశ్రమం దగ్గరకు వెళ్ళాలని మనసులో కోరుకొని 'తంత్రం చెప్పిందే మంత్రం. మంత్రం కావాలి సఫలం' అన్నాడు. అంతే! వారిద్దరూ మహతిపురం అడవులు చేరుకున్నారు.

విజయుడు తన ఖడ్గాన్ని తీసి వాడి కుడి కాలి బొటనవేలుని ఒక్క దెబ్బకి ఖండించాడు. అప్పటికి ఇంకా మరుగుజ్జు మాంత్రికుడు మైకంలోనే

ఉన్నాడు. కిందపడి గిలగిల కొట్టుకొని ప్రాణం వదిలాడు. మరుగుజ్జు వాడి శవాన్ని దూరంగా ఈడ్చుకెళ్ళి పొదల్లోని జంతువులకి ఆహారంగా పడేసి దగ్గరలోని వాగులో స్నానానికి దిగాడు విజయుడు.

* * *

కొంత దూరంలో ఒక పర్ణశాల కనిపించింది విజయుడికి. అక్కడ చాల ప్రశాంతంగా ఉంది. పులి చర్మం ఆసనంగా చేసుకుని తపస్సు చేసుకుంటున్న మునిని దూరం నుండే చూశాడు విజయుడు. అతడే గౌతముడని భావించాడు విజయుడు. మునికి కొంచెం దూరంలో కూర్చొని ఆయన కళ్ళు తెరిస్తే తన పరిచయం చెప్పాలనుకున్నాడు విజయుడు. అలా రెండు రోజులు గడిచినా ముని కళ్ళు తెరవలేదు. విజయుడు కూడ అక్కడ నుండి కదల్లేదు. తాను ఎక్కడికైనా వెళితే ఆ సమయంలోనే ముని కళ్ళు తెరుస్తాడనీ, మాట్లాడే అవకాశం పోతుందనీ భావించి విజయుడు కదలకుండా అక్కడే ఉండిపోయాడు.

మూడవ రోజున కళ్ళు తెరిచాడు ముని. 'గౌతమ మునీంద్రులకు వందనాలు,' ఆయన కాళ్ళ మీద పడి నమస్కారం చేసాడు.

'ఎవరు నాయనా నువ్వు? నేను గౌతముడిని కాదు,' అని చెప్పాడు ముని. అప్పుడు విజయుడు తన గురించి చెప్పి తాను ముని గౌతముడిని కలవాలన్న విషయం చెప్పాడు.

'నాయనా! ఇక్కడున్న ప్రశాంత వాతావరణానికి ముచ్చట పడి ఎందరో మునులు తపస్సు చేసుకునేందుకు స్థిర పడిపోయారు. చాలా దూరం వరకూ వ్యాపించిన ఈ అరణ్యం నిండా ఎందరో మునులు కనిపిస్తారు. ఇదొక పుణ్యభూమి. ఇదే అరణ్యంలో వేరొక చోట గౌతముడి గురించి ప్రయత్నించు నాయనా!' అని చెప్పి తిరిగి తపస్సులో మునిగిపోయాడు ఆ ముని.

ముని గౌతముడిని చేరడమెలా అని ఆలోచించాడు విజయుడు. తేజస్వి నుండి స్వీకరించిన లేపనం గుర్తుకు వచ్చింది. తన కనురెప్పల మీద లేపనం తాకించి ముని గౌతముడిని తలచుకున్నాడు. అతడికి ముని గౌతముడున్న ప్రదేశం స్పష్టంగా కనిపించింది.

ముని గౌతముడు ఒక మహా మర్రి వృక్షం చెంతనున్న కుటీరంలో



ఉన్నాడు. కుటీరం పక్కనే జంట రావిచెట్లు ఒక దానినొకటి పెనవేసుకొని కనిపించాయి. ముని గౌతముడు తపస్సులో కనిపించాడు. ఆయన రూపం మనసులో ముద్ర వేసినట్టు గుర్తుపెట్టుకున్నాడు విజయుడు.

పర్ణశాలను వెతుకుతూ వెళ్ళిన విజయుడికి ఒక పూట తర్వాత అవే గుర్తులున్న ప్రదేశంలో ఆశ్రమం కనిపించింది. మునిని చూసి ఆయనే గౌతముడని పోల్చుకున్నాడు.

అదృష్టవశాత్తూ విజయుడు వెళ్ళేసరికి గౌతముడు తపస్సు నుండి బయట పడ్డాడు. ఆయనకి నమస్కరించాడు విజయుడు. తన పరిచయం చేసుకొని తాను వచ్చిన పని వివరించాడు.

ముని గౌతముడు చాల ప్రశాంతవదనంతో విజయుడి వైపు చూసాడు. 'రాకుమారా! శ్వేతకేతుడు నాకు మిత్రుడే. కానీ ఇప్పుడతడు భూలోకంలో లేడు. అతడిని నువ్వు కలవడం అసంభవం!' అన్నాడు ఆయన.

విజయుడు చాలా ఆందోళన చెందాడు. 'మునీంద్రా! భువనదేశపు సమస్యని పరిష్కరించడం నా తక్షణ కర్తవ్యం. ఆ ముని భూలోకంలో లేడని చెబుతున్నారంటే ఆయన తన తపోశక్తితో స్వర్గాన్ని చేరారా?' అని తిరిగి అడిగాడు అతడు.

'నాయనా! నువ్వు ఊహించింది కొంతవరకూ సరిపోయింది. అయితే ఆయన స్వర్గలోకంలో లేడు. మరో లోకంలో ఉన్నాడు. అదే ఆనందలోకం,' చెప్పాడు గౌతముడు.

'మునీంద్రా! సప్తలోకాలున్నాయని తెలుసును. భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం, మహాలోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం అని విన్నాను. అందులో ఆనందలోకం లేదు కదా. మరి ముని శ్వేతకేతుడు అక్కడికెలా వెళ్ళారు? దయచేసి వివరిస్తారా?' అని అడిగాడు విజయుడు.

గౌతముడు నవ్వుతూ 'రాకుమారా నువ్వు చెప్పింది యథార్థమే. ఏడులోకాల్లో ఆనందలోకం లేదు. కానీ అది ఆయన సృష్టించిన లోకం. ఇప్పుడాయన ఆనందలోకంలో ఉన్నారు,' అని చెప్పాడు.

విజయుడు మరింత ఆశ్చర్యపోతూ 'లోకాన్ని మునులు సృష్టించడమా? వింతగా ఉంది. జగత్తుని సృష్టించేది దేవుడు కదా,' అన్నాడు.

'రాకుమారా! పురాణాల్లో త్రిశంకు స్వర్గం అని ఒకటుంది. దాని గురించి విన్నావా?' అడిగాడు గౌతముడు.

'మునీంద్రా! త్రిశంకు స్వర్గాన్ని మహర్షి విశ్వామిత్రుడు సృష్టించాడని పురాణాలు చెబుతున్నాయి. త్రిశంకుడిని స్వర్గానికి పంపించడానికి విశ్వామిత్రుడు తన తపోఫలాన్ని పోగొట్టుకున్నాడు' అని చెప్పాడు.

'సరిగ్గా చెప్పావు రాకుమారా. నువ్వు చెప్పిన పురాణ కథలో మాదిరిగానే శ్వేతకేతుడి ప్రియశిష్యుడు పిప్పలాదుడు స్వర్గానికి సశరీరుడై వెళ్ళాలని గురువుని కోరాడు. పిప్పలాదుడు ఆయనకి అత్యంత ప్రియమైన శిష్యుడు కావడం వల్ల శ్వేతకేతుడు అతడి కోరిక తీర్చాలనుకున్నాడు. తన తపోఫలంతో పిప్పలాదుడిని స్వర్గానికి పంపించాడు. దేవతలకు, ఇంద్రుడికి అది నచ్చలేదు. వారు విపరీతమైన కోపం తెచ్చుకొని అతడిని అడ్డుకొన్నారు. స్వర్గంలోకి పిప్పలాదుడిని అడుగుపెట్ట నివ్వలేదు. దాంతో పిప్పలాదుడు కిందకు జారి పడడం

మొదలయింది. జరగబోయే ప్రమాదాన్ని గ్రహించాడు శ్వేతకేతుడు. అతడు కింద పడితే జరగబోయేదానిని ముందుగానే ఊహించిన శ్వేతకేతుడు తన శిష్యుడిని కాపాడదలిచాడు. పిప్పలాదుడి కోరిక తీర్చడానికి స్వర్గాన్ని తలదన్నేలా మరొక లోకాన్ని సృష్టించాడు. అదే ఆనందలోకం. పిప్పలాదుడిని ఒక్కడిని మాత్రమే కాకుండా తనకి ప్రియమైన శిష్యులను మరికొందరిని కూడ అక్కడికి పంపించాడు శ్వేతకేతుడు,' అని చెప్పాడు.

అదంతా ఆశ్చర్యంగా విన్నాడు విజయుడు. 'మునీంద్రా! నేను ముని శ్వేతకేతుడిని కలవాలి. శాపవిమోచన గురించి తెలుసుకోవాలి,' అని చెప్పాడు.

'రాకుమారా! నీ కోరిక సమంజసమైనదే. నువ్వు కూడా పరోపకారం కోసమే కదా అక్కడకు వెళ్ళాలని అనుకుంటున్నావు. కానీ అక్కడికి ఎలా వెళ్ళగలవు? ఆకాశమార్గాన ప్రయాణం చేసేందుకు వాహనం ఎలా సంపాదించగలవు?' అడిగాడు గౌతముడు.

'మునీంద్రా! నేను ఆనందలోకాన్ని చేరేందుకు ఏదో ఒక పద్ధతి వాడుకుంటాను. అది నాకు సమస్య కాదు,' అన్నాడు విజయుడు.

గౌతముడు 'అయితే నేను ఇప్పుడే శ్వేతకేతుడితో మాట్లాడి నీ రాక గురించి తెలియపరుస్తాను. ఆయన సమ్మతిస్తే సరే. ఆయన అనుమతి లేనిదే నువ్వు ఆనందలోకంలో అడుగు పెట్టలేవు,' అని చెప్పి తపోదీక్షలోకి వెళ్ళాడు గౌతముడు. తన తప:శక్తితో ఆనందలోకంలో ఉన్న శ్వేతకేతుడికి విజయుడి రాక తెలిపి అనుమతి తీసుకుని విజయుడికి ఆ విషయం చెప్పాడు. గౌతముడికి కృతజ్ఞతలు చెప్పి అక్కడ నుండి బయలుదేరాడు విజయుడు.

విజయుడికి ఆనందలోకానికి వెళ్ళేందుకు వాహనం ఎలా సంపాదించాలో చటుక్కున తోచింది. వెంటనే కామధేనువుని మనసులో తలచుకున్నాడు. అతడి ఎదురుగా కామధేనువు ప్రత్యక్షమయింది. విజయుడు నమస్కరించి 'మాతా! ఆనందలోకం వెళ్ళడానికి నాకు గాలిలో ఎగిరే మంచి గుర్రాన్ని ప్రసాదించు,' అని కోరుకున్నాడు.

అప్పుడు కామధేనువు 'రాకుమారా! నువ్వు కోరినట్టుగా ఒక్క గాలిలోనే కాకుండా, భూమిపైనా, నీటిలోనూ ప్రయాణం చేసేందుకు పరిస్థితిని బట్టి తనని తాను తీర్చిదిద్దుకునే శక్తి ఉన్న పంచకల్యాణిని ప్రసాదిస్తున్నాను. నువ్వు

లోకకళ్యాణానికి కంకణం కట్టుకున్నవాడివి కాబట్టి మహాశక్తివంతమైన ఖడ్గాన్ని కూడ ప్రసాదిస్తున్నాను. నీకు శుభం జరుగుగాక!' అని కరుణించి అంతర్ధానమయింది. మరుక్షణం అతడి చేతిలో జిగేల్‌మని మెరుస్తున్న ఖడ్గం ప్రత్యక్షమైంది. అతడికి ఎదురుగా అందమైన, బలమైన తెల్లటి గుర్రం కనబడింది.

'నాయకా! నేను సిద్ధం. ఎక్కడికి వెళ్ళాలో చెబితే మీ అవసరానికి సరిపడే విధంగా నా రూపం మార్చుకుంటాను,' అంది గుర్రం.

'నేను నీటిలో ప్రయాణం చెయ్యాలనుకుంటే నీరూపం ఎలా మారుస్తావు?' అని అడిగాడు విజయుడు, ఆ పంచకల్యాణిని పరీక్షింపదలచి.

అప్పుడు ఆ గుర్రం 'అలాగే నాయకా! ఇప్పుడే నా రూపం మార్చి చూపిస్తాను,' అని తన రూపం మార్చింది. దాని కాళ్ళ కింద భాగంలో డెక్కలకి బదులు బాతు కాళ్ళలా ఆకారం మారింది. నీటి నుండి గుర్రాన్ని రక్షించేందుకు ఒక తొడుగు దాని శరీరం మొత్తాన్ని కప్పేసింది. దాని మూపురం దగ్గర ఒక గూడు లాంటిది పైకి వచ్చి దాని రౌతుని నీటికి తడవకుండా రక్షించేటట్టు ఏర్పడింది.

విజయుడి సందేహం తీరింది. గుర్రం దగ్గరికి వెళ్ళి 'చాలా బాగుంది నీ రూపం. ప్రస్తుతం నేను ఆకాశమార్గంలో ఆనందలోకం వెళ్ళదలిచాను. నన్ను ఆనందలోకం తీసుకెళ్ళు,' అని చెప్పి దాని మీద కూర్చున్నాడు. మరుక్షణం గుర్రానికి రెండు వైపులా రెక్కలు మొలిచాయి. గుర్రం కొంచెం దూరం నేల మీద పరుగుపెట్టి వేగం అందుకోగానే గాలిలోకి లేచి పక్షిలా దూసుకుపోవడం మొదలుపెట్టింది.

* * *

మేఘాలలో ప్రయాణిస్తున్న విజయుడి గుర్రం వేగంగా వెళుతోంది. మబ్బులన్నీ చెల్లాచెదురయి దారి ఇస్తున్నాయి. చల్లటి గాలి వీస్తూ ఆహ్లాదంగా ఉంది విజయుడికి. ఆకాశ ప్రయాణం వింత అనుభూతిని ఇస్తూండగా గుర్రం వేగం ఒక్కసారి మందగించింది. ఏమయి ఉంటుందో విజయుడికి అర్థం కాలేదు. ఎదురుగా చూశాడు. అక్కడ నీలి రంగులో పర్వతాన్ని పోలినట్టున్న



ఆకారం కనిపించింది. మరికాస్త దగ్గరగా వెళ్ళేసరికి అది పర్వతం కాదని ఒక వింతజీవి అని పోల్చుకున్నాడు. అది చేతులు బార్లా చాపి విజయుడి గుర్రాన్ని అడ్డగించింది.

'ఎవరు నువ్వు?' అడిగింది ఆ ఆకారం.

విజయుడు అటువైపు పరీక్షగా చూశాడు. పెద్దపర్వతంలా ఉన్న ఆకారానికి మనుషుల్లాగే రెండు కళ్ళు కాకుండా ఒక్కోవైపు నాలుగేసి చొప్పున్న తలకి వెనుకా, ముందూ కలిపి ఎనిమిది కళ్ళున్నాయి. చేతులు రెండు కాకుండా ఒక్కోవైపు ఆరేసి పొడువైన చేతులున్నాయి. రెండు కాళ్ళు ఏకంగా పెద్ద పెద్ద మర్రి వృక్షాలను గుర్తు తెచ్చేలా ఉన్నాయి. ముక్కు వింతగా పక్షి ముక్కులా ఉంది. నాలుక పాము నాలుకలా సాగి ఉంది. ఆకాశంలోని జీవి గాలిలోనే మేఘాల మీద నిలబడి విరగబడి నవ్వింది. ఆ నవ్వుకి పెద్ద శబ్దం వచ్చింది.

ఆ వింత ఆకారాన్ని చూడగానే విజయుడికి కోపం వచ్చి యుద్ధానికి సిద్ధమని చెబుతూ కత్తి తీశాడు. 'మానవా! కోపం వలదు. నువ్వెవరో చెప్పు,' అని అడిగింది వింత ఆకారం.

'నువ్వెవరివి? నా దారికి అడ్డొచ్చింది చాలక నన్నే ప్రశ్నిస్తున్నావా?' కోపంగా అడిగాడు విజయుడు.

ఆ వింత జీవి 'నా పేరు మేఘరక్షకుడు. ఈ మార్గంలో వెళ్ళేవారిని గమనించి చెప్పమని నన్ను ముని శ్వేతకేతులవారు నియమించారు. ఆయన అనుమతి లేనిదే ఎవ్వరూ ముందుకి వెళ్ళలేరు,' అని చెప్పి 'మరి నువ్వెవరో చెప్పు మానవా!' అడిగింది వింతజీవి.

అప్పుడు విజయుడు తన గురించి చెప్పాడు. ముని శ్వేతకేతుడిని కలవడానికి వెళుతున్నట్లు అందుకు ఆయన అనుమతి పొందినట్టు కూడ చెప్పాడు. అప్పుడా వింతజీవి 'నువ్విక్కడే ఉండు. నేను ఘడియలో వెళ్ళి మునికి చెప్పి తిరిగి వస్తాను,' అని మాయమైంది.


కళ్ళుమూసి తెరిచినంత తొందరగా తిరిగి విజయుడి ముందు ప్రత్యక్షమై 'మానవా! ముని ఆజ్ఞ అయింది. ముందుకు వెళ్ళు,' అని దారి ఇచ్చింది.

పంచకల్యాణి మళ్ళీ ఎగురుతూ వెళ్ళింది. ఇక ఎటువంటి ఆటంకాలు లేకుండానే ఆనందలోకం చేరుకున్నాడు విజయుడు.

స్వర్గలోకాన్ని తలదన్నేలా ఉంది ఆనందలోక వాతావరణం. వెన్నెల చల్లదనాన్ని మరిపించేలా ఆహ్లాదంగా ఉంది అక్కడి వెలుగు. వృక్షాలు మరీ అంత ఎత్తుగా కాకుండా అరటి చెట్లులా ఉన్నాయి. వృక్షాలు ఆకుపచ్చగా ఉన్నప్పటికీ ఆకులు మాత్రం మరీ పెద్దగా బంగారు రంగులో దర్శనమిచ్చాయి. ఆ చెట్లకి పూసిన పువ్వులు కొత్త కొత్త రంగులలో హరివిల్లులా ఒంపులు తిరిగి సువాసనలు వెదజల్లుతున్నాయి. ఆ వాసనకి తెలియని హాయి కలిగింది విజయుడికి. అతడలా అనుభూతి చెందుతుండగా ఎదురుగా ఎవరో పిలిచినట్లయింది. అప్పటికి పంచాకల్యాణి కూడ ఎగరడం ఆపి నిలబడింది.

ఎదురుగా ఒక సీతాకోకచిలుక కనిపించింది. అది తన గుర్రానికి సమానమైన ఎత్తులో ఉంది. విజయుడు ఆశ్చర్యంతో చూస్తుండగా సీతాకోకచిలుక 'మానవా! మీ లోకంలోని గుర్రానికి ఇంతవరకే ప్రవేశం. ఆనందలోకంలో ఎక్కడికి వెళ్ళాలన్నా మేమే తీసుకువెళతాం. నువ్వు ఎక్కడికి వెళ్ళాలో చెప్పు,' అని అడిగింది.

విజయుడు తన పంచకల్యాణిని అక్కడే ఆపి కిందకు దిగి సీతాకోకచిలుక మీద కూర్చున్నాడు. 'నేను ముని శ్వేతకేతులవారిని కలవడానికి వచ్చాను. వారి దగ్గరకి నన్ను తీసుకెళ్ళు,' అని కోరాడు.



'అలాగే మానవా. నిన్ను ముని శ్వేతకేతుడి దగ్గరకి చేరుస్తాను,' అని చెప్పి సీతాకోకచిలుక ఎగరసాగింది. ఒక పెద్ద వృక్షం కిందున్న గుహలో నుండి బయటకు వచ్చింది. అక్కడ ఎందరో మునులు ఉన్నారు. వారంతా తపస్సు చేసుకుంటున్నారు. వారి మధ్య నుండి ఎగురుతూ ఇంకా ముందుకి వెళ్ళింది సీతాకోక చిలుక.

'మా లోకంలో సీతాకోక చిలుకలు చిన్నవిగా ఉండి కోమలంగా ఉంటాయి. నువ్వు ఇంతపెద్దగా ఉన్నావు. బలంగా ఉన్నావు. ఆశ్చర్యంగా ఉంది నాకు. మీ లోకంలో ఇంకేమి విశేషాలు ఉన్నాయో నాకు చెబుతావా?' అన్నాడు.

'ఇది ముని శ్వేతకేతుడు సృష్టించిన లోకం. పేరుకి తగినట్టు ఇక్కడంతా ఆనందమే తప్ప కష్టాలు తెలియవు. ఇక్కడ ఏదీ భూలోకంలో ఉన్నట్టు కానీ, స్వర్గలోకంలో ఉన్నట్టు కానీ ఉండదు. ఇక్కడకి వచ్చినవాళ్ళు మరెక్కడికీ వద్దు, ఈ లోకంలోనే ఉంటామని కోరేటంతగా ముని సృష్టి చేసారు,' అంది సీతాకోక చిలుక.

ఇక్కడి పులులు, సింహాలు సాధు జంతువులు. ఇక్కడ పుట్టిన లేడి, జింక, గుర్రం, కుక్క లాంటివి అసలు పరుగెత్తలేవు. నెమ్మదిగా నడిచి వెళతాయి. కాకికి అందమైన గాత్రం, కోకిలలా పాటలు పాడే శక్తిని ఇచ్చారు ఆయన. నెమలిలా నాట్యం చేసే శక్తిని బాతుకి కలిగించాడు. ఇక్కడి చెట్లు అందరిలాగే మాట్లాడతాయి. ఎక్కడికైనా తమకి నచ్చిన చోటుకి నడిచి వెళ్ళిపోతాయి. ఇక్కడున్నవన్నీ వింతలే. అందరికీ ఆనందాన్ని ఇచ్చేవే!' అని చెబుతుండగా మరో పెద్ద చెట్టు కనిపించింది. ఆ చెట్టు కిందకి వెళ్ళి ఆగింది సీతాకోకచిలుక. అతడనుకున్నట్టు అది చెట్టు కాదు. చెట్టుని తలపించేలా నిర్మించిన పర్ణశాల. అక్కడ ఎత్తైన ఆసనం మీద కూర్చొని తాళపత్ర గ్రంధాన్ని చూస్తున్నాడు ఒక ముని.

ఆయనే శ్వేతకేతుడు. 'దిగు మానవా,' అంది సీతాకోకచిలుక.

విజయుడు కిందకు దిగి తన పాదరక్షలు తొలగించి మునిని సమీపించి పాదాభివందనం చేసాడు. శ్వేతకేతుడు తన పని ఆపి విజయుడిని దీవించి అతడి గురించి తెలపమన్నాడు.

విజయుడు తన గురించి చెప్పి భువనదేశపు సమస్యకి పరిష్కారం కోసం వచ్చినట్టు చెప్పాడు. ప్రస్తుతం భువనదేశపు ప్రజలు కరువుకాటకాలతో ఎంతగా బాధపడుతున్నారో చెప్పాడు. ఆకలి చావుల గురించి చెప్పాడు. అలాగే భువనదేశపు రాజు మానసిక వ్యాధితో మరణించిన విషయం కూడ చెప్పాడు. పరిపరివిధాల ప్రాధేయపడి వారి దుర్భర పరిస్థితికి శాపవిమోచన చెప్పమన్నాడు.

విజయుడు తనని కలవడానికి పడిన శ్రమ, ఆయన కఠోరదీక్షనూ గ్రహించి సంతసించాడు ముని శ్వేతకేతుడు.

'రాకుమారా! నీ పట్టుదల చూస్తుంటే ముచ్చటవేస్తోంది. నీ శ్రమను గుర్తించాను. శాపం పొందిన రాజు పులస్త్యుడు చనిపోయాడు కాబట్టి భువనదేశపు కరువు నివారించేందుకు నీకు మార్గం చెబుతాను,' అని మాట ఇచ్చాడు శ్వేతకేతుడు.

తన పక్కనున్న బంగారు కుండలో కుడి చెయ్యి పెట్టి చెంబుడు నీరు తీసి మరో బంగారుపాత్రలో పోసాడు. ఆ నీటిని మంత్రించి విజయుడికి ఇచ్చాడు. 'నువ్వు ఈ జలం తీసుకెళ్ళి భువనదేశం భూభాగమంతా జల్లు.

మంత్రించిన జలప్రభావంతో నా శాపం తీరిపోతుంది. ఇకముందు కరువు కాటకాలు ఉండవు. మామూలుగానే వర్షాలు పడతాయి. నదులు పారతాయి,' అని చెప్పాడు.

విజయుడుకి సందేహం వచ్చింది. చిన్నపాత్రతో జలం భువనదేశం మొత్తం భూమిపై జల్లడానికి సరిపోతుందా అనుకున్నాడు. ఆ విషయం గ్రహించాడు శ్వేతకేతుడు. 'రాకుమారా! ఈ జలం సరిపోదని భావించవద్దు. నా మంత్ర ప్రభావం వల్ల ఎంత జల్లుతున్నా పాత్రలో జలం ఇంకా మిగిలే ఉంటుంది. మిగిలిన దానిని మరెక్కడైనా వర్షం కురవని ప్రదేశాలుంటే అక్కడ జల్లితే ఈ జల ప్రభావం వల్ల ఆ ప్రాంతంలో కూడా వానలు కురుస్తాయి,' అని చెప్పాడు.

విజయుడు ఆ పాత్రను తన సంచిలో భద్రపరచుకుని మళ్లీ సీతాకోక చిలుక ఎక్కాడు. అది అతడిని పంచకల్యాణి ఆగిన ప్రదేశంలో వదిలింది. విజయుడు పంచకల్యాణిని ఎక్కగానే అది గాలిలో ఎగురుతూ భువనదేశం కోటలో దిగింది.

అప్పటికి భువనదేశపు పరిస్థితిలో ఇంకా చాల మార్పు వచ్చింది. వర్షాలు లేక భూమి వేడెక్కిపోయి మనుషులు బతకలేకపోతున్నారు. ఆహారధాన్యాలు సరఫరా చేయగలుగుతున్నా పచ్చని మొక్కలు లేక వేడిని మనుషులు భరించలేక పోతున్నారు. అలాంటి సమయంలో విజయుడు ఆ రాజ్యపు యువరాజు ధర్మతేజుడిని కలుసుకున్నాడు. విజయుడిని చూసిన ధర్మతేజుడు సాదరంగా ఆహ్వానించి కుశలం అడిగాడు.

శ్వేతకేతుడిని తాను కలుసుకున్నట్టు చెప్పి రాజ్యంలోని కరువు పరిస్థితికి శాపవిమోచన మార్గం తెలుసుకుని వచ్చినట్టు చెప్పాడు విజయుడు. ముని ప్రసాదించిన జలంతో రాజ్యానికి మంచి రోజులు రాబోతున్నట్టు కూడా చెప్పాడు. ధర్మతేజుడు ఆ మాటలు విని సంతోషించాడు.

'మీ మేలు మరువలేక పోతున్నాను రాకుమారా! మీరు వీలయినంత త్వరగా భువనదేశపు భూమి మీద ఆ పవిత్ర మంత్ర జలాన్ని జల్లండి,' అని కోరాడు ధర్మతేజుడు.

విజయుడు అక్కడి నుండే జలాన్ని జల్లడం ప్రారంభించాడు. తర్వాత ఎగిరే గుర్రాన్ని ఎక్కి గాలిలో భువనదేశం మొత్తం తిరిగి ఒక్క పూటలో జలాన్ని

జల్లేశాడు. విజయుడు తిరిగి కోటకి చేరేసరికి ఆకాశంలో మబ్బులు కమ్ముకొని వాతావరణంలో మార్పు కనిపించింది. చూస్తుండగానే పెద్ద వర్షం ప్రారంభమైంది. అలా మొదలైన వర్షం కుంభవృష్టిగా కురిసింది. వరసగా మూడు రోజులు వాన కురిసింది. నదులన్నీ ఎప్పటిలా నీటితో నిండి ప్రవహించాయి. రాజ్యానికి పట్టిన కరువును వరదలా వచ్చిన వాన నీరు కడిగేసింది. భువనదేశపు ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. భూమి చల్లబడింది. ప్రజల హృదయాలు చల్లబడ్డాయి.

యువరాజు ధర్మతేజుడు తన దేశానికి పట్టిన భయంకరమైన శాపాన్ని వదిలించినందుకు విజయుడి పట్ల కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు. 'రాకుమారా! మా దేశపు సమస్య తీర్చిన వారికి మా సోదరి విజయలక్ష్మినిచ్చి వివాహం జరిపించి అర్ధరాజ్యమిచ్చి సత్కరిస్తామని ప్రకటన చేసాం. రాజ్యంలోని పరిస్థితులు చక్కబడిన వెంటనే మీ వివాహం జరిపిస్తాను,' అని చెప్పాడు.

దానికి విజయుడు 'యువరాజా! మీ ప్రజల క్షేమం కోరి మాత్రమే మీకు సాయం చేసాను. నా దేశాటనలో భాగంగా అనేక అనుభవాలు పొందాను. అందువల్ల ఎంతో తృప్తిని పొందాను. మీ సోదరిని ఆమె కోరుకున్న యువకుడికిచ్చి పెళ్ళి జరిపించండి. నేను మీ దేశానికి సాయం కోరుతూ మందారపురం రాజ్యం వెళ్ళినప్పుడు రాజు మంగళుడు తమ కుమార్తె మోహనాంగిని నాకు ఇచ్చి వివాహం జరిపిస్తామని అడిగారు. మా తండ్రిగారిని ఇప్పటికే వారు సంప్రదించి ఉంటారు. మా తల్లిదండ్రుల అనుమతి ప్రకారమే వివాహం చేసుకుంటాను,' అని చెప్పాడు.

విజయుడిలాంటి వీరుడు బావ అవుతాడనుకున్న ధర్మతేజుడు ఆయన తిరస్కరించడంతో బాధపడ్డాడు.

విజయుడికి అంతలోనే గంధర్వరాజు కుమార్తె చంపకగంధి జ్ఞాపకం వచ్చింది. ఆమెకి ఇచ్చిన మాట కూడా జ్ఞాపకం వచ్చింది. ఆమె తనకిచ్చిన మందారపుష్పం సంగతి గుర్తొచ్చి సంచిలో నుండి పుష్పాన్ని తీసి బయటకు తీశాడు. అప్పటికే అది వాడిపోయింది. ఆమెకు వేరొకరితో వివాహం జరిగినట్టయితే మందారపుష్పం వాడిపోతుందని చంపకగంధి చెప్పిన విషయం గుర్తొచ్చింది విజయుడికి. అదీ ఒకందుకు మంచిదే అయిందనుకున్నాడు అతడు.

విజయుడిని భువన దేశపు ప్రజలు సత్కరించారు. విజయుడి శక్తి సామర్థ్యాలను వేనోళ్ళ పొగిడారు వారు.

తాను ఇంకా నెరవేర్చవలసిన పనులు ఏమున్నాయో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు విజయుడు. అతడికి తన తల్లి గుర్తుకు వచ్చింది. పంచకల్యాణి అతడిని మోసుకుంటూ ఆకాశంలోకి ఎగిరింది. ప్రజలు చేతులూపడం అతడు గమనిస్తోనే ఉన్నాడు.

రౌతు హృదయం తెలిసిన పంచకల్యాణి తన విజయుడిని హేళాపురి రాజ్యం వైపు మోసుకుని పోతోంది. పంచకల్యాణి గిట్టలు మబ్బులను చీల్చుకుంటూ వేగంగా కదులుతున్నాయి. తన ప్రపంచ పర్యటన వృథా కాలేదు. విజయుడు తృప్తిగా నవ్వుకున్నాడు.

* * *

# ఆనందలోకం

## జానపద నవల

'ఎక్కడైనా ఇలా జరుగుతుందా, చోద్యం కాకపోతే...' అనే పదాలకు బాలసాహిత్యపు ఖజానా అయిన జానపద కథాసాహిత్యంలో స్థానం లేదు. 'ఇలా జరిగితే ఎంత బాగుంటుంది!' అనే వూహ బాలబాలికలకు అంతులేని సంతృప్తిని కలిగిస్తుంది. రాజులూ, కోటలూ, సింహాసనాలూ, అంతఃపురం మహారాణి, యువరాణి. ఉద్యానవనాలు, మంత్రగాళ్ళు, పర్వతాకారులైన రాక్షసులూ, కీకారణ్యాలూ, పంచకళ్యాణీలూ, భూగర్భంలో దాగివున్న బంగారం, రత్నరాసులూ, జంతువులుగా మారిపోయిన మనుషులూ, దుర్మార్గులను, కరువు కాటకాలను అంతంచేసే యువకిశోరాలూ - ఓహ్! మాట్లాడే చిలుకలు సరేసరి - కేవలం జానపద సాహిత్యంలో మాత్రమే చూడగలం.

ఇటువంటి వాటితో కూడుకున్న జానపద సాహిత్యం ఆబాలగోపాలాన్ని అలరిస్తుంది. 'ఎక్కడైనా ఇలా జరుగుతుందా, చోద్యం కాకపోతే...' అనకపోతే 'ఆనందలోకపు' విహారానికి బయలుదేరండి! అవశ్యం!

- ఎమ్.వి.వి. సత్యనారాయణ

నారంశెట్టి ఉమామహేశ్వరరావు వృత్తిరీత్యా తపాల శాఖలో ఉద్యోగి. ప్రవృత్తి రీత్యా బాలసాహిత్యకారుడు. వివిధ పిల్లల పత్రికలలోనే కాక పలు సాంఘిక వార, మాస పత్రికలలో ఏడు వందలకు పైగా వీరు రాసిన కథలు, గేయాలు అచ్చయ్యాయి. ఆరు కథల సంకలనాలు ప్రచురితమయ్యాయి. వీరు రాసిన పలు కథలకు బహుమానాలు లభించడమే కాక స్వయంగా ఎన్నో పురస్కారాలు పొందారు. 'పిల్లలకు బాల్యం నుండే తెలుగు కథలు, పాటలు, గేయాలు, సామెతలు, పొడుపు కథలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. అప్పుడే పిల్లలకు మాతృభాష మీద గౌరవం, ప్రేమ కలుగుతాయి.' అనే నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన జానపద నవల 'ఆనందలోకం'.

మంచి పుస్తకం

ISBN 978-93-83936-33-5